అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 31-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 సంచిక : 212

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

16 పేజీలు వెల: 6.50



ఉద్యోగాల భర్తీలో తాత్సారం

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై మోడీ సర్కార్ నిర్లక్ష్యం
- బీజేపీ పదేండ్లపాలనపై నిరుద్యోగుల ఆగ్రహం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. కేంద్ర సాయుధ దళాలు (సీఆర్‌పీఎఫ్), అస్సాం రైఫిల్స్ (ఏఆర్)లోనే 84,106 ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. కేంద్ర విశ్వవిద్యాలయాలలో 16 వేల టీచింగ్, ఐదు వేల నాన్-టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెల 22న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో వివిధ శాఖలకు చెందిన మంత్రులు సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా ఖాళీల వివరాలు అందజేశారు. ప్రభుత్వోద్యోగాల సంఖ్య తగ్గిపోతోందని, ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేయడం లేదని ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వంపై



ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే శాఖలో పెద్ద ఎత్తున ఖాళీలను భర్తీ చేయాల్సి ఉన్నదని, కానీ ఆ మేరకు చర్యలు చేపట్టడం లేదని ప్రతిపక్షాలు విమర్శించాయి. లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు సుఖ్‌దేవ్ భగత్ అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానం ఇస్తూ 2004-2014 మధ్యకాలంలో 4.11 లక్షలు, 2014-2024 మధ్యకాలంలో 5.02 లక్షల నియామకాలు జరిగాయని తెలిపారు. రాజ్యసభలో అన్నా డీఎంకే సభ్యుడు షణ్ముగం అడిగిన ప్రశ్నకు హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ ఈ నెల 1వ తేదీ నాటికి సీఆర్‌పీఎఫ్, ఏఆర్‌లో మొత్తం 10,45,751 పోస్టులు మంజూరు కాగా వాటిలో 84,106 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. 2023 ఏప్రిల్ నుండి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ 67.345 మందిని నియమించామని, 64,091 పోస్టులు నోటిఫై చేశామని, నియామకాలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. కేరళకు చెందిన సీపీఐ (ఎం) సభ్యుడు జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు విద్యా శాఖ సహాయ మంత్రి సుకంత మజుందార్ బదులిస్తూ ఏప్రిల్ 1వ తేదీ నాటికి కేంద్ర విశ్వవిద్యాలయాల్లో 18,940 టీచింగ్ పోస్టులు మంజూరు కాగా 5,060 పోస్టులు, 35,640 నాన్-టీచింగ్ పోస్టులు మంజూరు కాగా 16,719 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.


అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 31-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 212
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
16 పేజీలు వెల : 6.50

మను చరిత్ర



- పారిస్‌లో రెండో కాంస్యం నెగ్గిన మను బాకర్
- మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్జోత్‌తో కలిసి పతక ప్రదర్శన

వివరాలు ఆటలులో.



కేరళ ప్రగతికి లెఫ్ట్ సర్కార్ చేస్తున్న ప్రయత్నాలకు ఎన్నో ఆటుపోట్లు ఎదురవుతున్నాయి. అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న కేరళకు ప్రకృతి ప్రకోపాలు పెను విషాదాలుగా మారుతున్నాయి. తాజాగా కేరళను పెనువిషాదం ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండచరియలు విరిగిపడి 123 మంది జల సమాధి అయ్యారు. ఇలా ఊహించని జల విలయాలు కేరళలను తరచూ అతలాకుతలం చేస్తున్నాయి. అంతకు ముందు నిఫా, కరోనా వైరస్‌లు కోరలు విప్పినా.. ప్రణాళికా బద్ధమైన చర్యలతో నియంత్రించ గలిగిన పినరయి సర్కార్‌కు ఈ జల ప్రళయాలు సవాలుగా మారాయి.

కేరళలో పెను విషాదం

కొండచరియలు విరిగిపడి 123 మంది సజీవసమాధి

- పలువురికి గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- సహాయ కార్యక్రమాలు ముమ్మరం
- రక్షణ చర్యల్లో లెఫ్ట్ సర్కార్

వాయనాడ్ : కేరళలో వర్ష బీభత్సం విధ్వంసం సృష్టించింది. వాయనాడ్ జిల్లాలోని మెప్పాడి సమీప ప్రాంతాలలో మంగళవారం తెల్లవారుజామున పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో 123 మంది సజీవ సమాధి అయ్యారు. 128 మంది గాయపడ్డారు. ఇప్పటి వరకూ 93 మృతదేహాలను వెలికితీశారు. అనేక కుటుంబాల ఆచూకీ తెలియడం లేదు. మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చునని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద నీటిలో అనేక మృతదేహాలు కొట్టుకుపోతున్నాయని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. తెల్లవారుజామున రెండు ...15లో


యుద్ధప్రాతిపదికన కేంద్రం సహాయాన్ని అందించాలి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో మృతుల కుటుంబాలకు సంతాపం

వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో వంద మందికిపైగా మరణించడంపై సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది. మృతుల కుటుం బాలకు సానుభూతి ప్రకటించింది. ఈ మేరకు పొలిట్ బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. కొండ చరియల కింద ఇంకా అనేక మంది చిక్కుకుపోయారని, భారీ ఆస్తి నష్టం కూడా జరిగిందని తెలిపింది. బాధిత కుటుంబాలకు ...15లో

12 రోజుల్లో రూ.12 వేల కోట్లు

రెండో విడత రుణమాఫీ నిధులు విడుదల • రూ.1.5 లక్షల్లోపు రుణాలున్న 6.40 లక్షల రైతులకు లబ్ది



అసెంబ్లీ నుంచే ఖాతాల్లో జమ

- రైతుల్లో సంతోషంతో నా జన్మ ధన్యమైంది : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశానికి ఆగస్టు నెలలోనే స్వాతంత్ర్యం వచ్చిందనీ, ఈ ఏడాది ఆగస్టులోపే తెలంగాణ లోని రైతులందరూ రుణ విముక్తులయ్యారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ జులై, ఆగస్టు నెలలు దేశ చరిత్రలోనే లిఖించదగ్గ నెలలని అభివర్ణించారు. కేవలం 12 రోజుల్లో రూ.12 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత తమదేనని అభిప్రాయపడ్డారు. రైతుల సంక్షేమం విషయంలో

కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎవరు శంకించలేరనీ, తమ ప్రభుత్వ ప్రణాళికలను ఎవరూ ప్రశ్నించలేరంటూ సవాల్ చేశారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లు కేటాయించి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ దేశ చరిత్రలోనే కొత్త రికార్డు అని గుర్తు చేశారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదని తెలియజేశారు. సాధారణంగా ఎన్నికలు వచ్చినప్పుడే కొన్ని పార్టీల నేతలకు రైతులు గుర్తుకు వస్తారని సీఎం అన్నారు. కానీ ఇప్పుడేం ఎన్నికలు, ఓట్లు లేవన్నారు. తమకు రాజకీయ ప్రయోజనాలు కాదనీ, రైతుల ప్రయోజనాలే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా మంగళవారం మధ్యాహ్నం అసెంబ్లీ ప్రాంగణం నుంచే రైతు రుణమాఫీ రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కౌన్సిల్ ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలందరి సమక్షంలో పలువురు రైతులకు చెక్కులు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఇదే వేదిక నుంచి రెండో విడతగా రాష్ట్రంలో రూ.1.5 లక్షల్లోపు పంట రుణాలున్న రైతులందరి ...7లో



కేరళ విలయంపై చర్చకు నో

ఎంపీల ఆందోళనతో దిగొచ్చిన రాజ్యసభ ఛైర్మెన్ ధన్కర్


- కేంద్ర రక్షణ, హెూం, ఆర్థిక శాఖలు చొరవ తీసుకోవాలి :జాన్ బ్రిట్టాస్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో కొండ చరియలు విరిగిపడి అనేక మంది మృతి చెందడంపై రాజ్యసభలో చర్చకు రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధన్కర్ అనుమతి ఇవ్వలేదు. దీనిపై చర్చ అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో కేరళకు చెందిన సీపీఐ(ఎం), సీపీఐ, కేరళ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనతో మాట్లాడేందుకు ధన్కర్ అనుమతినిచ్చారు. దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన వాయనాడ్ దుర్ఘటనపై మంగళవారం పార్లమెంటులోనూ చర్చ జరిగింది. రాజ్యసభలో సీపీఐ(ఎం) ఉపనేత జాన్ బ్రిట్టాస్, సీపీఐ(ఎం) ఎంపీలు వి. శివ దాసన్, ఎఎ రహీమ్, సీపీఐ ఎంపీ పి. సంతోష్ కుమార్, కేరళ కాంగ్రెస్ ఎంపీ జోస్ కె. మణి తదితరులు ఈ అంశాన్ని లేవనెత్తారు. అత్యవసరంగా చర్చ జరపాలని కోరుతూ ఎంపీలు ఇచ్చిన నోటీసును స్పీకర్ జగదీప్ ధన్కర్ తిరస్కరించారు. వాయనాడ్ విపత్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సామరస్యపూర్వకంగా పనిచేస్తున్నాయని, సభలో చర్చ అవసరం లేదని ధన్కర్ స్పష్టం చేశారు. వాయనాడ్‌లో పెను ...15లో

విద్యుత్ విచారణ కమిషన్ కొత్త ఛైర్మెన్‌గా

జస్టిస్ మదన్ బి. లోకూర్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణలో విద్యుత్ విచారణ కమిషన్ కొత్త ఛైర్మెన్‌గా జస్టిస్ మదన్ భీమ్‌రావు లోకూర్ నియమితులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం కొత్త ఛైర్మెన్‌ను నియమించింది. ఇంతకుముందు కమిషన్ ఛైర్మెన్‌గా జస్టిస్ నరసింహారెడ్డి వ్యవహరించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలుకు, యాదాద్రి, భద్రాద్రి సబ్‌క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై విచారణకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ కమిషన్ ఏర్పాటు చేసి ఛైర్మెన్‌గా జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని నియమించింది. విచారణ జరుగుతున్న సమయంలో కమిషన్ ఏర్పాటు, దాని ఛైర్మెన్ నిష్పాక్షికతను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం, కమిషన్ ఛైర్మెన్‌ను మార్చాలని ఆదేశించింది. అదే సమయంలో విచారణ కమిషన్ ఏర్పాటు నోటిఫికేషన్‌ను సైతం కొట్టేయాలన్న కేసీఆర్ వినతిని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో కమిషన్ ఛైర్మెన్ పదవి నుంచి వైదొలుగుతున్నట్టు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తన రాజీనామా లేఖను న్యాయవాది ద్వారా సుప్రీంకోర్టుకు సమర్పించారు. సుప్రీం ఆదేశాల మేరకు కొత్త ఛైర్మెన్‌ను నియమిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నూతన ఛైర్మెన్‌గా జస్టిస్ మదన్ బి, లోకూర్‌ను నియమించింది.



కదం తొక్కిన ఆశాలు

వైద్యారోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం దిగ్బంధం

- ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా ఆందోళన
- ఐదు వేల మంది రాకతో స్తంభించిన కోఠి పరిసరాలు
- దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశా కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్‌లోని కోఠి వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ (ఎన్‌హెచ్‌ఎమ్) కార్యాలయాన్ని ముట్టడించారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదిలాబాద్ నుంచి మొదలుకుని ఖమ్మం వరకు 33 జిల్లాల నుంచి దాదాపు 5 వేల మందికిపైగా తరలి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఉదయం 11.30 గంటల నుంచి ...8లో

కమిషనర్ హామీతో
ధర్నా విరమణ

తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు జయలక్ష్మి

ఆశా వర్కర్ల డిమాండ్లను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ధర్నా స్థలికి వచ్చి హామీ ఇవ్వడంతో నిరసనను విరమించాం. రూ. 50 లక్షల ఇన్సూరెన్స్ కోసం బ్యాంక్‌లతో మాట్లాడి మూడు నెలల్లో జీవో జారీ చేస్తామని చెప్పారు. మట్టి ఖర్చుల కింద రూ. 50 వేల కోసం ఉత్తర్వులిస్తామనీ, ఆగస్టులోగా ప్రింటెడ్ రిజిస్టర్ అందజేస్తామనీ, పల్స్ పోలియో డబ్బులు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కనీస వేతనం రూ.18 వేల గురించి ప్రభుత్వానికి విన్నవిస్తామని వెల్లడించారు. మిగతా డిమాండ్లపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే భవిష్యత్‌లో ఆందోళనను ఉధృతం చేస్తాం.



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు
అన్యాయం

బీజేపీపై పోరాటంలో కాంగ్రెస్ ముందుండాలి

భువనగిరిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-వలిగొండ

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణను విస్మరించారని, పూర్తిగా అన్యాయం జరిగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బడ్జెట్ విషయంలో ప్రజలు బీజేపీని వ్యతిరేకించాలని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు అన్యాయం చేసిందని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని స్థానిక సాయిగణేష్ ఫంక్షన్‌హాల్‌లో ...15లో

కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు



- ఆయనను విడుదల చేయాలి : ఇండియా బ్లాక్ నేతల డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద ఆందోళన

వివరాలు 8లో



గద్వాల ఎమ్మెల్యే బ్యాక్ టు బీఆర్‌ఎస్..

అసెంబ్లీ లాబీల్లో మాజీ మంత్రి కేటీఆర్‌తో భేటీ

వివరాలు 8లో

మహానగరంలో దారుణాలు

- రన్నింగ్ బస్సులో మహిళపై డ్రైవర్ లైంగికదాడి
- బస్సును ఛేజ్ చేసి పట్టుకున్న ఓయూ పోలీసులు
- మరో ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై స్నేహితుల అమానుషం



వివరాలు 15లో



జార్ఖండ్‌లో రైలు ప్రమాదం

- ఇద్దరి మృతి.. 20 మందికి గాయాలు
- వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా కేంద్రం చర్యల్లేవ్

వివరాలు 15లో



బొగ్గు బ్లాకులపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- వేలం నిలిపేసి సింగరేణికి కేటాయించాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి వీడాలి
- సింగరేణి పరిరక్షణ యాత్రలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

వివరాలు 16లో

నిండుకుండలా
శ్రీశైలం

పది గేట్ల ద్వారా నీటి విడుదల

సాగర్‌కు పరవళ్లు తొక్కుతున్న వరద




వివరాలు 8లో

రాజకీయ పార్టీలకు అందించిన విరాళాలకు సంబంధించి కార్పొరేట్ పెద్దలు, సంస్థలకు ఇచ్చిన పన్ను మినహా యింపుల కారణంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.3,967.54 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పార్లమెంటుకు సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ మేరకు అంచనాలు వేసింది. 2021-22లో కోల్పోయిన ఆదాయం కంటే ఇది 13 శాతం అధికం. పార్టీలకు అందుతున్న విరాళాలు కూడా పెరుగుతున్నాయని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. వాస్తవానికి గత తొమ్మిది సంవత్స రాలుగా ఎన్నికల విరాళాలు పెరుగుతూనే ఉన్నాయి.

ప్రభుత్వ ఖజనాకు విరాళాల గండి

రాజకీయ పార్టీలకు డొనేషన్లపై పన్ను మినహాయింపులు

- 2022-23లో రూ.4000 కోట్ల రాయితీలు



న్యూఢిల్లీ : 2021-22లో రాజకీయ పార్టీల విరాళాలకు ఇచ్చిన పన్ను రాయితీలు రూ.3,516.47 కోట్లు. అంతకుముందు సంవత్స రంతో పోలిస్తే ఇది ఏకంగా 300 శాతం పెరిగింది. 2014-15లో ఈ మొత్తం కేవలం రూ.170.86 కోట్లు మాత్రమే. మొత్తంగా చూస్తే 2014 -15 నుండి తొమ్మిది సంవత్సరాల కాలంలో రాజకీయ విరాళాలపై పార్టీలు పొందిన పన్ను రాయితీల మొత్తం రూ.12,270.19 కోట్లు. 2023-24కు సంబంధించిన సమాచారం ఇంకా బహిర్గతం కాలేదు. ఆదాయపన్ను చట్టం కింద రాజకీయ పార్టీలకు అందించే విరాళాలపై భారతీయ కంపెనీలు ...15లో

పేరులోనే 'సంక్షేమ'ం!

సంపాదకీయం

'కాంగ్రెస్ వస్తుంది.. మార్పు తెస్తుంది' అంటూ ఎన్నికలప్పుడు గొప్పగా ప్రచారం చేశారు. తమది నూటికి నూరు శాతం సంక్షేమ ప్రభుత్వమని ఢంకా బజాయించి మరీ చెప్పుకున్నారు. అధికారంలోకి వచ్చారు. కానీ సంక్షేమ హాస్టళ్ల దుస్థితిలో మాత్రం ఎలాంటి మార్పూ తేలేదు. పేరుకే అవి సంక్షేమ హాస్టళ్లు. లోపలంతా క్షామమే. గత పది రోజులుగా కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) చేపట్టిన హాస్టళ్ల అధ్యయన యాత్రలో బయటపడిన పచ్చినిజం ఇది. రాష్ట్రంలో పాఠశాలలు పున:ప్రారంభించి నెలన్నర పూర్తయింది. హాస్టళ్లలో ఈ విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలు కూడా పూర్తయ్యాయి. కానీ హాస్టళ్లు మాత్రం వసతుల లేమీ, అపరిశుభ్రత ఇతర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి.

నిరుపేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించి వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం సంక్షేమ వసతి గృహాల ప్రధాన ఉద్దేశం. కానీ నేడు వసతి గృహాలన్నీ మురుగుకూపాలను తలపిస్తున్నాయి. పర్యవేక్షించే అధికారులు పట్టించుకోక కంపు కొడుతున్నాయి. ఎక్కడచూసినా విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు దర్శన మిస్తున్నాయి. ఆవరణమంతా చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఇక శుభ్రత లేని మరుగుదొడ్లతో ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. విద్యార్థుల ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు లేడు. దీనికితోడు నీళ్ల చారు, పురుగుల అన్నం, అర్థాకలితో చదువు, పాములు, తేళ్లు, విషపురుగులతో సహజీవనం. ఇది నేటి సంక్షేమ హాస్టళ్ల దుస్థితి. నిజానికి వేసవి సెలవుల్లో దాదాపు నెలన్నర పాటు వసతి గృహాలన్నీ మూసి ఉన్నాయి. తిరిగి తెరిచేనాటికి వాటిని చక్కదిద్దాల్సిన అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రతి ఏడాది విద్యార్థుల పాలిట ఇదే శాపంగా మారుతున్నది. మరోవైపు హాస్టళ్లలో వంట కోసం టెండర్లు పూర్తికాకపోవడం, మెస్ చార్జీలు సరిపోకపోవడంతో విద్యార్థులకు సరైన ఆహారమందని పరిస్థితి నెలకొంది.



రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో 1750 వసతి గృహాలున్నాయి. అందులో 497 పోస్టు మెట్రిక్, 1,523 ప్రీమెట్రిక్ హాస్టళు. వీటిలో సుమారు రెండున్నర లక్షల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇటీవల పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో చేరికలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం వృత్తి విద్యా కోర్సులైన పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజనీరింగ్ తదితర ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు వీటిలో అడ్మిషన్లు కొనసాగుతాయి. ఇలా వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వసతుల లేమి మాత్రం వారి చదువు లకు ఆటంకంగా మారింది.

రాష్ట్రంలో 858 సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. వాటికి చెల్లించాల్సిన అద్దె బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. మొత్తంగా సుమారు రూ.12 కోట్ల మేర బకాయిలున్నట్టు అధికార గణాంకాలే చెబుతున్నాయి. కొన్ని హాస్టల్ భవనాలకు ఏడాదికిపైగా బిల్లులు రావడం లేదని అధికారులు అంటున్నారు. నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో ఖాళీ చేయాలంటూ యజమానులు ఒత్తిడి చేస్తున్నారని హాస్టళ్ల నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల సంఖ్యకు మించి విద్యార్థులను చేర్చుకుంటున్నారు. దాంతో కనీస వసతులు లేక విద్యార్థులు నానాయాతన అనుభవిస్తున్నారు.

2016నుండి మెస్‌చార్జీల కోసం కేవలం రూ.1500 మాత్రమే అందిస్తున్నారు. ఆకాశాన్నంటుతున్న ధరలకూ, ప్రభుత్వం ఇస్తున్న మెస్ చార్జీలకు ఏమాత్రం పొంతనలేదు. విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం ఉండటం లేదు. చాలీచాలని భోజనం, టిఫిన్‌తో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే ప్రభుత్వ వైద్యాధికారులు హాస్టల్స్‌ను నెలకోసారి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలనే జీవో కూడా ఉంది. కానీ ఇది ఎక్కడా అమలవడం లేదు. చాలా హాస్టళ్లలో అమ్మాయిలకు రక్షణే లేదు. ఇక కాస్మోటిక్ ఛార్జీల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. ఎందుకంటే ప్రభుత్వం వీటిని కేవలం మొక్కుబడిగా మాత్రమే చెల్లిస్తోంది. అమ్మాయిలకు నెలకు ఇస్తున్న రూ.75లతో కనీసం కొబ్బరి నూనె కూడా వచ్చే పరిస్థితి లేదు. అవి కూడా నాలుగు నెలలు నుండి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలాంటి ఎన్నో సమస్యలతో ఈ హాస్టళ్ల సంక్షేమం కరువై సంక్షోభంతో అల్లాడుతున్నాయి.

ఈ సమస్యలన్నీ పరిశీలిస్తే సర్కారు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సమస్యలను గాలికొదిలేసిందనేది స్పష్టం. పైగా హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న విద్యార్థి సంఘ నాయకులను అన్యాయంగా అరెస్టు చేస్తున్నారు. దేశ భవితకు పునాదిరాళ్లైన విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించడం తగదన్నది జనవాక్కుగా ఉంది. కనుక ఇప్పటికైనా రేవంత్ సర్కారు స్పందించాలి. సంక్షేమ హాస్టళ్లల్లో సమస్యలు పరిష్కరించేందుకు పూనుకోవాలి.

> విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం ఉండటం లేదు. చాలీచాలని భోజనం, టిఫిన్‌తో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే ప్రభుత్వ వైద్యాధికారులు హాస్టల్స్‌ను నెలకోసారి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలనే జీవో కూడా ఉంది. కానీ ఇది ఎక్కడా అమలవడం లేదు. చాలా హాస్టళ్లలో అమ్మాయిలకు రక్షణే లేదు. ఇక కాస్మోటిక్ ఛార్జీల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. ఎందుకంటే ప్రభుత్వం వీటిని కేవలం మొక్కుబడిగా మాత్రమే చెల్లిస్తోంది.

వెనెజులా ఎన్నికలు : సోషలిస్టు మదురో మూడోసారి విజయం!



ఎం కోటేశ్వరరావు
8331013288

జూలై 28న జరిగిన వెనెజులా ఎన్నికల్లో అమెరికా మద్దతు ఉన్న మితవాద, ఫాసిస్టు శక్తులు చావు దెబ్బతిన్నాయి. సోషలిస్టు పార్టీ నేత నికోలస్ మదురో మూడవసారి ఎన్నికయ్యాడు. ఆరు సంవత్సరాలు (2031వరకు) పదవిలో ఉంటాడు. ఈ ఎన్నికల్లో మదురోను ఓడించేం దుకు అమెరికా నాయకత్వంలోని వామపక్ష వ్యతిరేక శక్తులన్నీ తీవ్రంగా ప్రయత్నించాయి. ఎన్నికల ఫలితాల తరువాత కూడా అక్రమాలు జరిగాయని, గుర్తించబోమని నానా యాగీ చేస్తున్నాయి. మరోవైపు దేశమంతటా నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చాయి. మదురోకు మద్దతుగా కూడా అనేకచోట్ల జనం వీధుల్లోకి వస్తున్నట్లు వార్తలు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన వివరాల మేరకు మదురోకు 53.67శాతం ఓట్లు రాగా ప్రత్యర్థి ఎడ్మండో గోన్‌సాల్వెజ్‌కు 46.33శాతం వచ్చాయి. మరోవైపున ఇతగాడిని సమర్థించిన డెమోక్రటిక్ యూనిటీ ఫ్లాట్ ఫాం(డియుపి) గోన్‌సాల్వెజ్‌కు 69.46శాతం రాగా మదురోకు 30.54శాతం వచ్చినట్లు పోటీగా ఫలితాలను ప్రకటించింది. ఇది అమెరికా కనుసన్నల్లో పనిచేసే ప్రతిపక్ష పార్టీలు, శక్తుల కూటమి. మదురోకు వ్యతిరేకంగా ప్రదర్శలకు దిగిన శక్తుల మద్దతుదార్లు అనేక చోట్ల దివంగత మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్ విగ్రహాలు, చిహ్నాలను ధ్వంసం చేస్తున్నారు. చావెజ్ రాజకీయ వారసుడిగా మదురో రంగంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం నాడు ఇది రాసిన సమయానికి కొందరు ప్రదర్శకులు అధ్యక్ష భవనంపై దాడికి వెళుతున్నట్లు, దేశమంతటా రోడ్ల దిగ్బంధనానికి పూనుకున్నట్లు వార్తలు వచ్చాయి. ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని నినాదాలు చేస్తున్నారు. ముందే ఇలాంటి పరిణామాలను ఊహించిన కారణంగా రాజధాని కారకాస్ నగరంతో సహా దేశమంతటా పోలీసు, జాతీయ భద్రతా దళాలను పెద్ద ఎత్తున మోహరించారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష గోన్‌సాల్వెజ్‌కు పరిస్థితి అనుకూలంగా ఉన్నట్లు సర్వేలు పేర్కొన్నాయని, ఫలితాలు వాటిని ప్రతిబింబించలేదని అమెరికా వ్యాఖ్యానించింది.ప్రజల ఆకాంక్షను ఫలితాలు ప్రతిబింబించ లేదని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వ్యాఖ్యానిం చాడు. చైనా, రష్యా, క్యూబా మరికొన్ని దేశాలు మదురోను అభినందించాయి. 2018 ఎన్నికల్లో కూడా సర్వేలన్నీ మదురోకు వ్యతిరేకంగా, ప్రతిపక్ష అభ్యర్థి ముందంజలో ఉన్నట్లే చెప్పాయి. అవన్నీ మదురోను వ్యతిరేకించే శక్తులు వండి వార్చిన కతలు తప్ప మరొకటి కాదు. తన ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కూల్చివేసేం దుకు కుట్ర జరిగిందని అధ్యక్షుడు మదురో టీవీ ప్రసంగంలో దేశ పౌరులకు చెప్పాడు. దీని గురించి ముందే తెలుసని అయితే చట్టాన్ని గౌరవిస్తామని, తన మద్దతుదార్లు ప్రశాంతంగా ఉండాలని కోరాడు."నేను నికోలస్ మదురో మోరోస్ వెనెజులా బొలివేరియన్ రిపబ్లిక్ అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికయ్యాను. మన ప్రజాస్వామ్యం, చట్టం, పౌరులను కాపాడ తాను" అని ఎన్నికల ఫలితాలు వెల్లడి కాగానే మదురో ప్రకటించాడు.

2013లో చావెజ్ మరణించిన తరువాత అధికారానికి వచ్చిన నికోలస్ మదురో అనేక సవాళ్లు, కుట్రలను ఎదుర్కొంటున్నాడు. ప్రధాన రాబడి వనరైన చమురు అమ్మకాలు, రవాణాపై అనేక ఆంక్షలు, దిగ్బంధనాలతో అమెరికా, లాటిన్ అమెరికాలోని దాని మిత్రదేశాలు, ఐరోపా యూనియన్ దేశాలూ ఇబ్బందులు పెట్టేందుకు, జనాన్ని రెచ్చగొట్టేందుకు చూస్తున్నా యి. ఎన్నికల ఫలితాలపై ప్రపంచ దేశాల స్పందన వెలువడింది. లాటిన్ అమెరికాలో వామపక్ష వాదులను సమర్థించే దేశాలు మదురోకు శుభాకాంక్షలు పలకగా వ్యతిరేక దేశాలు ప్రతికూలంగా స్పందించాయి. వెనెజులా కమ్యూనిస్టు పార్టీతో సహా చిలీలోని వామపక్ష ప్రభుత్వం ఎన్నికలు సక్రమంగా జరిగినట్లు వివరాలను వెల్లడించాలని ప్రకటించటం గమనించాల్సిన అంశం. సకాలంలో ఫలితాలతో పాటు పోలింగ్ కేంద్రాల వారీ ఓటింగ్ వివరాలను వెంటనే ప్రకటించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కోరినట్లు ప్రతినిధి ప్రకటించాడు. మదురోను వ్యతిరేకించే దేశాలు రంగంలోకి దిగాయి. అమెరికా దేశాల సంస్థ (ఓఏఎస్) అత్యవసర సమావేశం జరిపి ఫలితాలను సమీక్షించాలని కోరుతున్నాయి. వాస్తవాలు తేలేవరకు వెనెజులాతో దౌత్య సంబంధాలను స్తంభింపచేస్తున్నట్లు పనామా ప్రకటించింది. పూర్తి సమీక్ష జరిపే వరకు కారకాస్‌లో ఉన్న తమ దౌత్య సిబ్బందిని వెనక్కు పిలిపిస్తున్నట్లు పేర్కొన్నది. ఫలితాలను అంగీకరించని, వ్యతిరేకించిన పనామా, పెరు, అర్జెంటీనా, చిలీతో సహా ఏడు దేశాల నుంచి తాను కూడా దౌత్య సిబ్బందిని ఉపసంహరిస్తున్నట్లు మదురో ప్రకటించాడు. ఎన్నికల పరిశీలకులను పంపిన కార్టర్ సెంటర్ కూడా పోలింగ్ కేంద్రాల వారీ ఫలితాలను ప్రకటించాలని కోరింది. ఈ సారి ఎలాగైనా మదురో, వామపక్ష శక్తులను దెబ్బతీస్తామని కలలు గన్న తిరోగామి శక్తులు ఆశాభంగం చెందినట్లు స్పందనలు వెల్లడించాయి. ఫలితాలను ఆలస్యం చేసేందుకు, లెక్కింపు ప్రక్రియను దెబ్బతీసేందుకు జరిగిన ప్రయత్నాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు అటార్నీ జనరల్ తారెక్ సాబ్ ప్రకటించాడు. తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకొంటున్న లిమా విదేశీ శక్తుల బృందాన్ని ఖండిస్తున్నట్లు విదేశాంగ మంత్రి యవన్ గిల్ ప్రకటించాడు. తొత్తు ప్రభుత్వాన్ని రుద్దేందుకు ఇప్పుడే కాదు 2019లో కూడా ప్రయత్నించారని అన్నాడు. వెనెజులా చట్టం ప్రకారం స్వతంత్ర పరిశీలకు ప్రతి పోలింగ్ బూత్‌లో లెక్కింపు జరిగి ఫలితాలను సరిచూసేందుకు, రాతపూర్వంగా ఫలితాలను పొందేందుకు అవకాశం ఉంది. ఫలితాలు వెలువడి మదురో గెలిచినట్లు ప్రకటించిన తరువాత అంతర్జాతీయ పరిశీలకుల తనిఖీకి అనుమతించాలని ప్రతిపక్షాలు కొత్తపల్లవి అందుకున్నాయి.



> 2013లో చావెజ్ మరణించిన తరువాత అధికారానికి వచ్చిన నికోలస్ మదురో అనేక సవాళ్లు, కుట్రలను ఎదుర్కొంటున్నాడు. ప్రధాన రాబడి వనరైన చమురు అమ్మకాలు, రవాణాపై అనేక ఆంక్షలు, దిగ్బంధనాలతో అమెరికా, లాటిన్ అమెరికాలోని దాని మిత్రదేశాలు, ఐరోపా యూనియన్ దేశాలూ ఇబ్బం దులు పెట్టేందుకు, జనాన్ని రెచ్చగొట్టేందుకు చూస్తున్నాయి. ఎన్నికల ఫలితాలపై ప్రపంచ దేశాల స్పందన వెలువడింది. లాటిన్ అమెరికాలో వామపక్ష వాదులను సమర్థించే దేశాలు మదురోకు శుభాకాంక్షలు పలకగా వ్యతిరేక దేశాలు ప్రతికూలంగా స్పందించాయి. వెనెజులా కమ్యూనిస్టు పార్టీతో సహా చిలీలోని వామపక్ష ప్రభుత్వం ఎన్నికలు సక్రమంగా జరిగినట్లు వివరాలను వెల్లడించాలని ప్రకటించటం గమనించాల్సిన అంశం.

గత పాతికేండ్లుగా వెనెజులాలో వామపక్ష ఉద్యమం, ప్రభుత్వాలను కూల్చివేసేందుకు దేశంలోని తిరోగామి శక్తులు, వాటికి మద్దతిస్తున్న అమెరికా చేయని కుట్ర లేదు. ఫాసిస్టు శక్తులు ఎప్పటికప్పుడు ఊసరవెల్లి మాదిరి రూపాన్ని మార్చుకొని ముందుకు వస్తున్నాయి. జనంలో వాటికి ఆదరణ లేకపోవటంతో జాతీయవాదంతో ఆకర్షించాలని చూస్తున్నాయి. అమెరికా తొత్తులుగా పనిచేస్తున్నాయి. ఎన్నికుట్రలు చేసినా, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు కలిగించినా అధికారానికి వచ్చిన వామపక్షశక్తులు ఉన్నంతలో కార్మికవర్గాన్ని కాపాడేందుకు చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాల కారణంగా వాటి ఆటలు సాగటం లేదు. దీని అర్థం వెనెజులాకు వాటితో ముప్పు లేదని కాదు. మదురో అనుసరిస్తున్న విధానాలన్నీ సరైనవే అని కాదు. వెనెజులా ఎన్నికల్లో పాల్గొనేవారి శాతం క్రమంగా తగ్గుతున్నది. మదురో విధానాలను కాపాడుకోవాలని జనాల్లో కోరిక బలంగా ఉంటే ఎన్నికల్లో పాల్గొనేవారి శాతం పెరగాల్సి ఉంది. కానీ 2013లో 79.65శాతం మంది పాల్గొంటే 2018లో 45.73శాతానికి పడిపోయింది. ఈ సారి 44.85శాతానికి తగ్గింది. 2018 ఎన్నికల్లో మదురోకు 67.85శాతం ఓట్లు రాగా ఇప్పుడు 53.67శాతమే వచ్చాయంటే కొన్ని తరగతుల్లో అసంతృప్తి ఉందన్నది స్పష్టం. పోయినసారి మదురో మీద పోటీచేసిన ప్రత్యర్థులలో ఇద్దరికి 20.93-10.75 శాతాల చొప్పున వచ్చాయి. ఈ సారి ఒకే అభ్యర్థి రంగంలో ఉన్నాడు. చావెజ్ అనుసరించిన సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాలను మదురో కూడా కొనసాగిస్తున్నప్పటికీ అంతర్గత విధానాల మీద వెనెజులా కమ్యూనిస్టు పార్టీ(పిసివి) ఇతర కొన్ని వామపక్ష పార్టీలు విమర్శనాత్మక వైఖరితో ఉన్నాయి.లాటిన్ అమెరికాలో అధికారానికి వచ్చిన ఇతర వామపక్ష నేతల మాదిరిగానే మదురో కూడా పెట్టుబడిదారీ విధాన పునాదులను ముట్టుకోకుండా సంస్కరణలతో, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమాన్ని విబేధించిన వామపక్ష శక్తులను సహించటం లేదని కమ్యూనిస్టు పార్టీ విమర్శించింది.

గతంలో చావెజ్, మదురో ప్రభుత్వానికి వెలుపలి నుంచి మద్దతు ఇచ్చిన కమ్యూనిస్టు పార్టీ ఇటీవలి సంవత్సరాలలో మదురో విధానాలతో విబేధిస్తున్నది. తన విధానాలను విమర్శించిన వామపక్ష శక్తులను ప్రతి పక్షపార్టీల ఏజెంట్లుగా మదురో దాడి చేశాడు. చావెజ్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చూస్తే ఏ కమ్యూనిస్టు లేదా వామపక్ష పార్టీగానీ ప్రతిపక్ష మితవాద శక్తులను సమర్థించిన దాఖలా లేదు. విమర్శనాత్మకంగా ఉంటూనే సోషలిస్టు ప్రభుత్వాలకు మద్దతు ఇచ్చాయి. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీకి పార్లమెంటులో ఒక స్థానం, ఎనిమిది మంది మేయర్లు ఉన్నారు. తమ పార్టీ నేతల మీద విచారణకు ఆదేశించిన ప్రభుత్వ చర్యను వెనెజులా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఆస్కార్ ఫిగుయెరా గోన్‌సాల్వెజ్ ఖండించాడు. పార్టీ నిబంధనావళి ప్రకారం ఎన్నికైన నేతల స్థానే వేరే వారిని ఎంచుకోవాలని కోర్టు చెప్పటం అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవటమే అని పార్టీ విమర్శించింది. కోర్టు సూచించిన ఏడుగురు పార్టీ సభ్యులు కూడా కాదని అందువలన అది చట్టవిరుద్ధమని కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్లీనరీ సమావేశం పేర్కొన్నది. వారితో పోటీ పార్టీ సమావేశాలను కూడా ఏర్పాటు చేయించారు. చావెజ్ హయాంలో ప్రారంభించిన అనేక సంక్షేమ కార్యక్రమాలను మదురో రద్దుచేశారని, పౌరసేవలు దిగజారినట్లు కూడా పేర్కొన్నది.కార్మికుల ఆదాయాలు, హక్కులకు కోత పెట్టిందని, సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు వేతనాల పెంపుదల, ప్రయివేటు గుత్త సంస్థల రద్దు వంటి విప్లవాత్మక చర్యలు చేపట్టటానికి బదులు ఉదారవాద సంస్కరణలకే పరిమితం అయ్యారని పేర్కొన్నది. అమెరికా డాలర్ల చెలామణిని స్వేచ్ఛగా అనుమతించటాన్ని, మారకపు విలువపై అదుపును వదలివేశారని, దిగుమతులపై పన్ను రద్దు చేయటాన్ని అనేక మంది ఆర్థికవేత్తలు తప్పు పట్టారు.మదురో ఆచరణాత్మక విధానాలను అనుసరిస్తున్నారని కొందరు సమర్థిస్తే నయా ఉదారవాద విధానాలు తప్ప మరొకటి కాదని కమ్యూనిస్టు పార్టీ స్పష్టం చేసింది. అంతే కాదు, తనతో పాటు కలసివచ్చే వామపక్ష పార్టీలను కలుపుకొని ప్రజా విప్లవ ప్రత్యామ్నాయం పేరుతో ఒక కూటమిని ఏర్పాటు చేసింది.ఈ కూటమిలో కమ్యూనిస్టు పార్టీతో సహ మరో నాలుగు పార్టీల నాయకత్వాన్ని మార్చాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయం మీద పోలీసులు దాడి చేశారు. ఇటీవలి కాలంలో అనేక రంగాలలో కార్మికులు జరుపుతున్న పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ మద్దతు ప్రకటించింది, దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. గతేడాది కార్మికుల పోరాటాలు అంతకుముందు ఏడాది కంటే వెయ్యి రెట్లు ఎక్కువ పెరిగాయి.కమ్యూనిస్టు పార్టీ లేదా మరొక పార్టీలో అంతర్గత సమస్యలేవైనా ఉంటే వారు తేల్చుకుంటారు తప్ప కోర్టులు నాయకత్వాన్ని సూచించటం అప్రజాస్వామికం.

బాల్య వివాహాలు - సామాజిక సమస్య

బాల్య వివాహాలపై ఈ నెల15వ తారీఖున కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఓ మైలురాయి లాంటిది. 18 ఏండ్ల లోపు ఉన్న ముస్లిం బాలికకు వివాహం చేశారనే ఆరోపణలపై కోర్టు స్పందించింది."బాల్య వివాహాల నిషేధ చట్టం మతంతో సంబంధం లేకుండా భారతీయ పౌరులందరికీ వర్తిస్తుంది. బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, మతంతో సంబంధం లేకుండా భారతీయ పౌరులందరికీ వర్తిస్తుంది. ప్రతి భారతీ యుడు మొదట పౌరుడు. ఆ తరువాత మాత్రమే ఒక మతంలో సభ్యుడవుతాడు. పౌరసత్వం మొదటిది. మతం ద్వితీయమైనది." అని తీర్పు ఇవ్వడం చాలా హర్షించదగ్గ విషయం. తీర్పులోని ఒక్కొక్క వాక్యం ఆణిముత్యం లాంటిది. ముందు మనం భారతీయులమనేది విస్తృత అర్థాన్ని ఇస్తుంది. దేశంలో మతమనేది వ్యక్తిగతం. బాల్య వివాహాలు శతాబ్దాలుగా వివిధ సంస్కృతులు, ప్రాంతాలలో కొనసాగుతున్న ఒక లోతైన సామాజిక సమస్య. బాలల శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సుపై బాల్య వివాహం హానికరమైన ప్రభావాలను గుర్తించి అనేక దేశాలు బాలల హక్కులను రక్షించడానికి చట్టాన్ని రూపొందించారు. మన దేశంలో బాల్య వివాహాల సమస్యను పరిష్కరించడానికి, మైనర్ల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి సమగ్ర చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌గా బాల్య వివాహాల నిషేధ చట్టం 2006లో ఆమోదించబడింది.

చట్టం అమలు తీరు

భారతదేశంలో బాల్య వివాహాల ఆచారం మొదటిసారిగా 1929లో బాల్య వివాహ నిరోధక చట్టం-1929 ద్వారా చట్టబద్ధంగా నిషేధించబడింది. ఈ చట్టం 1978లో మహిళలకు కనీస వయస్సును 18 ఏండ్లకు, పురుషులకు 21 ఏండ్లకు పెంచింది. బాల్యవివాహాల నిషేధ చట్టం (2006) 1978 చట్టం స్థానంలో అదే కనీస వయో పరిమితులను కలిగి ఉంది. మనదేశంలో 2.4 కోట్లకు పైగా బాలవధువులు ఉన్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్



ఎస్) ప్రకారం ప్రపంచంలోని ఆరు కోట్ల బాల్య వివాహాలలో 40 శాతం మన దేశంలోనే జరుగుతున్నాయి. ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఉమెన్ ప్రకారం ప్రపంచంలో బాల్య వివాహాల రేటులో మనదేశం14వ స్థానంలో ఉంది. విభిన్న వివాహ సంప్రదాయాలు, ఆచారాలు ప్రాంతాలు, కులాలు తెగల ఉండడం వలన దేశంలోని వాయువ్య ప్రాంతంలో ఆగ్నేయం కంటే బాల్య వివాహాల రేటు ఎక్కువగా ఉంది. బీహార్, రాజస్థాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో బాల్యవివాహాల రేటు ఎక్కువగా ఉంది. పశ్చిమ బెంగాల్, బీహార్, త్రిపురలలో 20 నుండి 24 వయస్సు గల స్త్రీలలో 40శాతం కంటే ఎక్కువ మంది 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారు ఉన్నారు. కేరళలో 18 ఏండ్లలోపు వివాహం చేసుకున్న మహిళలు శాతం 2015-16లో 7.6 ఉంటే 2019-20లో 6.3శాతానికి చేరుకుంది.ఆరోగ్య సర్వే 2019-21 ప్రకారం 20 నుండి 24 మధ్య వయస్సు గల స్త్రీలలో 23శాతం మంది 18 సంవత్సరాల కంటే ముందే వివాహం చేసుకున్నారు. 2005-06 మూడో సర్వేలో 47శాతం నుండి 2015-16 నాలుగో సర్వేలో 27 శాతానికి తగ్గాయి.

బాల్యవివాహాలు..పరిణామాలు

బాల్యవివాహాలు అమ్మాయిలు, అబ్బాయిలు ఇద్దరినీ ప్రభావితం చేస్తాయి. అయితే ఆడపిల్లలను అసమానంగా ప్రభావితం చేస్తాయి. బాలికల బాల్యాన్ని తుంచి వేస్తాయి. పిల్లలకు విద్య, ఆరోగ్యం, దోపిడీ నుండి రక్షణ లాంటి ప్రాథమిక మానవ హక్కులను నిరాకరిస్తాయి.శిశు మరణాలు, ప్రసూతి మరణాలు, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలకు ఈ వివాహాలు దారి తీస్థాయి. పేదరికాన్ని శాశ్వతం చేస్తాయి. ఆర్థిక అవకాశాలను పరిమితం చేస్తాయి. మానసిక గాయాలకు దారి తీయవచ్చు. డిప్రెషన్, ఆందోళనకు కారణమవుతాయి. సామాజిక ఒంటరితనాన్ని పెంచుతాయి. ఇది కుటుంబం, సమాజం నుండి వేరుచేయడానికి దారితీస్తుంది. గృహహింస, లైంగిక వేధింపుల ప్రమాదాలను, ప్రసూతి మరణాల రోగాల రేటును పెంచుతాయి. చిన్న తల్లులకు జన్మించిన పిల్లలు అధిక మరణాల రేటును కలిగి ఉంటారు. ఆచారాలు సంప్రదాయాలు, పితృస్వామ్య సమాజం, కొన్ని సంస్కృతులలో చిన్న వయస్సులో ఉన్న అమ్మాయిని వివాహం చేసుకోవడం అమ్మాయి లైంగికతతో పాటు కుటుంబ గౌరవాన్ని "రక్షిస్తుంది" అని భావిస్తారు. మతపరమైన నిబంధనలు, పెరుగుతున్న పెండ్లి ఖర్చులు, పేదరికం, కుల అసమానతలు, చట్టాల అమలులో అలసత్వం, లింగ వివక్ష, నిరక్షరాస్యత మొదలైనవి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

పరిష్కారాలు

బాల్య వివాహాలను అంతం చేయడం బహుళ వ్యవస్థల సమన్వయంతో కూడిన చర్యతో మాత్రమే సాధ్యమవుతుంది. ప్రతీ వివాహం అధికారికంగా నమోదును తప్పనిసరి చేయాలి. బాలికలకు సాధికారత కల్పించాలి. బాలికలకు వారి కుటుంబాలకు ఆర్థిక మద్దతు కల్పించాలి. బాలికలకు ఉన్నతమైన నాణ్యత కలిగిన విద్యను అందించాలి. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలును ఏర్పాటు చేయాలి. బాల్య వివాహాల నిషేధ అధికారులు ప్రజలలో అవగాహన కల్పించాలి. బాల్య వివాహాలపై అవగాహన కల్పించడంలో నిషేధించడంలో ప్రింట్, విజువల్ మీడియా కీలక పాత్ర పోషించాలి. చట్టాలను అమలు చేయాలి. వేగంగా శిక్షలు ఖరారు చేయాలి. అతిక్రమించిన వారిపై ఉక్కుపాదాన్ని మోపాలి.

- జనక మోహన రావు దుంగ,
8247045230

ఉద్యోగ స్కీములు మోసం - కార్పొరేట్లకే లాభం

భారత ఆర్థిక వ్యవస్థ చాలా క్లిష్టమైన చౌరస్తాలో వుంది. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరుగుదల రేటు ఏ విధంగానూ ఉద్యోగ కల్పనా సామర్థ్యాన్ని పెంచలేకపోతున్నది. కల్పించబడిన ఉద్యోగాలలో కూడా 57.3 శాతం స్వయం ఉపాధి రంగానివే. 18.3 శాతం ఏ ప్రతిఫలం లేని ఇంటి పనివారివైతే 45 శాతం పైగా వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకం (పిఎల్ఐ) పేరిట 2020 మార్చిలో ప్రవేశ పెట్టిన పథకం ఉత్పత్తి రంగంలో ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. ఏడాది కేడాది భారతీయ వస్తూత్పత్తి రంగంలో కొట్టచ్చినట్టుగా తగ్గిపోతున్న ఉత్పాదకత 2022-23 నాటికి 2.38 శాతానికి చేరింది. అయితే మోడీ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహకాలు, ఇంకా అనేక రకాలైన నిలువు దోపిడీ వరప్రసాదాలు కలగలసి దేశంలోని లిస్టెడ్ కంపెనీలు 2023-24లో అపారంగా 10.1 శాతం నికర లాభాలు పోగుపోసుకున్నాయి. ఇది 2007-08 తర్వాత కాలంలోనే అత్యధికం. ఇప్పటికొస్తే భారత ఆర్థిక వ్యవస్థ సగటున ఏటా 78.5 లక్షల ఉద్యోగాలు కల్పించవలసిన అత్యావశ్యక పరిస్థితిలో వుందని ఆర్థిక సర్వే పేర్కొన్నది. పెరిగే శ్రామిక సంఖ్య ఉద్యోగావసరాలను అందుకోవాలంటే అది తప్పనిసరి. ఉద్యోగ రంగంలో నెలకొన్న తీవ్ర సంక్షోభం లోక్‌సభ ఎన్నికలలో ఒక వేడివేడి అంశంగా ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో మోడీ మూడవ ప్రభుత్వ తొలి బడ్జెట్ ఉపాధి కల్పనకూ నూతన ఉద్యోగావకాశాలు సృష్టించడానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని ఎవరైనా భావిస్తారు. కానీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన బడ్జెట్ సంప్రదాయ ఉద్యోగ రంగంలో ఉద్యోగాల కల్పన పేర డొల్లతనపు మోసపూరిత చర్యలకు పాల్పడటమే చూశాం. అదే సమయంలో ఆ పేరిట కార్పొరేట్లకు ప్రభుత్వ నిధులను ఉదారంగా గుమ్మరించడమూ కనిపించింది.

మూడు స్కీముల గుట్టు

ఆర్థిక మంత్రి ఉద్యోగ కల్పన అనుసంధానిత ప్రోత్సాహకాలు (ఇఎల్ఐ) పేరిట ప్రకటించిన పథకాల పరంపర కార్పొరేట్ పండితులను విశేషంగా ఉత్సాహపర్చింది. ఇందులో మొదటిదైన ఎ స్కీము ఉద్యోగుల ందరికీ వర్తించేదిగా వుంటే బి, సిలు మాత్రం నిర్దిష్టమైన తరగతులకు వర్తించు తాయి. ఎ స్కీము ప్రకారం ఎవరైనా ఒక యజమాని కొత్తగా ఒక కార్మికుడిని చేర్చుకుంటే లేదా అంతకు ముందు తమ జాబితాలో లేని ఒక కార్మికుడిని ఇఎఫ్‌పిఓ (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్) లో చేరిస్తే ఆ కార్మికునికి వచ్చే ఒక నెల జీతాన్ని రూ. 15,000 మేరకు ప్రభుత్వం మూడు కిస్తీల్లో చెల్లిస్తుంది. దీని అర్థమే మంటే యజమాని ఆ కార్మికుడికి చెల్లించే జీతంలో పన్నెండో వంతు నేరుగా ప్రభుత్వమే అంద జేస్తుంది. ఉత్పత్తి రంగంలో యాభై మందికి తక్కువ కాకుండా ఇఎఫ్‌పిఓ యేతర కార్మికులను తీసుకునే యాజమాన్యాలకు బి స్కీము వర్తిస్తుంది. ఈ స్కీము కింద ప్రభుత్వం ఇఎఫ్‌పిఓకు అటు ఉద్యోగులు ఇటు యాజమాన్యం చెల్లించవలసిన వాటాను అంటే జీతంలో 24 శాతాన్ని ప్రజాధనం నుంచి నేరుగా చెల్లిస్తుంది. ఇక సి స్కీము ప్రకారమైతే ఏదైనా కంపెనీ గనక ఇద్దరు నుంచి ఐదుగురు ఉద్యోగులను తీసుకుంటే నెలకు రూ.3000 వరకూ ఇఎఫ్‌పిఓలో యజమాని వాటా అందుకుంటుంది. చాలా స్పష్టంగా ప్రభుత్వం వేతనాల మొత్తంలో 32.33 శాతాన్ని ప్రజల ధనంతో చెల్లు వేస్తుందన్నమాట. ఈ పథకాలలో మరీ ప్రమాదకరమైన అంశమేమంటే ఆ కంపెనీలు ప్రతి ఏటా కొత్త ఉద్యోగులను తీసుకుంటేనే ఈ పథకం అమలువుతుంది. దీనివల్ల జరిగేదేమంటే మొదటి ఏడాది ఉద్యోగులను కేవలం నిర్ణీత కాలానికే తీసుకుని ఏడాది కాగానే పనినుంచి తొలగించేస్తాయి. ప్రభుత్వ సబ్సిడీ పొందడం కోసం రిట్రెంచిమెంటు మరింత తీవ్రం చేసేందుకు ఈ పథకాలు కారణమవుతాయి.



PEOPLE'S DEMOCRACY

నిరుద్యోగ సేనల పడిగాపులే

మరో పెద్ద దెబ్బ ఇంటర్న్‌షిప్ విధానం. ఈ పథకాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అగ్రశ్రేణి కంపెనీల కోసం రూపొందించింది. అత్యధిక లాభాలతో నడుస్తున్న ఈ 500 కంపెనీలు తమ మొత్తం ఉత్పత్తినీ సేవలనూ కేవలం ఇంటర్న్‌లు లేదా అంప్రెంటిస్‌లతో నడిపించు కోవడా నికి వీలుగా ఈ పథకం తయారైంది. వీరికి నెలకు 5000 రూపాయల స్టైఫండ్ భారం, ఒక దఫా సహాయం గా రూ. ఆరు వేల చెల్లింపు అన్నీ ప్రభుత్వమే చేస్తుంది. మిగిలిన శిక్షణా వ్యయం కూడా సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల నుంచి తీసుకోవచ్చు. ఈ కార్పొరేట్ అనుకూల ప్రభుత్వం అపఖ్యాతికరమైన ఈ పథకం ద్వారా ఉద్యోగ సంబంధాలను మరింత దుర్బలపరిచే దిశలోకి నడిపిస్తుంది. అత్యాధునికమైన యంత్రాలు, సాంకేతికత పరిజ్ఞానంతో వేగంగా నేర్చుకునే సత్తా సంతరించుకున్న కొత్త ఇంటర్న్ బ్యాచీలు మొత్తం కీలక ఉత్పత్తి ప్రక్రియకు బాధ్యత వహించాల్సిన పరిస్థితి కల్పించబడుతుంది. ఈ ఉత్పత్తి క్రమంలో పాత బ్యాచీల స్థానంలో రావడం కోసం భారీ నిరుద్యోగ సైన్యాలు లేదా వృత్తి విద్యా సాంకేతిక శిక్షణ పొందిన వారు ఫ్యాక్టరీల గేట్ల దగ్గర పడిగాపులు పడి నిరీక్షించాల్సి వస్తుంది.

మరింత దిగజారుడుకే!

ఈ విధంగా ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు తరలించి ప్రయివేటు ఖోషాణాలు నింపడం వల్ల నిరుద్యోగ సమస్య ఇసుమంతైనా పరిష్కారం కాదు. లాభార్జనతో ముడిపడిన ఉత్పత్తిని పెంచడమంటే దాంట్లో ఎలాంటి చెల్లింపులేని శ్రామిక శక్తి వాటా పెంచడమే. ఇఎల్ఐ, ఇంటర్న్‌షిప్ స్కీములు తీసుకురావడం ద్వారా కార్పొరేట్లకు ఉచిత శ్రామిక బలగాన్ని సమకూర్చి పెట్టేందుకు మోడీ సర్కారు బరితెగించి ప్రయత్నిస్తున్నది.

కానీ మరో వైపున ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుండడం వల్ల మొత్తం గిరాకీ నిరంతరాయంగా పడిపోతున్నది. దాంతో నికర అమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఉత్పత్తితో ముడిపడిన లాభాలూ వాస్తవరూపం దాల్చడం లేదు. అది ఉత్పత్తి సంబంధమైన ఆలోచనల నుంచి ప్రయివేటు పెట్టుబడులను దెబ్బ తీస్తున్నది. కార్పొరేట్ ఆదాయం పెరుగుదల స్థిరంగా స్పెక్యులేషన్ మార్గంలోనే మళ్లించ బడుతున్నది. ప్రభుత్వం కార్పొరేట్లకు ఈ స్కీములతో సబ్సిడీలు ఇవ్వొచ్చునేమో గానీ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి, ప్రజల జీవన స్థితిగతులు మాత్రం మరింత దిగజారతాయి.

(జులై 24 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

> లాభార్జనతో ముడిపడిన ఉత్పత్తిని పెంచడమంటే దాంట్లో ఎలాంటి చెల్లింపులేని శ్రామిక శక్తి వాటా పెంచడమే. ఇఎల్ఐ, ఇంటర్న్‌షిప్ స్కీములు తీసుకురావడం ద్వారా కార్పొరేట్లకు ఉచిత శ్రామిక బలగాన్ని సమకూర్చి పెట్టేందుకు మోడీ సర్కారు బరితెగించి ప్రయత్నిస్తున్నది. కానీ మరో వైపున ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుండడం వల్ల మొత్తం గిరాకీ నిరంతరాయంగా పడిపోతున్నది. దాంతో నికర అమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఉత్పత్తితో ముడిపడిన లాభాలూ వాస్తవరూపం దాల్చడం లేదు. అది ఉత్పత్తి సంబంధమైన ఆలోచనల నుంచి ప్రయివేటు పెట్టుబడులను దెబ్బతీస్తున్నది. కార్పొరేట్ ఆదాయం పెరుగుదల స్థిరంగా స్పెక్యులేషన్ మార్గంలోనే మళ్లించబడుతున్నది.

నిరీక్షణ..

- రేషన్‌కార్డుల్లో మార్పులు.. చేర్పులకు ఎదురుచూపులు
- స్పష్టతనివ్వని సర్కారు
- గ్రేటర్ వ్యాప్తంగా సుమారు 3లక్షల దరఖాస్తులు పెండింగ్
- కొత్త కార్డులు అసలే లేవ్..
- పౌరసరఫరాల శాఖ కార్యాలయాల చుట్టూ జనం ప్రదక్షిణలు
- రేషన్ కోటా, సంక్షేమ పథకాలకు నిరుపేదలు దూరం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంబర్‌పేట్ గోల్నాక ప్రాంతానికి చెందిన బొడ్డు శ్రీను తన పేరుతో పాటు ఇద్దరు పిల్లల పేర్లను రేషన్ కార్డులో చేర్చాలని కొన్నేండ్లుగా పౌర సరఫరాలశాఖ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. 2016కు ముందు రేషన్ కార్డులో తన పేరు ఉన్నప్పటికీ.. ఉద్యోగుల తప్పిదం వల్ల అతని పేరు తొలగింపునకు గురైంది. దాదాపు 8 ఏండ్లుగా భార్య, కొడుకు పేర్లు మాత్రమే వస్తున్నాయి. ఈ విషయమై అధికారులను సంప్రదించి.. తిరిగి రేషన్ కార్డులో తన పేరుతోపాటు పిల్లల పేర్లను నమోదు చేయాలని విన్నవించినా మార్పులు.. చేర్పులు జరగలేదు. నిజానికి సర్కారు అందించే సంక్షేమ పథకాల(ఆరు గ్యారంటీలు) లబ్ది పొందాలంటే అతనితో పాటు ఇద్దరు పిల్లల పేర్లు తప్పనిసరిగా ఉండాలి. పుట్టుకతో లోపమున్న ఒక కుమారుడికి ప్రభుత్వ పింఛన్ సదుపాయం అందుకోలేక పోతున్నానని చెబుతున్నాడు. వాస్తవానికి ఇది ఒక్క బొడ్డు శ్రీనుకు ఎదురవుతున్న సమస్యే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది కుటుంబాల సమస్య. వివాహమైన ఎంతో మంది మహిళల పేర్ల నమోదు, వివాహం చేసుకుని వేరే కుటుంబం పెట్టుకున్నవారు కొత్త కార్డు కోసం.. వలస వెళ్లిన వారు కార్డు బదిలీ కోసం, పిల్లల పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు కోసం ఎదురు చూస్తున్నారు. కార్డుల నుంచి సభ్యుల పేర్ల తొలగింపు నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నా.. చేర్పులకు మాత్రం ప్రభుత్వం అనుమతివ్వకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

31తో ఎనిమిదేండ్లు పూర్తి..!

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో సుమారు 17.21 లక్షలకుపైగా రేషన్ కార్డులుండగా.. అందులో 59.02 లక్షల మంది సభ్యులున్నారు. ఇదిలావుంటే, హైదరాబాద్ తొమ్మిది సర్కిళ్ల పరిధిలోని రేషన్ షాపుల్లో అన్ని రకాల రేషన్ కార్డులు కలిపి 6.39లక్షలున్నాయి. కార్డుల్లో మార్పుల కోసం హైదరాబాద్ జిల్లాలో 1.14లక్షల అప్లికేషన్స్ పెండింగ్‌లో ఉన్నాయి. మూడు జిల్లాల పరిధిలో 3లక్షల దరఖాస్తులకు సంబంధించి సుమారు 9.5లక్షల మంది పేర్ల నమోదు కోసం ఎదురు చూస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పాత కార్డుల్లో మార్పులు, చేర్పులకు అనుమతులు ఇవ్వకుండా పెండింగ్‌కు ఈనెల 31తో ఎనిమిదేండ్లు పూర్తికానుంది. ఇన్నేండ్లుగా లక్షల మంది సర్కారు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ప్రధానంగా సీఎంఆర్ఎఫ్, ఉపకార వేతనాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు అందడం లేదు. విద్యాసంవత్సరం సమయంలో కుల, ఆదాయ, ఈబీసీ సర్టిఫికెట్స్ వంటి దరఖాస్తులకు ఆహార భద్రత కార్డునే ప్రామాణికంగా తీసుకోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

తొలగింపునకే ప్రాధాన్యత..

రేషన్ కార్డులోని సభ్యుల తొలగింపు నిరంతర ప్రక్రియగా తయారైంది. గడిచిన పదేండ్లలో వివిధ కారణాలతో లక్షలాది మంది సభ్యులు కార్డుల్లో నుంచి తొలగింపునకు గురయ్యారు. ఉదాహరణకు.. ఆహారభద్రత కార్డు కలిగిన కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే వారి పేర్లను రేషన్ కార్డుల నుంచి వెంటనే తొలగించేస్తున్నారు. కానీ కొత్త సభ్యులను చేర్చే విషయంలో మాత్రం సానుకూలమైన నిర్ణయం తీసుకోవడం లేదు. కొత్త సభ్యులను చేర్పించడానికి మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నా.. వాటిల్లో నమోదు చేయడానికి పౌరసరఫరాల శాఖ ఆమోదం చెప్పడం లేదు. దీనివల్ల ఎంతో మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ఉపయోగం లేదు. కుటుంబాల్లో సభ్యులు సంఖ్య పెరుగుతున్నా.. కార్డుల్లో సభ్యుల సంఖ్య పెరగకపోవడం పేదల పాలిట శాపంగా మారింది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో..

ఇదే అంశంపై పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం త్వరలో కొత్త కార్డుల జారీ ఉంటుందని స్పష్టం చేసింది. కానీ మ్యూటేషన్లు (రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులపై) స్పష్టతనివ్వలేదు. దీంతో ఈ సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారని పేదలంతా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు ఆగాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఇలా కాకుండా రేషన్‌కార్డుల్లో మరణించిన వారి పేర్లు తొలగించినట్టుగానే కుటుంబంలో ఎవరైనా సభ్యులు చేరితే వారి పేర్లను ఎప్పటికప్పుడూ చేర్చడం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డుల్లో సభ్యుల చేరికకు ఆమోదం తెలపాలని పలువురు కోరుతున్నారు.

1 నుంచి డీసెట్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు వచ్చేనెల ఒకటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల ఆరో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డీసెట్‌కు 17,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 15,150 (85.96 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. తెలుగు మాధ్యమంకు 9,698 మంది దరఖాస్తు చేస్తే, 8,189 మంది పరీక్షకు హాజరయ్యారు.

వారిలో 6,644 (81.13 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంగ్లీష్ మాధ్యమానికి 7,197 మంది దరఖాస్తు చేయగా, 6,280 మంది పరీక్ష రాశారు. వారిలో 5,024 (80 శాతం) మంది పాసయ్యారు. ఉర్దూ మాధ్యమానికి 760 మంది దరఖాస్తు చేస్తే, 681 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 364 (53.45 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇతర వివరాలకు https://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

విజయసాయిరెడ్డికి ఊరట

నవతెలంగాణ-హైదరాబాద్

రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) గతేడాది క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నోటీసును తెలంగాణ హైకోర్టు రద్దు చేస్తూ తీర్పు చెప్పింది. చార్టెర్డ్ అకౌంటెంట్‌గా రూల్స్‌ను ఉల్లంఘించారని 2023 అక్టోబర్ 23న ఇచ్చిన నోటీసును విజయసాయి సవాల్ చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం తీర్పు చెప్పారు.

---

pnb Housing Finance Limited

రిజిస్టర్డు ఆఫీసు: 9వ అంతస్తు, అంత్రిక్షభవన్, 22, కెజి మార్గ్, న్యూఢిల్లీ-110001. ఫోన్స్: 011-23357171, 23357172, 23705414, Website : www.pnbhousing.com

బ్రాంచ్ ఆఫీసు: 4వ అంతస్తు, హర్ష్ డెవిడ్‌సన్ పోరమ్ పైన, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034

తేదినాటికి సవరించిన సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ (1)తో చదవగల సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 యొక్క చాప్టర్ 3 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు

మేము, సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (ఇకమీదట "చట్టం"గా పేర్కొనబడును) యొక్క చాప్టర్ 3 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకమీదట 'పిఎన్‌బిహెచ్‌ఎఫ్ఎల్' పేర్కొనడును) జారీచేసింది. [illegible] ... సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద కూడా డిమాండ్ నోటీసును ఈ ప్రచురణ చేస్తున్నాం. ... ఈ డిమాండ్ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజుల వ్యవధిలోపు పిఎన్‌బిహెచ్ఎఫ్ఎల్ వారికి చెల్లించుటకు మీమ్మల్ని కోరుతున్నాం, ... సదరు చట్టం సెక్షన్ 13(4) యొక్క నియమాలతో అన్ని లేదా ఏదేని అవసరమైన చర్య/ చర్యలు పిఎన్‌బిహెచ్ఎఫ్ఎల్ చేపట్టును. [illegible] ... చట్టం, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) నియమాల క్రింద ... సదరు చట్టంలోపు సెక్షన్ 13(13) క్రింద మీరు నిషేధించబడినారు.

రుణ ఖాతా నెం.లు	రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత(ల) పేరు/ చిరునామా	హామీదారుల పేరు & చిరునామా	తాకట్టుపెట్టిన ఆస్తులు	డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు తేదినాటికి బాకీపడిన మొత్తం
HOU/ HYD/ 1118/ 602016 బి.ఓ: బంజారా హిల్స్	శ్రీ శివ కుమార్ హెచ్ తండ్రి ప్రహ్లాద్ దత్తురావు, ఫ్లాట్ నెం.108, 1అంతస్తు, బ్లాక్ 3 అర్జున్, క్రుషి డిఫెన్స్ కాలనీ, పటాన్‌చెరు, హైదరాబాద్, తెలంగాణ-502319. ఇంకా ఇక్కడ: ... పూణే, మహారాష్ట్ర-411021. ఇంకా ఇక్కడ: 17 4 178, మనహళ్లి రోడ్, మహేష్ నగర్, బీదర్, కర్ణాటక-585403. ఇంకా ఇక్కడ: కలిసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్, సర్వే 3201 సి, ... పూణే, మహారాష్ట్ర 411021. శ్రీమతి ... భర్త ప్రహ్లాద్ దత్తు రావు, ఫ్లాట్ నెం.108, 1 అంతస్తు, బ్లాక్ 3 అర్జున్, క్రుషి డిఫెన్స్ కాలనీ, పటాన్‌చెరు, హైదరాబాద్, తెలంగాణ-502319. ఇంకా ఇక్కడ: 17 4 178, మనహళ్లి రోడ్, మహేష్ నగర్, బీదర్, కర్ణాటక-585403.	వర్తించదు	సెక్యూర్డు ఆస్తి వివరాలు: షెడ్యూలు ఆస్తి: ఏ: పటాన్‌చెరు గ్రామం, పట్టణం మరియు మండలం, సంగారెడ్డి జిల్లా, (పూర్వపు మెదక్ జిల్లా) వద్దగల సర్వే నెం.లు 229, 249, 250, 251, 264, 265, 266, 267, 268, 269, 270, 271, 272, 273, 274, 276, 277, 294, 295/A, 295/AA, 296, 297/A, 297/AA, 298, 299/A2, 302, 303/A, 303/AA, 304/A, 304/AA, 305/A, 305/AA, 305/3, 308/A, 308/AA, 308/E, 309, 310 లోని 5435చ.మీ.లకు సమానమైన 6500చ.గ.ల విస్తీర్ణపు ఓపెన్ ప్లాట్ మొత్తం భాగం మరియు సరిహద్దులు: ఉత్తరం: క్రుషి డిఫెన్స్ కాలనీ, దక్షిణం: సర్వే నెం.263 (పొరుగువారి భూమి), తూర్పు: సర్వే నెం.255& 256 (పొరుగువారి భూమి), పడమర: సర్వే నెం.229, & 230. షెడ్యూలు-బి: పటాన్‌చెరు గ్రామం, పట్టణం మరియు మండలం, సంగారెడ్డి జిల్లా, (పూర్వపు మెదక్ జిల్లా) వద్దగల సర్వే నెం.లు 229, 249, 250, 251, 264, 265, 266, 267, 268, 269, 270, 271, 272, 273, 274, 276, 277, 294, 295/A, 295/AA, 296, 297/A, 297/AA, 298, 299/A2, 302, 303/A, 303/AA, 304/A, 304/AA, 305/A, 305/AA, 305/3, 308/A, 308/AA, 308/E, 309, 310 లోని క్రుషి డిఫెన్స్ కాలనీగా తెలిసిన గేటెడ్ కమ్యూనిటీ లోని 62.00చ.గ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థల భాగంతో 817.00చ.అ.ల కలిగిన బ్లాక్-3లోని మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.108 మొత్తం భాగం.సరిహద్దులు: ఉత్తరం:మెట్లు, దక్షిణం: ఫ్లాట్ నెం.107, తూర్పు: కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై	12.07.24	11.07.2024 నాటికి రూ. 20,98,635/- (రూపాయలు ఇరవైలక్షల తొంభైఎనిమిది వేల ఆరు వందల ముప్పై ఐదు మాత్రమే)

ప్రదేశం: బంజారాహిల్స్, తేది: 30-07-2024. సం/- (అధీకృత అధికారి), పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరుపున

Granules India Limited

Regd. Off: 2nd Floor, 3rd Block, My Home Hub, Madhapur, Hyderabad - 500081 (TS)
Phone: +91-40-69043500 Fax: +91-40-23115145 CIN: L24110TG1991PLC012471
E-mail: investorrelations@granulesindia.com URL: www.granulesindia.com

30 జూన్, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం

(రూ.మిలియన్లలో)

వివరాలు	ముగిసిన త్రైమాసికం 30.06.2024 ఆడిట్‌చేయనిది 30.06.2024	ముగిసిన త్రైమాసికం 31.03.2024 ఆడిట్‌చేయనిది 31.03.2024	ముగిసిన త్రైమాసికం 30.06.2023 ఆడిట్‌చేయనిది 30.06.2023	ముగిసిన సంవత్సరం 31.03.2024 ఆడిట్‌చేసినది 31.03.2024
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	11,798.65	11,757.79	9,855.16	45,063.67
పన్నుకు ముందు నికర లాభం (మినహాయింపుగల ఐటంలు మరియు/ లేదా అసాధారణ ఐటంలకు ముందు)	1,814.40	1,756.42	654.71	5,472.29
పన్నుకు ముందు నికర లాభం (మినహాయింపుగల ఐటంలు మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	1,814.40	1,756.42	654.71	5,472.29
పన్ను తరువాత నికర లాభం (మినహాయింపుగల ఐటంలు మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	1,346.48	1,296.47	478.95	4,053.10
పూర్తి సమగ్ర ఆదాయం	1,370.11	1,390.20	479.79	4,258.10
ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ. 1/-ల చొప్పున)	242.37	242.37	242.04	242.37
ఇతర ఈక్విటీ				32,013.07
వాటా ఒక్కింటికి రాబడి (ముఖ విలువ రూ. 1/-ల చొప్పున) (రూ.లలో)	(వార్షికంకానిది)	(వార్షికంకానిది)	(వార్షికంకానిది)	(వార్షికం)
- బేసిక్	5.56	5.35	1.98	16.73
- డైల్యూటెడ్	5.55	5.35	1.98	16.72

గమనిక:

1. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్చేంజీలతో దాఖలు చేయబడిన ముగిసిన త్రైమాసికపు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక నమూనాకు పై పేర్కొన్నవి సారాంశం. సదరు ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.granulesindia.com మరియు స్టాక్ ఎక్చేంజీ వెబ్‌సైట్లు అనగా NSE: www.nseindia.com & BSE: www.bseindia.com పై కూడా అందుబాటులో వున్నాయి.
2. పై పేర్కొన్న ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు 29 జూలై, 2024న ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 30 జూలై, 2024న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.
3. ఇండియాలో సాధారణంగా ఆమోదించిన ఇతర అకౌంటింగ్ ప్రిన్సిపల్స్ మరియు అందులో జారీచేయబడిన సంబంధిత రూల్స్‌తో చదవబడు కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 133 క్రింద నిర్దేశించినట్లుగా కంపెనీస్ (ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్) రూల్స్, 2015ను అనుసరించి పై పేర్కొన్న ఫలితాలు వున్నాయి.
4. స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాల యొక్క కీ సంఖ్యలు :-

(రూ.మిలియన్లలో)

వివరాలు	ముగిసిన త్రైమాసికం 30.06.2024 ఆడిట్‌చేయనిది 30.06.2024	ముగిసిన త్రైమాసికం 31.03.2024 ఆడిట్‌చేయనిది 31.03.2024	ముగిసిన త్రైమాసికం 30.06.2023 ఆడిట్‌చేయనిది 30.06.2023	ముగిసిన సంవత్సరం 31.03.2024 ఆడిట్‌చేసినది 31.03.2024
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	8,519.50	9,401.91	8,210.00	37,550.91
పన్నుకు ముందు నికర లాభం	1,258.59	1,365.11	1,071.55	5,912.91
పన్ను తరువాత నికర లాభం	937.79	972.16	798.40	4,359.18

బోర్డు కొరకు మరియు తరఫున
సం/-
డా.క్రిష్ణ ప్రసాద్ చిగురుపాటి
చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్
DIN: 00020180

ప్రదేశం: హైదరాబాద్
తేది: 29 జూలై, 2024

COUNTRY CONDO'S LIMITED

CIN: L63040TG1987PLC007811
Regd. Office : # 7-1-19/3, 1st Floor, I. S. R. Complex, Kundanbagh, Begumpet, Hyderabad – 500 016, Telangana, India
Ph: 91-40-66533618; Email: info@countrycondos.co.in
Website: www.countrycondos.co.in

కంట్రీ కండోస్ లిమిటెడ్ యొక్క 37వ వార్షిక సర్వసభ్య సమావేశం

కంట్రీ కండోస్ లిమిటెడ్ ("ద కంపెనీ") యొక్క సభ్యుల 37వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజిఎం) శుక్రవారం, 30, ఆగస్టు, 2024 సా.02.00 గంటలకు (ఐఎస్‌టి) వీడియో కాన్ఫరెన్సింగ్/ఇతర ఆడియో-విజువల్ మార్గమం(విసి/ఓఎవిఎం) ద్వారా, కంపెనీల చట్టం, 2013 యొక్క నిబంధనలను అనుసరించి, చదవగల జనరల్ సర్క్యులర్ నెం. 14/2020 తేది : ఏప్రిల్ 8, 2020., నెం. 17/2020 తేది : ఏప్రిల్ 13, 2020., నెం.39/2020 తేది : డిసెంబర్ 31, 2020., నెం. 02/2021 తేది : జనవరి 13, 2021., నెం. 21/2021 తేది :డిసెంబర్ 14, 2021., నెం. 2/2022 తేది :మే 5, 2022., నెం. 11/2022 తేది : డిసెంబర్ 28, 2022 మరియు నెం.09/2023 తేది : సెప్టెంబర్ 25, 2023., కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (సంయుక్తంగా 'సర్క్యులర్లు'గా పిలువబడును) ప్రకారం, ఏజిఎం నోటీసులో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా వాణిజ్య నిర్వహణలో భాగంగా నిర్వహించబడును.

సర్క్యులర్స్‌కు అనుగుణంగా, ఏజిఎం నోటీసు యొక్క ఎలక్ట్రానిక్ కాపీలు మరియు 2023-24 ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదిక, కంపెనీతో సభ్యులు ఎవరివైతే ఇ-మెయిల్ ఐడిలు రిజిస్టర్ అయి ఉన్నాయో వారందరికీ పంపించబడును. ఈయొక్క డాక్యుమెంట్లు కంపెనీ వెబ్‌సైట్ https://countrycondos.co.in వద్ద కూడా లభించును. సభ్యులు ఎవరైతే, ఇప్పటివరకూ ఇ-మెయిల్ చిరునామాలు రిజిస్టర్ చేసుకోలేదో, వారు తమ పేరు, ఫోలియో నెం., ఇ-మెయిల్ ఐడి ఇవ్వడం ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని కోరుతున్నాం. దాంతో, info@countrycondos.co.in కు ఇ-మెయిల్ పంపడం ద్వారా ఏజిఎం పిలుపు నోటీసు, వార్షిక నివేదిక & ఇతర డాక్యుమెంట్లు ఎలక్ట్రానిక్ విధానంలో స్వీకరించుటకు అనుమతించబడును.

సభ్యులు ఎవరైతే భౌతిక వాటాలు కలిగి ఉంటారో లేదా ఎవరైతే కంపెనీతో ఇ-మెయిల్ ఐడిలు రిజిస్టర్ చేసుకొని ఉండరో, ఏజిఎం నిర్వహణ నోటీసులోని ప్రొసీజర్ మరియు సూచనలను అనుసరించడం వారు కూడా ఓటు వేయుటకు వీలుంటుంది.

For M/s.COUNTRY CONDO'S LIMITED
సం./-
డి. కృష్ణకుమార్ రాజు
వైస్-చైర్మన్ & సిఇఓ
DIN: 00115553

ప్రదేశం : హైదరాబాద్
తేది : 30/07/2024.

IN THE DEBTS RECOVERY APPELLATE TRIBUNAL AT KOLKATA

9, ఓల్డ్ పోస్టాఫీస్ స్ట్రీట్, 7వ అంతస్తు, కోల్‌కత-700001

Misc Appeal Dy No.603 of 2024

(ఓ.ఎస్.నెం./219/2010లో ఒ.ఎ.1823/2018 ప్రకారం డిఆర్‌టి-1, హైదరాబాద్)

ఇండియన్ బ్యాంక్.. ....అప్పిలెంట్

వర్సెస్

మెసర్స్ ప్రత్యాందర ఎలక్ట్రానిక్స్ ప్రయివేట్ లిమిటెడ్ & అదర్స్. ....రెస్పాండెంట్స్

టు,
శ్రీ అల్లూరి మహేష్ రాజు, తండ్రి: వెంకటపతి రాజు, హిందూ, వయస్సు: 57ఏండ్లు, ఫ్లాట్ నెం.60, సిద్ధార్థ నగర్, ఎస్ఆర్ నగర్, హైదరాబాద్-500038 (రెస్పాండెంట్ నెం.2)

సమన్లు

1. ఏదైతే, పైన పేర్కొన్న అప్పెలెంట్ రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్రప్సీ యాక్ట్.1993లోని సెక్షన్ 20 ప్రకారం గౌరవ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-1, హైదరాబాద్ వారు, మరి ఇతర ఉపశమనం కోసం జారీ చేసిన ఆదేశాలపై అప్పీల్ దాఖలు చేశారు. ఇందుమూలంగా తమరికి నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా తమరు మా ఎదుట హాజరు కావాలి మరియు తమరి యొక్క రిటెన్ స్టేట్‌మెంట్‌ను గౌరవ ట్రిబ్యునల్ ఎదుట తేది:27-08-2024న గం.10-30 నిమిషాలకు లేదా గౌరవ ట్రిబ్యునల్ వారి యొక్క సౌకర్యవంతమైన సమయంలో తమరి యొక్క క్లెయిమ్‌పై సమాధానం నిమిత్తం దాఖలు చేయాల్సి ఉంటుంది.
2. ఒకవేళ తమరు ఏమైనా డాక్యుమెంట్లను సమర్పించదలచినట్లయితే తమరి యొక్క రిటెన్ స్టేట్‌మెంట్‌తో పాటుగా సమర్పించాల్సి ఉంటుంది.
3. గౌరవ ట్రిబ్యునల్ ఎదుట హాజరయ్యే క్రమంలో తమరి యొక్క రిజిస్టర్డ్ చిరునామాతో పాటుగా మీ యొక్క మెమో ఆఫ్ అప్పియరెన్స్ నేరుగా లేదా తమరి యొక్క ప్లీడర్/ అడ్వొకేట్ ద్వారా దాఖలు చేయాల్సి ఉంటుంది. 4. దయచేసి ఈ నోటీసు ద్వారా తమరు గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఒకవేళ తమరు దిగువ పేర్కొన్న తేదీ రోజున గైర్హాజరైనట్లయితే మీ యొక్క హాజరు లేకున్నప్పటికీ విచారణ చేపట్టబడునని తెలియజేయనైనది.

గౌరవ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నా ద్వారా 24, జూలై, 2024 తేదీన ఇవ్వబడిన నోటీసు

సం/- అధికారి సంతకం
సమన్లు జారీ చేసేందుకు నియమితులైన అధీకృత అధికారి

AUROBINDO PHARMA LIMITED

(CIN - L24239TG1986PLC015190)
Regd. Office: Plot No.2, Maithrivihar, Ameerpet, Hyderabad – 500 038, Telangana, India
Tel No. +91 40 2373 6370, Fax No. +91 40 2374 1080
Corp. Office : Galaxy, Plot No.1, Survey No.83/1, Hyderabad Knowledge City, Raidurg Panmaktha, Hyderabad – 500 032, Telangana, India, Tel No. +91 40 66725000 / 66721200
Fax No. +91 40 67074044; E-mail: info@aurobindo.com; Website: www.aurobindo.com

వీడియో కాన్ఫరెన్సింగ్ (వీసి)/అదర్ ఆడియో విజువల్ మీన్స్ (ఓఏవిఎం) ద్వారా నిర్వహించబడు 37వ వార్షిక సర్వసభ్య సమావేశం గురించిన వాటాదారులకు ప్రకటన

కంపెనీ యొక్క ఏజిఎం నోటీసులో పేర్కొన్నట్లు లిస్ట్‌చేయబడిన వ్యాపార నిర్వహణకు ఉమ్మడి వేదిక వద్ద సభ్యుల భౌతిక హాజరు లేకుండానే సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) (ఇకమీదట 'సర్క్యులర్లు'గా పేర్కొనబడును) ద్వారా జారీచేసిన ఇటీవలి సెబీ/హెచ్ఓ/సిఎఫ్‌డి/సిఎఫ్‌డి-పిఓడి-2/పి/సిఐఆర్/2023/167 తేది.7 అక్టోబర్, 2023 ఈ విషయంలో జారీచేసిన తదుపరి సర్క్యులర్లు మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు సర్క్యులర్ నెం. సెబీ/హెచ్ఓ/సిఎఫ్‌డి/సిఎఫ్‌డి/సిఎండి1/సిఐఆర్/పి/2020/79 తేది.12 మే, 2020చే జారీచేసిన జనరల్ సర్క్యులర్ నెం.14/2020 తేది.8 ఏప్రిల్, 2020 మరియు తదుపరిగా ఈ విషయంలో జారీచేసి సర్క్యులర్లు ఇటీవలి 09/2023 తేది.25 సెప్టెంబర్, 2023తో చదవగల కంపెనీల చట్టం, 2023లోని వర్తించు నియమాలు మరియు అందులోని రూల్స్ మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015ను అనుసరించి వీడియో కాన్ఫరెన్సింగ్ (వీసి)/ అదర్ ఆడియో విజువల్ మీన్స్ (ఓఏవిఎం) ద్వారా అరబిందో ఫార్మా లిమిటెడ్ (ది కంపెనీ) యొక్క ముప్పైఏడవ వార్షిక సర్వసభ్య సమావేశం ("ఏజిఎం") గురువారం, 29 ఆగస్టు, 2024న మ.3.30గం.లకు (ఐఎస్‌టీ) నిర్వహించబడును.

పై పేర్కొన్న సర్క్యులర్లను అనుసరించి, 37వ ఏజిఎం నోటీసు మరియు ఆర్థిక సంవత్సరం 2023-24 ("వార్షిక రిపోర్టు") కొరకు కంపెనీ యొక్క వార్షిక రిపోర్టును కంపెనీ/ రిజిస్ట్రార్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్/ డిపాజిటరీలతో వారి ఇమెయిల్ ఐడిలుగల అట్టి సభ్యులకు ఎలక్ట్రానిక్ రూపంలో మాత్రమే పంపబడును. ఏజిఎం నోటీసు మరియు వార్షిక రిపోర్టు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.aurobindo.com పై, కెఫిన్‌టెక్ లిమిటెడ్ ("కెఫిన్‌టెక్"), రిజిస్ట్రార్ & ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ (ఆర్‌టిఏ) ఆఫ్ కంపెనీ: https://evoting.karvy.com మరియు స్టాక్ ఎక్చేంజీల యొక్క వెబ్‌సైట్స్ అనగా నేషనల్ స్టాక్ ఎక్చేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్: www.nseindia.com మరియు బిఎస్ఇ లిమిటెడ్: www.bseindia.com పై కూడా అందుబాటులో వున్నాయి.

ఏజిఎంలో పాల్గొంటున్న మరియు హాజరు అవుతున్న సభ్యులకు వీసి/ఓఏవిఎం ద్వారా మాత్రమే పాల్గొనాలి. ఏజిఎంలో పాల్గొనుటకు సూచనలు మరియు రిమోట్ ఇ-ఓటింగ్‌లో పాల్గొను విధానం లేదా ఏజిఎం సమయంలో ఇ-ఓటింగ్ సిస్టం ద్వారా ఓటును వినియోగించుటకు విధానం ఏజిఎం నోటీసులో ఇవ్వబడినది. కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 103 క్రింద కోరం లెక్కించుట కొరకు వీసి/ ఓఏవిఎం వసతి ద్వారా హాజరు అవుతున్న సభ్యులను లెక్కలోకి తీసుకోబడును.

ఏజిఎం సమయంలో ఓటింగ్ అలాగే ఏజిఎం ('రిమోట్ ఇ-ఓటింగ్') వేదిక కాకుండా ఇతర ప్రదేశం నుండి ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టంను ఉపయోగించుట ద్వారా సభ్యులు వారిఓటింగ్ వసతిని కెఫిన్‌టెక్ ద్వారా కల్పించబడును. ఓటింగ్ కొరకు వివరణాత్మక విధానం ఏజిఎం నోటీసులో పేర్కొనబడును.

కంపెనీ/ రిజిస్ట్రార్ & ట్రాన్స్‌ఫర్ ఏజెంట్/ డిపాజిటరీతో ఇది వరకే మీరు ఇమెయిల్ ఐడిలను నమోదుచేసినట్లయితే ఇ-ఓటింగ్ కొరకు లాగిన్ వివరాలు మీ రిజిష్టర్డు ఇ-మెయిల్ ఐడిలకు పంపబడును.

సభ్యులు వారి ఇమెయిల్ ఐడిలను నమోదుచేయని మరియు వార్షిక రిపోర్టు, ఏజిఎం నోటీసు మరియు ఇ-ఓటింగ్ సూచనలు పంపబడవు, లింక్: https://ris.kfintech.com/clientservices/mobilereg/mobileemailreg.aspx యాక్సెసింగ్ ద్వారా కెఫిన్‌టెక్‌తో వారి ఇమెయిల్ అడ్రస్ మరియు నమోదిత రిజిష్టర్డు నెంబరును తాత్కాలికంగా పొందవచ్చు. యూజర్ ఐడి & పాస్‌వర్డుతోపాటుగా ఇ-ఓటింగ్ సూచనలు మరియు నోటీసు యొక్క సాఫ్ట్ కాపీని పంపించుటకు ఇమెయిల్ అడ్రస్ మరియు మొబైల్ నెంబరు క్యాప్చర్‌కు గైడ్‌గా దిగువ విధానాన్ని సభ్యులు అనుసరించాల్సిందిగా కోరుతున్నాం. ఏదేని ప్రశ్నల విషయంలో, సభ్యులు einward.ris@kfintech.com వీరికి వ్రాయవచ్చును. ప్రత్యామ్నయంగా, వార్షిక రిపోర్టు, ఏజిఎం నోటీసు & ఇ-ఓటింగ్ సూచనలను పంపించుటకు ఎలక్ట్రానిక్ ఫోలియో విషయంలో సభ్యులు ఇమెయిల్ అడ్రస్, మొబైల్ నెంబరు, పాన్ సెల్ఫ్‌అటెస్టెడ్ కాపీ మరియు క్లయింట్ మాస్టర్ కాపీ కల్పిస్తూ అభ్యర్థన లేఖ సంతకంచేసిన స్కాన్డ్ కాపీతోసహా ఇమెయిల్ ఐడి: einward.ris@ kfintech.comకు ఇమెయిల్ ద్వారా అభ్యర్థను పంపవచ్చు, ఫిజికల్ ఫోలియో విషయంలో షేర్ సర్టిఫికేట్ కాపీను పంపించాలి.

ఇ-మెయిల్ అడ్రస్‌ల పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం, డీమాట్ రూపంలో వాటాలను కలిగియున్న సభ్యులను వారి సంబంధిత డిపితో వాటిని అప్‌డేట్ చేసుకోవాల్సిందిగా కోరుతున్నాం మరియు మరియు భౌతిక రూపంలో వాటాలను కలిగియున్న సభ్యుల విషయంలో ఫారం ఐఎస్ఆర్-1ను సమర్పించుట ద్వారా ఆర్‌టిఏతో వాటిని అప్‌డేట్ చేసుకోవాలి. ఐఎస్ఆర్ ఫారంను వెబ్‌లింక్ https://www.aurobindo.com/investors.shareholder-information/register-and-shar-transfer-agent/ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పై సమాచారం కంపెనీ సభ్యులందరి సమాచారం మరియు ప్రయోజనం కోసం జారీ చేయబడుతోంది మరియు ఎప్పటికప్పుడు జారీ చేయబడిన పైన పేర్కొన్న సర్క్యులర్‌లకు అనుగుణంగా ఉంటుంది.

For AUROBINDO PHARMA LIMITED
సం/-
బి. ఆదిరెడ్డి
కంపెనీ సెక్రటరీ
ACS 13709

ప్రదేశం: హైదరాబాద్
తేది: 30 జూలై, 2024

బాలాక్సీ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ కార్యాలయం: 3వ అంతస్తు, మ్యాప్స్ టవర్స్, ప్లాట్ నెం.409, రోడ్ నెం.81, జూబ్లీహిల్స్, ఫేజ్-3, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా-500096.
CIN: L25191TG1942PLC121598
Phone: +91 40 23555300 | Email: info@balaxi.in | Website: www.balaxipharma.in

వీడియో కాన్ఫరెన్సింగ్ ("విసి")/ఇతర దృశ్య శ్రవణ మాధ్యమాల ("ఓవిఎం") ద్వారా 81వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహణ సమాచారం ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వదమేమనగా బాలాక్సీ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (" ద కంపెనీ") యొక్క సభ్యులకు తెలియజేయునది ఏమనగా 81వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజిఎం) తేది:23,ఆగస్టు,2024, శుక్రవారం ఉదయం గం.11-30 (ఐఎస్‌టి) వద్ద వాణిజ్య నిర్వహణలో భాగంగా ఏజిఎంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా వీడియో కాన్ఫరెన్సింగ్ ("విసి")/ఇతర దృశ్య శ్రవణ మాధ్యమాల ("ఓవిఎం") ద్వారా నిర్వహించబడును. కంపెనీల చట్టం,2013లోని ("ద యాక్ట్")లోని మరియు ఇతర వర్తింపదగిన నిబంధనలు మరియు ఇతర నిబంధనలు మరియు జనరల్ సర్క్యులర్ నెంబర్లు కంపెనీల చట్టం, 2013 యొక్క వర్తించు నియమాలు మరియు దానిలో పేర్కొన్న రూల్స్ మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంసిఏ) జారీచేయబడిన జనరల్ సర్క్యులర్ నెంబర్లు 14/2020 మరియు తేది.08 ఏప్రిల్, 2020, జనరల్ సర్క్యులర్ నెం.17/2020, తేది.13 ఏప్రిల్, 2020, జనరల్ సర్క్యులర్ నెం.20/2020 తేది.05 మే, 2020, సర్క్యులర్ 02/21, తేది:13,జనవరి,2021, 19/2021, తేది:8,డిసెంబర్,2021, 21/2021, తేది:14,డిసెంబర్,2021, 2/2022, తేది:5,మే,2022 మరియు 10/2022,తేది:28,డిసెంబర్,2022 (వీటన్నింటిని కలుపుకొని 'ఎంసిఏ సర్క్యులర్స్'గా రిఫర్ చేసుకోవాలి) మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా ద్వారా జారీ చేసిన సర్క్యులర్స్ నెం.SEBI/HO/CFD/PoD-2/P/CIR/2023/4 తేది: 5,జనవరి,2023కు అనుగుణంగా ఏజిఎం నిర్వహించబడును.

పైన పేర్కొన్న సర్క్యులర్స్‌కు అనుగుణంగా, ఏజిఎం నోటీసు మరియు 2023-24 వార్షిక నివేదికను సమాచారాన్ని కంపెనీ వారు ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా తమ సభ్యులకు కంపెనీ/రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్/డిపాజిటరీ పార్టిసిపెంట్స్/ డిపాజిటరీల వద్ద అందుబాటులో ఉన్న ఇ-మెయిల్ ఐడీలకుపంపించడం జరుగుతుంది. సభ్యులంతా గమనించాల్సిన విషయం ఏమిటంటే నోటీసుతో పాటుగా 2023-24 వార్షిక నివేదికను సమాచారాన్ని కంపెనీ యొక్క వెబ్‌సైట్ https://balaxipharma.in వద్ద మరియు దీనితో పాటు స్టాక్ ఎక్చేంజెస్ యొక్క వెబ్‌సైట్ అనగా నేషనల్ స్టాక్ ఎక్చేంజ్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్‌సైట్ htpps://www.nseindia.com వద్ద మరియు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ https://www.evotingindia.com వద్ద కూడా అందుబాటులో ఉండును. కంపెనీ వారు 2023-24 వార్షిక సంవత్సరం యొక్క నివేదిక యొక్క భౌతిక కాపీని సభ్యులందరికీ అనగా ఎవరైతే ప్రత్యేకంగా పొందాలని భావిస్తున్నారంతా వారంతా secretarial@balaxi.in వద్ద మెయిల్ పొంది పొందవచ్చును.

కంపెనీల చట్టంలోని సెక్షన్ 108 మరియు సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్, 2015లోని నిబంధన 44 ప్రకారం మరియు సెబి సర్క్యులర్ నెం.సెబి/హెచ్ఓ/సిఎఫ్‌డి/సిఐఆర్/పి/2020/242, తేది:9,డిసెంబర్,2020 ప్రకారం సభ్యులందరికీ ఎలక్ట్రానిక్ విధానం ద్వారా ఓటు నమోదు చేసే అవకాశం కల్పించనున్నారు, ఈమేరకు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ వారు సౌకర్యం కల్పించనున్నారు. దీనితో పాటుగా, ఏజిఎం కొనసాగుతున్న సమయంలో కూడా ఓటింగ్ సదుపాయం కల్పించనున్నారు. [illegible] ఏజిఎం నోటీసులో పేర్కొనడం జరిగింది.

ఇ-మెయిల్ అడ్రస్‌లను నమోదు చేసుకోలేకపోయిన సభ్యులకు తెలియజేయునది ఏమనగా ఒకవేళ ఓట్లు ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్నట్లయితే డిపాజిటరీ పార్టిసిపెంట్స్ ద్వారా మరియు ఒకవేళ వాటాలు భౌతిక రూపంలో ఉన్నట్లయితే వారంతా కంపెనీ యొక్క ఆర్టీఏను, ఆర్తీ కన్సల్టెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్, 1-2-285, దోమలగూడ, హైదరాబాద్-500029, ఇ-మెయిల్: info@aarthiconsultants.com వద్ద సంప్రదించి రిజిస్టర్ చేసుకోవచ్చును.

ఒకవేళ సభ్యులు భౌతిక రూపంలో వాటాలను కలిగివున్నట్లయితే వారంతా సెబి యొక్క సర్క్యులర్ SEBI/HO/MIRSD/MIRSD_RTAMB/P/CIR/2021/655, తేది:3,నవంబర్,2021, SEBI/HO/MIRSD/MIRSD_RTAMB/P/CIR/2021/687,తేది:14,డిసెంబర్,2021 మరియు SEBI/HO/MIRSD/MIRS-PoD-1/P/CIR/2023/37, తేది:16,మార్చి,2023 ద్వారా ఇన్వెస్టర్ సర్వీసెస్ రిక్వెస్ట్ కోసం సూక్ష్మీకరించడం జరిగింది. [illegible] సెబి వారు దీనికి సంబంధించిన ఫామ్స్‌ను దిగువ విధంగా సూచించారు.

ఫామ్స్	వివరణ
ఫామ్ ఐఎస్ఆర్-1	పాన్,బ్యాంక్ అకౌంట్ వివరాలు, సంతకం, మొబైల్,ఇ-మెయిల్ ఐడి, చిరునామా లేదా మార్పులు/అప్డేషన్ వివరాల నమోదు కోసం అభ్యర్థన
ఫామ్ ఐఎస్ఆర్-2	బ్యాంకర్ ద్వారా సెక్యూరిటీస్ హోల్డర్ యొక్క సంతకం ధ్రువీకరణ
ఫామ్ ఎస్‌హెచ్-13	నామినేషన్ ఫామ్
ఫామ్ ఐఎస్ఆర్-3	డిక్లరేషన్ ఫర్ నామినేషన్ ఆప్ట్ అవుట్ ఫామ్
ఫామ్ ఎస్‌హెచ్-14	నామినేషన్‌లో మార్పు

పైన పేర్కొన్న ఫామ్స్ కంపెనీ యొక్క వెబ్‌సైట్ https://balaxipharma.in/investor-contacts వద్ద నుండి పొందవచ్చును. దీనికి అనుగుణంగా, సభ్యులకు అభ్యర్థించునది ఏమనగా వారంతా సర్వీస్ రిక్వెస్ట్‌ను/ రికార్డ్‌ను అప్డేట్ చేసుకోవడం వంటి పనులను సంతకం చేసిన ఫామ్‌ను నింపడం ద్వారా, దీనితో పాటుగా సంబంధిత కంపెనీ యొక్క ఆర్టీఏ రుజువులను లిస్ట్‌లో పొందుపర్చిన విధంగా కంపెనీ యొక్క ఆర్టీఏ, ఆర్తీ కన్సల్టెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్, 1-2-285, దోమలగూడ, హైదరాబాద్-500029, ఇ-మెయిల్: info@aarthiconsultants.com వద్ద సమర్పించాలని కోరడమైనది.

బాలాక్సీ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కొరకు
మహేష్ ఇనాని
(కంపెనీ సెక్రటరీ అండ్ కాంప్లియన్స్ అధికారి)
మెంబర్‌షిప్ నెం. ఎ37577

ప్రదేశం: హైదరాబాద్
తేది:30,జులై, 2024

MEDINOVA DIAGNOSTIC SERVICES LIMITED

CIN: L85110TG1993PLC015481
Regd. Office : H.No. 7-1-58, Unit No. 1/Flat No.301, 3rd Floor, Amrutha Business Complex, Ameerpet, Hyderabad - 500 016. E mail - cs@medinovaindia.com, website- www.medinovaindia.com, Tel : 040-42604250

30 జూన్, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం

(రూ.లక్షల్లో)

క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్ - ముగిసిన త్రైమాసికం 30-06-2024 (ఆడిట్‌చేయనివి)	స్టాండ్‌అలోన్ - ముగిసిన త్రైమాసికం 31-03-2024 (ఆడిట్‌చేసినవి)	స్టాండ్‌అలోన్ - ముగిసిన త్రైమాసికం 30-06-2023 (ఆడిట్‌చేయనివి)	స్టాండ్‌అలోన్ - ముగిసిన సంవత్సరానికి 31-03-2024 (ఆడిట్‌చేసినవి)	కన్సాలిడేటెడ్ - ముగిసిన త్రైమాసికం 30-06-2024 (ఆడిట్‌చేయనివి)	కన్సాలిడేటెడ్ - ముగిసిన త్రైమాసికం 31-03-2024 (ఆడిట్‌చేసినవి)	కన్సాలిడేటెడ్ - ముగిసిన త్రైమాసికం 30-06-2023 (ఆడిట్‌చేయనివి)	కన్సాలిడేటెడ్ - ముగిసిన సంవత్సరానికి 31-03-2024 (ఆడిట్‌చేసినవి)
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	187.50	207.15	185.49	803.90	250.72	262.35	243.62	1,036.34
2	కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (పన్ను మరియు మినహాయింపుగల ఐటంలకు ముందు)	21.85	39.42	8.41	101.67	55.45	70.28	37.70	227.89
3	పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల ఐటంల తరువాత)	21.85	39.42	8.41	101.67	55.45	70.28	37.70	227.89
4	పన్ను తరువాత కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం)	16.63	29.45	4.38	75.27	42.24	59.89	33.30	199.89
5	ఇతర సమగ్ర ఆదాయం	-	1.22	-	1.22	-	1.22	-	1.22
6	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	16.63	30.67	4.38	76.49	42.24	61.11	33.30	201.11
7	ఈక్విటీ వాటా మూలధనం	995.68	995.68	995.68	995.68	995.68	995.68	995.68	995.68
8	గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివాల్యుయేషన్ రిజర్వు మినహాయించి)				(1,278.77)				(1,509.25)
9	వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/-ల చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు)								
	1. బేసిక్: (రూ.)	0.17	0.30	0.04	0.75	0.42	0.60	0.33	2.00
	2. డైల్యూటెడ్: (రూ.)	0.17	0.30	0.04	0.75	0.42	0.60	0.33	2.00

గమనిక: 1) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద బాంబే స్టాక్ ఎక్చేంజీలతో దాఖలు చేయబడిన 30 జూన్, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆర్థిక ఫలితాల పై పేర్కొన్న నివేదిక వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం. 30 జూన్, 2024తో ముగిసిన త్రైమాసికపు ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి వివరాలు బాంబే స్టాక్ ఎక్చేంజ్ వెబ్‌సైట్: www.bseindia.com మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.medinovaindia.com పై అందుబాటులో ఉంటాయి.

గమనిక: 2) కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 230 నుండి 232 మరియు ఇతర వర్తించు నియమాలు మరియు అందులో ఫ్రేమ్‌చేసిన ఇతర రూల్స్ మరియు రెగ్యులేషన్స్ క్రింద 01 ఏప్రిల్, 2024 (ది అపాయింట్‌మెంట్ తేది) నుండి పేరెంట్ కంపెనీ 'విజయ డయాగ్నస్టిక్ సెంటర్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫెరీ కంపెనీ)తో మరియు కంపెనీ యొక్క ప్రతిపాదిత స్కీమ్ ఆఫ్ అమల్గామేషన్ (ట్రాన్స్‌ఫర్ కంపెనీ)లోకి ఆమోదించించి మరియు 26 జూన్, 2024న నిర్వహించిన వారి సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల పరిగణలోకి తీసుకున్నారు. సదరు స్కీమ్ అనునది అవసరమైనట్లుగా స్టాక్ ఎక్చేంజీలు, సెబీ, కంపెనీయొక్క వాటాదారులు & రుణదాతలు మరియు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, మరియు రెగ్యులేటరీ మరియు ఇతర అథారిటీల ఇతర ఆమోదాలు, అనుమతులు మరియు మంజూరుకు లోబడి ఉంటుంది.

for MEDINOVA DIAGNOSTIC SERVICES LTD.
సం/-
సునీల్ చంద్ర కొండపల్లి
మేనేజింగ్ డైరెక్టర్
DIN 01409332

ప్రదేశం: హైదరాబాద్
తేది: 30 జూలై, 2024

బీఆర్ఎస్ వాకౌట్

- అసెంబ్లీలో సన్నబియ్యంపై లొల్లి
- రూ.1100 కోట్ల కుంభకోణం జరిగిందన్న ప్రతిపక్షం
- సభాసంఘం వేయాలని డిమాండ్
- కుదరదని తేల్చిచెప్పిన మంత్రి దుద్దిళ్ల



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. పౌరసరఫరాల శాఖలో జరిగిన సన్నబియ్యం కుంభకోణంపై హౌస్ కమిటీ వేయాలనే తమ డిమాండ్‌ను ప్రభుత్వం తిరస్కరించినందుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే తారకరామారావు తెలిపారు. అంతకుముందు ఈ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. గోడౌన్లు ఖాళీ చేసి, ధాన్యాన్ని తరలించేందుకు పిలిచిన టెండర్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అలాగే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక సన్నబియ్యంకు మాత్రమే ఇస్తామనడం సరికాదన్నారు. 2021లో తాము 31 లక్షల కొత్త రేషన్‌కార్డులు ఇచ్చామనీ, ఇప్పటి ప్రభుత్వం ఎప్పుడు కొత్త రేషన్‌కార్డులు ఇస్తుందో కచ్చితమైన తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డును లింక్ చేయడం వల్ల అర్హులకు నష్టం జరుగుతున్నదని చెప్పారు. దీనికి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానం చెప్పారు. సన్నబియ్యం కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు. 2014 నుంచి పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్‌కార్డు కూడా ఇవ్వకుండా, సభను తప్పుతోవ పట్టిస్తున్నారని చెప్పారు.



2014 నాటికి రాష్ట్రంలో 91 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉంటే, ఆ తర్వాత అవి 86 లక్షలకు తగ్గాయన్నారు. మంత్రి సమాధానంపై బీఆర్ఎస్ సభ్యులు సంతృప్తి చెందలేదు. సభాసంఘం నియమించాలని డిమాండ్ చేశారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకొని, బీఆర్ఎస్ సభ్యుల డిమాండ్‌ను తిరస్కరిస్తున్నట్టు చెప్పారు. దీనితో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియంలోకి వెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే తారకరామారావు మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖలో సన్నబియ్యం కొనుగోళ్లలో రూ.1100 కోట్ల కుంభకోణం జరిగిందనీ, తమ హయాంలో కొత్త రేషన్‌కార్డులు ఇస్తే, ఇవ్వలేదంటూ మంత్రి సభను తప్పుతోవ పట్టించారని ఆరోపించారు. పంటలకు బోనస్ ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం అస్సలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. దీనికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం బడ్జెట్ పద్దులకు శాసనసభ ఆమోదం తెలిపినట్టు స్పీకర్ ప్రకటించారు. రాత్రి 10.35 నిముషాలకు శాసనసభను బుధవారానికి వాయిదా వేశారు.


వరుస లైంగికదాడి ఘటనలపై
కఠిన చర్యలు తీసుకోవాలి

- హరీశ్ రావు ట్వీట్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్
రాష్ట్రంలో జరుగుతున్న వరుస లైంగిక దాడి ఘటనలపై మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఒక్కరోజే రాష్ట్రంలో నాలుగు లైంగికదాడులు జరగడం బాధాకరమని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి అని వ్యాఖ్యానించారు. మహిళలకు భద్రత కరువైందనీ, పెరిగిన లైంగిక దాడుల గురించి అసెంబ్లీలో మాట్లాడి 48 గంటలు కూడా కాకముందే ఈ రతహా ఘటనలు జరగడం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయమని చెప్పారు. చట్టాలు చేసే అసెంబ్లీలో మనం ఉండి ఎందుకనే ప్రశ్న వేసువాల్సిన తరుణమని అన్నారు. మహిళల భద్రతకు చిరునామాగా ఉన్న తెలంగాణలో ఇలాంటి ఘటనలు వరుసగా జరగటం ఆందోళనకరమని అభిప్రాయపడ్డారు. వనస్థలిపురం పీఎస్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై సామూహిక లైంగికదాడి, ఓయూ పీఎస్ పరిధిలో ప్రయాణికురాలిపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ అఘాయిత్యం చేయడం, నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో దివ్యాంగ మహిళపై లైంగికదాడి జరపడం, నిర్మల్ నుంచి ప్రకాశం వెళుతున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో మహిళపై డ్రైవర్ అఘాయిత్యం చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. లైంగికదాడి బాధితులకు భరోసా కల్పించాలనీ, నిందితులను గుర్తించి కఠిన శిక్ష పడేలా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా భద్రత పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

గంధంగూడలో గన్ మిస్‌ఫైర్

- మహిళ కాలులోకి దూసుకొచ్చిన బుల్లెట్
- ఆర్మీ జవాన్లు ఫైరింగ్ చేస్తుండగా ఘటన



నవతెలంగాణ-గండిపేట్
గంధంగూడలో బుల్లెట్ కాల్పులు కలకలం సృష్టించాయి. ఆర్మీ జవాన్లు ఫైరింగ్ చేస్తుండగా.. మిస్ ఫైర్ కావడంతో బుల్లెట్ ఓ మహిళ కాలులోకి దూసుకొచ్చింది. దాంతో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. నార్సింగ్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గంధంగూడ, బైరాగిగూడ పక్కన ఆర్మీ ఫైరింగ్ రేంజ్ ఉంది. మంగళవారం జవాన్లు ఫైరింగ్ చేస్తుండగా మిస్ ఫైర్ కావడంతో బుల్లెట్ గంధంగూడలోని ఓ ఇంట్లోని మహిళ కాలులోకి దూసుకొచ్చింది. దాంతో మహిళ అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే నార్సింగ్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. మిస్ ఫైర్ కావడమే ఘటనకు కారణమని పోలీసులు గుర్తించారు. అయితే ఈ నెలలోనే ఇది రెండో ఘటన అని స్థానికులు తెలిపారు. గతంలో ఇదే ప్రాంతంలోని నాలుగో అంతస్తులోని ఓ ఇంట్లోకి కూడా బులెట్ దూసుకొచ్చినట్టు స్థానికులు ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్యతతోనే మొండి ప్రభుత్వానికి బుద్ధి చెప్పగలం

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
రవాణా రంగంలోని కార్మికులంతా ఐక్యంగా పోరాడితేనే కేంద్రంలోని నరేంద్రమోడీ మొండి ప్రభుత్వానికి బుద్ధి చెప్పగలమని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను అర్థం చేసుకుని ట్రాన్స్‌పోర్టు కార్మికులంతా ఐక్యపోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే కార్మికులకు అనుకూలమైన విధానాలు అమలు చేసే అవకాశం ఉంటుందన్నారు. లేకపోతే కార్మికులపై ఆర్థిక భారాలు పెద్దఎత్తున మోపుతూ, ఆర్భాటంగా ప్రచారాలు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. కొత్త చట్టం ద్వారా చలానాలు విధిస్తూ, భారాలు మోపటానికి కేంద్రం చూస్తున్నదని విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు రాంబాబు, జి.ఉపేందర్, కె.అజయ్‌బాబు, సీహెచ్. లక్ష్మి నారాయణ, కోటయ్య, రాష్ట్ర కార్యదర్శి వై. విక్రమ్, పున్నం రవి, ఎస్.రాము, కోశాధికారి సతీష్, నాయకులు సత్తయ్య, ఉషన్న, రాములు, శ్రీను, సంపత్, రాందాసు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్టని మోడీ ప్రభుత్వం

తగ్గిస్తున్న బడ్జెటరీ కేటాయింపులు

- వాటినీ ఖర్చు చేయలేకపోతున్న ఆరోగ్య శాఖ
- 2023-24లో 10 శాతం లోపే ఖర్చు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ పాలనలో ప్రజారోగ్యం గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. బడ్జెట్ కేటాయింపులు రానురానూ పలచబడి పోతున్నాయి. పోనీ కేటాయించిన అరకొర నిధులైనా ఖర్చవుతున్నాయా అంటే అదీ లేదు. 2023-24 బడ్జెట్‌లో తనకు కేటాయించిన నిధుల్లో ఆరోగ్య మంత్రిత్వ శాఖ 10 శాతం కంటే ఎక్కువ ఖర్చు చేయలేకపోయింది. 2019లో మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మంత్రిత్వ శాఖ ఇంత తక్కువ మొత్తం ఖర్చు చేయడం ఇదే మొదటిసారి. ఆరోగ్య శాఖ ఖర్చు చేయని మొత్తం అక్షరాలా రూ.8,550.21 కోట్లు. ఈ మొత్తం దేశంలో నూతన ఎయిమ్స్ తరహా సంస్థల ఏర్పాటు, అభివృద్ధికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేటాయించిన దాని కంటే ఎక్కువే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థల ఏర్పాటు, అభివృద్ధికి రూ.6,800 కోట్లు కేటాయించారు. 2022-23 నుండే ఆరోగ్య శాఖ తనకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయడం లేదని గణాంకాలు చెబుతున్నాయి.

2019-20 నుంచి వరుసగా నాలుగు సంవత్సరాల పాటు ఆరోగ్య శాఖకు బడ్జెట్ అంచనాల కంటే సవరించిన అంచనాలే అధికంగా ఉన్నాయి. బడ్జెట్‌ను ప్రవేశపెట్టేటప్పుడు బడ్జెట్ అంచనాలు చెబుతారు. బడ్జెట్ ప్రకటన తర్వాత కొన్ని నెలలకు సవరించిన అంచనాలు ఇస్తారు. మంత్రిత్వ శాఖ పనితీరు, దాని భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆర్థిక సంవత్సరంలో మిగిలిన నెలలకు అంచనాలు సవరిస్తారు. అంటే ఆరోగ్య శాఖకు నాలుగు సంవత్సరాల పాటు బడ్జెట్‌లో కేటాయించిన దాని కంటే ఎక్కువ మొత్తమే అందింది. కానీ 2022-23, 2023-24లో సీన్ రివర్స్ అయింది.

ఇదేం పద్ధతి?

నిజం చెప్పాలంటే ప్రజారోగ్యంపై మోడీ ప్రభుత్వం చేస్తున్న వ్యయం ప్రపంచంలోనే అతి తక్కువగా ఉంటోంది. కానీ ఘనత వహించిన ఆరోగ్య శాఖ తనకు కేటాయించిన ఆ స్వల్ప మొత్తాన్ని కూడా ఖర్చు చేయడం లేదు. వైద్య ఖర్చుల కారణంగా పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నిటి ఆయోగ్ కూడా దీనిని ధృవీకరించింది. ఒక వైపు ఆరోగ్య రంగానికి బడ్జెటరీ కేటాయింపులు తక్కువగా ఉంటున్నాయని చెబుతూనే మరోవైపు కేటాయించిన ఆ స్వల్ప మొత్తాన్ని కూడా ఖర్చు చేయకపోవడం దారుణమని ఆరోగ్య నిపుణుడు ఇంద్రానిల్ ముఖోపాధ్యాయ వ్యాఖ్యానించారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే బడ్జెట్‌లో కేంద్రం స్పాన్సర్ చేస్తున్న పథకాలు కూడా కొన్ని ఉన్నాయి. వీటిపై అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. పథకాల నిర్వహణ, కేటాయించిన సొమ్మును ఖర్చు చేయాల్సిన బాధ్యత రాష్ట్రాలదే. కొన్ని సందర్భాలలో రాష్ట్రాలు తమ డిమాండ్లను కేంద్రానికి తెలియజేయడంలో జాప్యం జరుగుతుంది. ఫలితంగా కేంద్రం నుండి నిధుల విడుదల కూడా ఆలస్యమవుతుంది. అయితే నిధులు ఖర్చు చేయకపోవడానికి అది కారణం కాదు.



తగ్గిన కేటాయింపులు

ఆరోగ్య శాఖకు రెండు భాగాలుగా బడ్జెటరీ కేటాయింపులు జరుపుతారు. అవి ఆరోగ్యం-కుటుంబ సంక్షేమ విభాగం, ఆరోగ్య పరిశోధన విభాగం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి రూ.87,656 కోట్లు కేటాయించారు. ఇది గత బడ్జెట్ అంచనాల కంటే 13 శాతం అధికం. అయితే ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేస్తే వాస్తవ కేటాయింపులు మూడు శాతానికి పైగా తగ్గిపోయాయి.

జీడీపీలో 0.29 శాతమే

2022-23 నుండి ఆరోగ్య రంగానికి కేటాయింపులు తగ్గిపోవడం మొదలైంది. 2017లో మోడీ ప్రభుత్వం జాతీయ ఆరోగ్య విధానాన్ని రూపొందించింది. దీని ప్రకారం ప్రతి సంవత్సరం ఆరోగ్య బడ్జెట్‌ను పెంచాలి. 2025 నాటికి స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) ఆరోగ్య రంగంపై ఖర్చు 2.5 శాతానికి చేరాలి. అయితే ప్రభుత్వం కేటాయింపులు తగ్గిస్తూ దేశాన్ని వెనక్కి తీసుకుపోతోంది.

ఆరోగ్య రంగానికి ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించింది జీడీపీలో కేవలం 0.29 శాతం మాత్రమే. మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన నేషనల్ టెలి మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌కు ఈ బడ్జెట్‌లో కేవలం రూ.90 కోట్లు మాత్రమే కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.133 కోట్లు కేటాయిస్తే ఖర్చు చేసింది రూ.65 కోట్లే. సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా 9-14 సంవత్సరాల మధ్య వయసున్న బాలికలను హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకునేలా ప్రోత్సహిస్తామని మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి తెలిపారు. కానీ బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదు.

అన్నింటికీ కోతలే

ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షా యోజన (పీఎంఎస్‌ఎస్‌ఐ)లో రెండు భాగాలు ఉన్నాయి. అవి ఎయిమ్స్ సంస్థల ఏర్పాటు, ప్రభుత్వ వైద్య కళాశాలలు-సంస్థల అభివృద్ధి. అయితే పీఎంఎస్‌ఎస్‌ఐకి బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి. మోడీ ప్రభుత్వ పది సంవత్సరాల పాలనలో కొత్తగా నిర్మించిన 16 ఎయిమ్స్ ఆస్పత్రుల్లో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు.

11 ఆస్పత్రులు మాత్రం పాక్షికంగా పనిచేస్తున్నాయి. ప్రధాని మోడీ తన నియోజక వర్గమైన వారణాసిలో ప్రారంభించిన ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు 2023-24 వరకూ కేటాయించింది కేవలం రూ.14,138.98 కోట్లు మాత్రమే. ఈ ఏడాది ఈ పథకానికి రూ.3,756 కోట్లు కేటాయించారు. ఇక ఆరోగ్య, వైద్య విద్యకు సంబంధించిన మానవ వనరుల కోసం రూ.1,274.8 కోట్లు మాత్రమే విదిల్చారు.

హయ్యర్ పెన్షన్‌పై వక్రీకరించి జవాబులా?

ఎంప్లాయీ పెన్షన్ స్కీంలో 2014లో ఈపీఎఫ్ఓ చేసిన సవరణలపై రాష్ట్ర హైకోర్టులలో వచ్చిన తీర్పులన్నింటి పైన ఈపీఎఫ్ఓ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపైన నవంబర్ 4, 2022న తన తుది తీర్పును వెలువరించింది. ఆ తీర్పు ఏ విధంగా అమలు అవుతుందో తెలపాలంటూ సీపీఐ(ఎం) లోక్‌సభ సభ్యులు 29-7-24నాడు శ్రీ కె. రాధాకృష్ణన్‌ను అడిగిన ప్రశ్నకు (ప్రశ్న నెం. 1020) కార్మికశాఖ సహాయ మంత్రి శుశ్రీ శోభా కరాంద్లజే వ్రాతపూర్వక సమాధానం ఇచ్చారు. 4.11.2022న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈపీఎఫ్ఓ అమలు చేస్తున్నదని, హయ్యర్ పెన్షన్ కోసం అప్లై చేసుకొనే సమయం జులై 11, 2023తో ముగిసిపోయిందని, ఆ అప్లికేషన్స్ ప్రాసెస్ చేస్తున్నామని తెలియజేశారు.

ఈపీఎస్ - 1995లోని నిబంధనల ప్రకారమే ప్రోరేటా (దామాషా) పద్ధతిలో లెక్కించి పెన్షన్ చెల్లిస్తామని రెండవ ప్రశ్నకు సమాధానంగా ఇచ్చారు.

ఇక్కడే ప్రభుత్వం పార్లమెంటును కూడా మోసం చేస్తుందని భావించాల్సి వస్తున్నది. ఈపీఎస్ - 1995 స్కీంలో హయ్యర్ పెన్షన్‌ను దామాషా పద్ధతిలో చెల్లించాలని ఎక్కడా నిర్వచించలేదు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చేంత వరకు ఎవరయితే హయ్యర్ పెన్షన్ కోసం హయ్యర్ వేజెస్ పైన చెల్లించి రిటైర్మెంట్ అయ్యారో, వారందరికి కూడా ఈపీఎస్ - 1995లో నిర్దేశించిన, ఆగస్టు 2014లో చేసిన సవరణను అనుసరించి చివరి 60 నెలల సగటు జీతంపైన లెక్కించి పెన్షన్



చెల్లించారు. అలా లెక్కించేటప్పుడు 1995 కంటే ముందు ఫ్యామిలీ పెన్షన్ స్కీం ద్వారా తనకు వచ్చే పెన్షన్ కూడా కలిపి ఇస్తున్నారు. మంత్రిగారు పార్లమెంటుకు ఇచ్చిన సమాధానం ప్రకారమే హయ్యర్ పెన్షన్ కూడా ప్రోరేటా (దామాషా) పద్ధతిలో చెల్లిస్తున్నట్లయితే, 2023 జూన్ 1న ఒక సర్క్యులర్‌ను, డిశంబర్ 13, 2023న మరో సర్క్యులర్‌ను ఎందుకు విడుదల చేశారో సమాధానం చెప్పాల్సి వుంటుంది.

ఆ రెండు సర్క్యులర్స్‌లో 2014 సవరణల కంటే ముందు నుండే హయ్యర్ పెన్షన్ పొందే అర్హత కలిగిన వారికి పెన్షనబుల్ సర్వీసు X పెన్షనబుల్ జీతం (12 నెలల సగటు) / 70 ప్రకారం పెన్షన్ పొందుతారని, 2014 సవరణల తర్వాత అర్హత పొందే వారి పెన్షనబుల్ జీతంగా 60 నెలల సగటును తీసుకొని పెన్షన్ చెల్లిస్తామని తెలియజేశారు. ఇదే చట్టంలో పేర్కొన్నది కూడా.

కానీ 14.02.2024న ఒక అనధికారిక ఉదాహరణను సర్క్యులేట్ చేసి పెన్షన్ లెక్కింపులో దామాషా పద్ధతిని అమలు చేస్తున్నారు. ఇది చట్టవ్యతిరేకం మాత్రమే కాదు, సుప్రీంకోర్టు తీర్పుకు కూడా వ్యతిరేకమైనది కూడా. ఎందుకంటే, సుప్రీంకోర్టు తన తీర్పులోని పేరా నెం. 44 (i)లో "The provisions contained in the Notification no - GSR - 609 (E), date. 22.08.2024 are legal and valied" అని చెప్పింది. అంటే పెన్షన్ లెక్కించే పద్ధతి జూన్, డిశంబర్ - 2023లలో ఇచ్చిన పద్ధతిలో వుండాలని కోర్టు తన తీర్పులో చెప్పింది.

కానీ ఆ పద్ధతిని మార్పు చేసి, 14.02.2024 నుండి దామాషా పద్ధతిని ముందుకు తీసుకొని రావడం అంటే, కోర్టు అనుమతి లేకుండా కోర్టు తీర్పును ఉల్లంఘించడమే అవుతుంది. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణే కాక, హయ్యర్ పెన్షన్ కోరుతూ అప్లికేషన్స్ పెట్టుకొన్న 18 లక్షల మందికి న్యాయంగా దక్కాల్సిన పెన్షన్‌లో 1/3 వంతు తగ్గిపోయి, వారి రిటైర్మెంటు జీవితం చిన్నాభిన్నం అవుతుంది. హయ్యర్ పెన్షన్ కోసం డిమాండు నోటీసుల ద్వారా కార్మికుల నుండి వచ్చే సొమ్మే 7 లక్షల కోట్లు వుంటుంది. కానీ కార్మికుల పెన్షన్‌లో కోత పెట్టడం తీవ్రమైన అన్యాయం. చట్టంలో లేని దాన్ని ఉన్నట్లు పార్లమెంటు సభ్యునికి సమాధానం రూపంలో ఇచ్చి దేశ ప్రజలందరిని తప్పుదోవ పట్టించడం సరైంది కాదు. తక్షణమే ప్రభుత్వం దామాషా పద్ధతిని ఉపసంహరించుకోవాలని కార్మికలోకం కోరుకుంటున్నది.ప్రస్తుతానికి ఈ సమస్య 18 లక్షల మందిది. ఇప్పటికే హయ్యర్ పెన్షన్ తీసుకుంటున్న వారి పరిస్థితేమిటి? వారి సంఖ్య మరిన్ని లక్షల్లో ఉంటుంది. దాన్లో ఏమైనా మార్పులు చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

సీఐడీకి చేరిన కమర్షియల్ ట్యాక్స్ స్కామ్ ఫైలు

- ప్రాథమికంగా సమీక్షించిన శిఖాగోయెల్



(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్
రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కమర్షియల్ ట్యాక్స్ ఇన్‌పుట్ సబ్సిడీ స్కామ్ దర్యాప్తు ఫైలును నగర నేర పరిశోధక విభాగం సీఐడీ విభాగానికి మంగళవారం సమర్పించింది. ఈ స్కామ్‌కు సంబంధించిన ఫైలును సీఐడీ అదనపు డీజీ శిఖాగోయెల్ తన విభాగం ఉన్నతాధికారులతో ప్రాథమికంగా సమీక్షించారు. కమర్షియల్ ట్యాక్స్‌తో దాదాపు రూ.1400 కోట్ల రూపాయల మేరకు ఇన్‌పుట్ సబ్సిడీ స్కామ్ చోటుచేసుకున్నదని నగర సీసీఎస్ విభాగం ఇప్పటికే ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన విషయం విదితమే. ఈ స్కామ్ వెనుక కమర్షియల్ ట్యాక్స్ విభాగానికి చెందిన అదనపు డైరెక్టర్ విశ్వేశ్వరరావుతో పాటు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్‌కుమార్ పాత్ర కూడా ఉన్నట్టు దర్యాప్తు అధికారులు ప్రాథమికంగా చేర్చారు. 75 ప్రయివేటు కంపెనీలకు ఈ ఇన్‌పుట్ సబ్సిడీని సమకూర్చడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీ మొత్తంలో నష్టం వాటిల్లినట్టు కూడా తేల్చారు. ప్రాథమిక దర్యాప్తు జరిపి నగర సీసీఎస్ అధికారులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సీఐడీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అందుకు తగిన ఆధారాలను సేకరించిన విధానంతో పాటు లభించిన ప్రాథమిక సాక్ష్యాలను కూడా సీఐడీ అధికారులు దృష్టి సారించినట్టు తెలిసింది. గతంలో సీఐడీ డీజీగా గోవింద సింగ్ పనిచేసిన సమయంలో సైతం నిజామాబాద్ జిల్లా బోధన్ కేంద్రంగా కమర్షియల్ ట్యాక్స్ అధికారులు నకిలీ వే బిల్లులతో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం చేకూర్చిన వైనం వెలుగు చూడటం ఆ సమయంలో సంచలనం రేపింది. అయితే, ఈ నకిలీ వే బిల్లుల కారణంగా రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా కుంభకోణాలు చోటుచేసుకుని ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్టు ఆ సమయంలో సీఐడీ అధికారులకు కొంత సమాచారం అందింది. అయితే, ఏ కారణం చేతనో ఆ స్కామ్‌ను కేవలం బోధన్‌కే పరిమితం చేశారు. తాజాగా ఈ కేసును పరిశీలిస్తున్న సందర్భంగా అధికారుల మధ్య ఈ అంశం కూడా చర్చకు వచ్చినట్టు తెలిసింది.

సర్కారు బడుల్లో ఒక్కో విద్యార్థిపై రూ.89 వేలు ఖర్చు

- 2 వేల ప్రాథమిక పాఠశాలల్లో సున్నా ప్రవేశాలు
- వెయ్యి హైస్కూళ్లలో 50 మందిలోపే విద్యార్థులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో సర్కారు బడుల్లో చదివే ఒక్కో విద్యార్థిపై ఏటా సుమారు రూ.89 వేలు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. విద్యార్థులకు ఉచితంగా ఇచ్చే యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతోపాటు మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల జీతాలు ఇస్తున్నది. వాటన్నింటినీ కలిపి లెక్కిస్తే ఒక్కో విద్యార్థిపై రూ.89 వేలు ఖర్చవుతున్నది. ప్రయివేటు పాఠశాలల్లో ఒక విద్యార్థి ఫీజు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో రూ.20 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయునికి రూ.50 వేల నుంచి రూ.లక్ష ఆపైన జీతం ఉంటుంది. అదే ప్రయివేటు స్కూళ్లలో ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికీ రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఇస్తారు. సర్కారు బడిలో ఒక్కో ఉపాధ్యాయునికి ఇచ్చే జీతంతో ప్రయివేటు స్కూళ్లలో ముగ్గురు లేదా నలుగురు పంతుళ్లు బోధిస్తున్నారు. అందుకే ప్రయివేటు పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్ తప్పనిసరిగా ఉంటారు. సర్కారు బడుల్లో ఉపాధ్యాయులకు జీతాలు ఎక్కువగా ఉన్నా చిత్తశుద్ధితో విద్యార్థులకు పాఠాలు బోధించడం లేదన్న విమర్శ ఉన్నది. ప్రయివేటు స్కూళ్లలో తక్కువ జీతాలున్నా తప్పనిసరిగా బోధనపైనే దృష్టిసారిస్తారు. ఇంకోవైపు వాటిలో పర్యవేక్షణ ఎక్కువగా ఉంటుంది. తరగతి గదికొక టీచర్, ఫ్లోర్ ఇన్‌చార్జీ, వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఉంటారు. పిల్లలు, ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారనేది నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. కొన్ని ప్రయివేటు పాఠశాలల్లో తరగతి గదిలో ఏం జరుగుతుందనేది సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. అదే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్తున్నారా? లేదా? అనేది ఉపాధ్యాయులపై పర్యవేక్షణ కొరవడింది. అన్నింటికంటే ముఖ్యంగా సర్కారు బడి ఉపాధ్యాయులు హైదరాబాద్ నుంచి ఇతర జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు సుమారు గంట నుంచి మూడు గంటలపాటు ప్రయాణం చేస్తారు. బడులకు వెళ్లేసరికి అలసిపోయే పరిస్థితి ఉంటుంది. అదే ప్రయివేటు బడుల్లో పనిచేసే ఉపాధ్యాయులు పాఠశాల ప్రారంభానికి అరగంట ముందే తరగతి గదుల్లో ఉండాలి. బయోమెట్రిక్ హాజరులో ఆలస్యమైతే సగం వేతనమే యాజమాన్యాలు చెల్లిస్తాయి. ఇలా సర్కారు బడులకు, ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎంతో తేడా ఉన్నది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే కొందరు ఉపాధ్యాయులు పర్యవేక్షణతో సంబంధం లేకుండా క్రమశిక్షణతో ఎవరి పని వారు చేసుకుంటారన్న అభిప్రాయం ఉన్నది. సకాలంలో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్తారు. రాష్ట్రంలో2023-23 విద్యాసంవత్సరంలో 40,975 పాఠశాలల్లో 60,42,060 విద్యార్థులు చదివారు. వాటిలో 30,143 ప్రభుత్వ పాఠశాలల్లో 26,36,630 మంది విద్యనభ్యసించారు. 10,832 ప్రయివేటు స్కూళ్లలో 34,05,430 మంది చదివారు. రాష్ట్రంలో 20,003 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలున్నాయి. వాటిలో 8,15,505 మంది చదివారు. అయితే రెండు వేల ప్రాథమిక పాఠశాలల్లో సున్నా ప్రవేశాలు నమోదయ్యాయి. విద్యార్థుల్లోపు 600 ప్రాథమికోన్నత పాఠశాలలు, వెయ్యి ఉన్నత పాఠశాలల్లో 50 మంది విద్యార్థుల్లోపు ఉన్నారు. ఇంకోవైపు సర్కారు బడుల్లో ఒక్కో విద్యార్థిపై రూ.89 వేలు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నా ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళన కలిగించే అంశం.

వచ్చే బడ్జెట్ సమావేశాలు
20 రోజులు పెట్టండి

- మా వైపు నుంచి సంపూర్ణ సహకారం
- ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వచ్చే బడ్జెట్ సెషన్‌ను 20 రోజులు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం సభ ప్రారంభం కాగానే స్పీకర్ అనుమతితో కేటీఆర్ ప్రభుత్వానికి ఈ సూచన చేశారు. బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీ సెషన్ సుదీర్ఘంగా సాగింది. 19 పద్దులను ఒకే రోజు పెట్టి చర్చ జరిపి అప్రూవ్ చేసుకునేందుకు మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సభను నిర్వహించారు. ఐతే వచ్చేసారి మాత్రం ఇలా ఒకే రోజు ఎక్కువ పద్దులు పెట్టకుండా సభ నిర్వహించేలా ప్లాన్ చేయాలని కేటీఆర్ కోరారు. ఈ సారి కొత్తగా 57 మంది ఎమ్మెల్యేలుగా సభలో అడుగుపెట్టారు. వారందరికీ మాట్లాడే అవకాశం ఇవ్వాలంటే సమావేశాలను ఎక్కువ రోజులు నిర్వహించాలన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో రోజుకు రెండు, మూడు పద్దులనే పెడితే సభ్యులకు, అదే విధంగా సమాధానం ఇచ్చేందుకు మంత్రులకు కావాల్సినంత సమయం ఉంటుందని సూచించారు. వచ్చే బడ్జెట్ సెషన్‌ను 20 రోజులు నిర్వహించేందుకు తమ వైపు నుంచి పూర్తి మద్దతు ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబుకు కేటీఆర్ తెలిపారు.

12 రోజుల్లో రూ.12 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

రుణాలను మాఫీ చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. మొత్తం 6.40 లక్షల మంది రైతుల రుణ ఖాతాల్లో రూ.6198 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. రుణవిముక్తి పొందిన లక్షలాది రైతులు తమ ఇండ్లలో పండుగ చేసుకుంటుంటే తమ జన్మ ధన్యమైందని అన్నారు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా జులై 18న తొలి విడతగా రూ. లక్ష లోపు రుణాలున్న రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 11 లక్షల మంది రైతులకు రూ.6098 కోట్లు మాఫీ చేసిందనీ, 12 రోజుల వ్యవధిలోనే రెండో విడతగా మరో రూ.6198 కోట్లు విడుదల చేశామన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు సీపీఐ, బీజేపీ ఎమ్మెల్యేలు సైతం పాల్గొన్నారు. పార్టీలకతీతంగా ఈ వేడుకలో పాలుపంచుకున్న నేతలందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. వ్యవసాయం దండుగ కాదు.. పండుగ చేసి చూపిస్తామని 2022 మే ఆరో తేదీన కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లోనే చెప్పిందని సీఎం గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎనిమిది నెలల్లోనే రైతు రుణమాఫీ అమలు చేశామని చెప్పారు.

నెహ్రూ, శాస్త్రితోనే హరిత విప్లవం : సీఎం

జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రితోనే దేశంలోనే హరిత విప్లవం వచ్చిందని సీఎం చెప్పారు. జైజవాన్, జైకిసాన్ నినాదాలతో దేశ భద్రత, ఆహార భద్రతకు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చిందని గుర్తు చేశారు. రైతులకు మేలు చేసేందుకే భాక్రానంగల్, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులు నిర్మించిందనీ, పేద రైతులకు తక్కువ వడ్డీలకు రుణాలిచ్చేందుకు ఇందిరమ్మ బ్యాంకుల జాతీయికరణ చేసిందన్నారు. సోనియా గాంధీ నేతత్వంలోని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆహార భద్రత చట్టం తెచ్చిందనీ, రూ.72 వేల కోట్ల రుణాలు మాఫీ చేసి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. విత్తనాలు, ఎరువుల సబ్సిడీ, ఉచిత విద్యుత్, పంటల బీమా, మద్దతు ధరలను అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు గత ప్రభుత్వం అప్పుల పాల్జేసి తెలంగాణను తాకట్టు పెట్టిందని ముఖ్యమంత్రి అన్నారు. తాకట్టు నుంచి తెలంగాణను విడిపించి, రుణాల భారం తగ్గించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులకు తమ ప్రభుత్వం ఈ ఎనిమిది నెలల్లో రూ.43 వేల కోట్లు కిస్తీలు చెల్లించిందని చెప్పారు. రుణమాఫీకి నిధులు జమ చేసిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ అధికారుల బృందానికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అటు రైతు రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల లోపు ఉచిత గృహ విద్యుత్తు, రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్నామని అన్నారు.

ప్రజల మేలు కోసమే : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా గాలికి వదిలేసిన పంటల బీమా పథకాన్ని మేము అమలు చేయబోతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. రెండు దశల్లో 17.91 అకౌంట్లకు 16.29 లక్షల కుటుంబాలకు 12,289 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. ఈ సభలో సీఎం ఒక రైతుకు చెక్ అందజేయగానే రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరి ఖాతాలో రుణమాఫీ నిధులు జమ చేశామన్నారు. పీసీసీ అధ్యక్షుడుగా సీఎం రేవంత్‌రెడ్డి నాడు, సీఎల్పీ నేతగా నేను మా నాయకుడు రాహుల్‌గాంధీ హెలికాప్టర్‌లో వెళ్తూ రూ. 2లక్షల రుణమాఫీ గురించి చర్చించి వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటిస్తే ఇది సాధ్యమా? అని అంతా ఆశ్చర్యపోయారని చెప్పారు. ధనిక రాష్ట్రంగా అప్పగిస్తేనే రుణమాఫీ చేయలేదనీ, కాంగ్రెస్ వాళ్ళు చేస్తారా అని అందరు అన్నారని చెప్పారు. మాకు సంకల్ప బలం ఉందనీ, ఆ బలాన్ని నిజం చేస్తూ పార్లమెంటు ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు చివరిలోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నామన్నారు. కేవలం రుణమాఫీకే పరిమితం కాలేదనీ, రైతు బీమా కింద 42 లక్షల మంది రైతులకు సంబంధించిన 1580 కోట్ల ప్రీమియంను రైతుల తరపున ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. దేశ చరిత్రలో, బ్యాంకింగ్ చరిత్రలో ఒకేసారి ఇంత మొత్తం బ్యాంకుల్లో జమ కావడం విశేషమన్నారు. బ్యాంకర్లు విశాల హృదయంతో రైతులకు సహకరించి వెనువెంటనే రుణాలు ఇవ్వాలనీ, ఇంతటి బృహత్కర కార్యక్రమం అమలు చేయడానికి అవకాశం ఇచ్చిన ఏఐసీసీతోపాటు సీఎంకు, సహచర మంత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి, వెంటక్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ్మా, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకులకు కార్పొరేట్ సంస్థలు అప్పులు ఎగవేశాయి : సీఎం

దేశంలో కొన్ని కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని మోసం చేశాయని సీఎం అన్నారు. గడిచిన పదేండ్లలో బ్యాంకులకు దాదాపు రూ. 14 లక్షల కోట్లు ఎగవేశాయని తెలిపారు. పది మందికి అన్నం పెట్టే రైతులు మాత్రం పంట దిగుబడి రాక, గిట్టుబాటు ధర లేక అప్పులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఆత్మగౌరవం దెబ్బతిని కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డ విషాద ఘటనలు చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రైతుల కుటుంబాల్లో ఆనందం నింపాలనే రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రూ.లక్ష రైతు రుణమాఫీ కూడా సరిగ్గా చేయలేక పోయిందనీ, మొదటి సారి అధికారంలో ఉన్నప్పుడు నాలుగు విడతల్లో మాఫీ చేస్తే, రైతులు తమ అప్పుకు మించి మిత్తీలు కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. రెండో సారి అదే హామీతో అధికారంలో వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.19 వేల కోట్లు ఇస్తామని చెప్పి, రూ.12 వేల కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. దాదాపు రూ.7 వేల కోట్లు రైతులకు రుణమాఫీ చేయకుండా ఎగవేసిందని గుర్తు చేశారు. అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రభుత్వం ఎలా రుణమాఫీ చేస్తుందోనంటూ కొందరు తమను అవహేళన చేశారనీ, శాపనార్థాలు పెట్టారని అన్నారు. కానీ తమ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు నెలలోగా రుణమాఫీకి ప్రణాళిక ప్రకారం నిధులను సమీకరించిందని చెప్పారు. ఇది తమ ప్రభుత్వం చిత్తశుద్ధి, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

నిధులివ్వకపోతే
మహారాష్ట్రలో కలిపేయండి

- నల్లగొండ, ఖమ్మం జిల్లాలకే నిధులిస్తే ఎట్లా?
- ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులపై వివక్ష : బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వెనుకబడిన ప్రాంతమైన కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు నిధులివ్వని పక్షంలో మహారాష్ట్రలో కలిపేయాలని బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. శాసనసభలో మంగళవారం సాగునీటి రంగం, సివిల్ సప్లయ్‌పై జరిగిన పద్దులపై ఆయన చర్చలో పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి దగ్గర వాటర్‌ఫ్లో ఉండదనే ప్రచారం అబద్ధమన్నారు. అక్కడ అంబేద్కర్, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించాలనీ, జగన్నాథ్‌పూర్, అడ ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద పారింది ఎంతనో తెల్వదుగానీ..తరుచూ బ్యాక్‌వాటర్‌తో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని భూములు ఆగం అవుతున్నాయని వాపోయారు. మంథని, మంచిర్యాల పట్టణాల్లోకి కూడా ఆ నీళ్లు వస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం దక్షిణ తెలంగాణకు నీళ్లు తరలించి ఉత్తర తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వమూ నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నదనీ, ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులను పట్టించుకోవడం లేదని చెప్పారు. సీఎంఓ కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా అక్కడ ఖమ్మం, నల్లగొండ జిల్లా నేతలే ఉంటున్నారనీ, ఆ రెండు జిల్లాలకే నిధులు పోతే ఎట్లా? అని ప్రశ్నించారు. కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పలు రోడ్ల నిర్మాణం కోసం రూ.12 కోట్ల నిధులను అటవీశాఖకు చెల్లించాలని కోరారు.

సభకు కొత్తోణ్ని..
జర మాట్లాడనీయండి

- బీఆర్ఎస్ సభ్యులు అనిల్‌జాదవ్
- వెన్నుతట్టి ప్రోత్సహించిన కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



'సభకు కొత్తోణ్ని. జర మాట్లాడనీయండి' అంటూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పీకర్‌ను వేడుకున్నారు. ఆయన ప్రసంగం మొదలు పెట్టగానే బీఆర్ఎస్ సభ్యులు కె.తారక రామారావు (కేటీఆర్) దగ్గరకెళ్లి పక్కనే కూర్చున్నారు. మాట్లాడటం పూర్తవ్వగానే 'బాగా మాట్లాడావు' అంటూ వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఎస్సీ,ఎస్టీల కోసం తమ ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలనీ, డిగ్రీకాలేజీ, ఫైర్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని విన్నవించారు. తన నియోజకవర్గంలో ఏర్పడ్డ మూడు కొత్త మండలాల్లో ప్రభుత్వ కార్యాల యాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎత్తిచూపారు. తెల్లరేషన్‌కార్డులను ఇవ్వాలని కోరారు. అంతా బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందనీ, కొత్త ప్రభుత్వం ఇంత వరకూ ఏమీ చేయలేదన్నారు. చివరకు మంత్రి సీతక్క తండ్రికి పోడుపట్టాలను ఇచ్చింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు.

వైటీడీఏ అక్రమాలపై
విచారణ జరపాలి

కాంగ్రెస్ సభ్యులు బీర్ల ఐలయ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్




బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాదగిరి గుట్ట టెంపుల్ డెవలంప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) అక్రమాలపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. వైటీడీఏ పేరిట భూములు సేకరించిన ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వం యాదగిరి గుట్టపై సత్రాలు లేకుండా చేసిందనీ, ఇప్పటికైనా గుట్ట కింది భాగంలో వెయ్యి గదులను నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనాది నుంచి భక్తులకు సేవలందిస్తున్న నాయి బ్రాహ్మణులను, రజకులను క్రమబద్ధీకరించాలని కోరారు. అర్చకులు, ఉద్యోగులను పర్మెంట్ చేస్తామంటూ ఊదరగొట్టిన బీఆర్ఎస్ సర్కారు సగం మందిని పర్మెంట్ చేసి మిగతా వారిని విస్మరించిందన్నారు. భద్రాచలం, వేములవాడ దేవాలయాలను కేసీఆర్ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఆలేరు నియోజకవర్గంలో తాగునీరు, సాగునీటి కొరత ఉందన్నారు. మిషన్ భగీరథ పైపులను నాటి సర్కారు పూర్తి చేయలేదని విమర్శించారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంలో 16 కి.మీ పైపులైన్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. బస్వాపూర్‌కు నీళ్లు ఇవ్వకుండా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి సూర్యాపేటకు తరలించారని విమర్శించారు.

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టాలి

- ఎమ్ఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలి
- ప్రతి ఎకరానికీ సాగునీరందించేలా ప్రణాళికలుండాలి : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టాలని సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. మంగళవారం అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న రైతు ఆత్మహత్యలపై ఆందోళన వెలిబుచ్చారు. 2014 నుంచి ఇప్పటివరకూ దేశంలో 11 లక్షల మంది రైతులు, తెలంగాణలో 7300 మంది అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. ఎమ్ఎస్.స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలనీ, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పారిశ్రామికరంగానికి ఇస్తున్నట్టుగానే వ్యవసాయానికీ ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. నియోజకవర్గ కేంద్రాలను, మండలాలను సెమీనగరాలు అభివృద్ధి చేసి అగ్రిబేస్డ్ పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వాలనీ, గ్రామీణ, మండల ప్రాంతాల్లో కార్పొరేట్‌స్థాయి ఆస్పత్రులను, స్కూళ్లను కట్టించాలని కోరారు. అప్పుడే గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు, మెరుగైన సౌకర్యాలు పెరిగి పట్టణాలకు వలసలు తగ్గుతాయన్నారు. రాష్ట్రంలో ప్రతి ఎకరానికీ సాగునీరందించేలా ప్రణాళికలు రూపొందించుకుని ముందుకుసాగాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళ్లాలనీ, కేంద్రం నుంచి వీలైనంత మేరకు ఎక్కువ నిధులు రాబట్టుకునే ప్రయత్నం చేయాలని చెప్పారు. అమెరికాలో మాదిరిగా రైతుల దగ్గరకు వచ్చి ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. పంటల విధానంలోనూ మార్పులు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.



పోడుపట్టా నా తండ్రి హక్కు

మంత్రినైనా నా తల్లిదండ్రులు పోడు సాగు చేసుకుంటున్నారు

- ఆదివాసీ కాబట్టే నాపై ఆరోపణలు
- చాలామంది మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుబంధు తీసుకున్నారు
- దీనిపై ఇంకోసారి ఎవరైనా మాట్లాడితే బాగుండదు : మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆదివాసీ బిడ్డగా తన తండ్రి పోడుభూమి పట్టా పొందటం ఆయన హక్కని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) నొక్కిచెప్పారు. చివరకు మంత్రి సీతక్క తండ్రికి కూడా కేసీఆరే పోడుభూమి పట్టా ఇచ్చారంటూ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు అనిల్‌జాదవ్ పద్దులపై చర్చ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. అడవులను నరుక్కుని సాగుచేసుకుంటున్న ఆదివాసీలకు భూములు కేటాయించేందుకు యూపీఏ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందన్నారు. దాని ప్రకారం తన తల్లిదండ్రులు పోడు పట్టా పొందడానికి అర్హులు కాబట్టి భూమి పట్టా వచ్చిందని తెలిపారు. అంతేతప్ప అది ఎవరో ఇస్తేనో, దయాదాక్షిణ్యాల వల్లనో వచ్చింది కాదని స్పష్టం చేశారు. ఆదివాసీని కాబట్టే తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాలామంది మంత్రులు, ఎమ్మెల్యేలు లక్షల రూపాయల రైతుబంధు తీసుకున్నారు గదా? వారిని ప్రశ్నించగలరా? అని నిలదీశారు. మంత్రినైనా ఇప్పటికీ అడవుల్లో పోడు చేసుకుని బతుకుతున్న తన తల్లిదండ్రులపై ఇలా మాట్లాడటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తన తల్లిదండ్రులకు హక్కుగా వచ్చిన పోడుభూమి పట్టాపై ఇంకోసారి మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. మొన్నమొన్ననే బీఆర్ఎస్‌లోకి వెళ్లిన అనిల్‌జాదవ్ కూడా ఇలా మాట్లాడటం సరిగాదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన రిజర్వేషన్ వల్లనే ఆయన ఎమ్మెల్యే అయ్యారనీ, చాలా మంది గిరిజనులకు, ఆదివాసీలకు ఉద్యోగాలు లభించాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో మైనార్టీలకు ఇస్తామన్న రిజర్వేషన్లు ఏమయ్యాయని నిలదీశారు. ఎనిమిది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిచ్చిందో చెప్పడానికి తాను సిద్ధమనీ, గిరిజనులకు, ఆదివాసీలకు కేసీఆర్ సర్కార్ ఏమిచ్చిందో చెప్పాలని సవాల్ విసిరారు.

బీఆర్ఎస్ సభ్యురాలు కోవ లక్ష్మి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో అనేక సమస్యలున్నా యంటూ ఏకరువు పెట్టారు. ప్రతిగా సీతక్క స్పందిస్తూ వెనుక బడిన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు. గిరిజన చట్టాలు, రిజర్వేషన్లను కల్పించింది కూడా తమ పార్టీయేనని చెప్పారు. తాను కూడా ఎస్టీ హాస్టల్‌లోనే చదువుకున్నానని గుర్తు చేశారు. రాష్ట్రంలో అనర్హుల చేతుల్లో పోడు భూములున్నాయని తెలిపారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అవకతవ కలను సవరించి పోడు సాగుదారుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీనిచ్చారు.

పద్దులపై చర్చలో పాల్గొన్న కాంగ్రెస్ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ... సాగుచేసే రైతులకూ రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ సభ్యుడు కె. వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ... వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను నిర్వీర్యం చేయడం సబబుకాదని అన్నారు. రుణమాఫీ చేయటాన్ని ఆయన ఆహ్వానించారు. కాంగ్రెస్ సభ్యురాలు పర్ణికారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికార పార్టీకే చెందిన మరో సభ్యురాలు యశస్విని రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ సర్కారు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. దేవాదుల కాల్వల మరమ్మతులను చేపట్టాలని ఆమె కోరారు. బీఆర్ఎస్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పంచాయతీరాజ్‌కు నిధుల కేటాయింపుల ప్రాధాన్యతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యుడు మందుల సామేలు మాట్లాడుతూ, కాంగ్రెస్‌తోనే సామాజిక అభివృద్ధి సాధ్యమన్నారు. తన నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

క్రీడలను బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం చేసింది

- పీఈటీ, స్పోర్ట్స్ పీరియడ్, గ్రౌండ్ లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : కాంగ్రెస్ సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ సర్కారు క్రీడలను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ విమర్శించారు. క్రీడ ప్రాంగణాలను ఆయా గ్రామాల బొద్దల గడ్డల్లో నిర్మించిందని తెలిపారు. అవి ఎందుకు పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్ పద్దులపై ఆయన మాట్లాడారు. యువతను సన్మార్గంలో నడిచేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఆ దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు రూ. 361 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. అదే విధంగా హకీంపేట స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతోపాటు గచ్చిబౌలి, యుసూఫ్‌గూడ, ఎల్బీ స్టేడియాలను అంతర్జాతీయ స్థాయిలో మరమ్మత్తులు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాసగౌడ్, ఎర్రబెల్లి దయాకరరావుతో కమిటీ వేసి చేతులు దులుపుకున్నదని తెలిపారు. అప్పటి ప్రభుత్వానికి క్రీడలపై ఒక విధానం కూడా లేదని విమర్శించారు. ఇటీవల పతకాలు సాధించిన మను బాకర్, నిక్కత్ జరీన్, ఇషాసింగ్, ఆకుల శ్రీజ తదితరులకు ఆయన శుభాకాంక్షలు, అభినందలు తెలిపారు.

బీఆర్ఎస్ అండతో కాలుష్య పరిశ్రమలు

కాంగ్రెస్ సభ్యులు అనిరుధ్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



పదేండ్ల బీఆర్ఎస్ సర్కారు అండతో కాలుష్య కారక పరిశ్రమలు కొనసాగాయని కాంగ్రెస్ సభ్యులు అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. ఎన్‌జీటీ ప్రకారం రెడ్ కేటగిరీ పరిశ్రమలు జన వాసాల మధ్య ఉండకూదన్నారు. పటాన్‌చెరువు, బొల్లారం, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. వాటిపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేస్తే అధికారులు ఆయా పరిశ్రమల యాజమానులకు సమాచారమిచ్చి పరిశీలనకు పోతున్నారని ఆరోపించారు. హరితహారం భాగంగా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో నిషేధించిన కోన కార్పస్ అనే ప్రమాదకరమైన మొక్కను నాటారని తెలిపారు. ఆ మొక్కలు తెలంగాణ భవన్ చుట్టూ కూడా ఏపుగా పెరిగాయనీ, వాటి గాలి పీల్చడం అనేక వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళల హామీలు అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- కరీంనగర్‌లో మహిళా సమస్యలపై న్యాయ నిపుణులతో కౌన్సెలింగ్ సెంటర్



నవతెలంగాణ-కరీంనగర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. కరీంనగర్ పట్టణంలో నిర్వహించిన ఐద్వా రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు అనంతరం ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ స్థాయి రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులకు ఆతిథ్యం ఇచ్చిన ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీకి అభినందనలు తెలిపారు. మహిళా ఉద్యమానికి, రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతుల జయ ప్రదానికి సహకరించిన సానుభూతిపరులకు, ప్రజానీకానికి, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలను చైతన్య పరుస్తూ మహిళా సమస్యల పరిష్కారానికి అనేక కర్తవ్యాలను రూపొందించామని, కర్తవ్యాల అమలుకు ఐక్య పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. మహిళలపై లైంగిక దాడులు, భ్రూణ హత్యలు, వరకట్న వేధింపులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, బెల్ట్ షాపులు, డ్రగ్ మాఫియా, పోర్న్ వెబ్‌సైట్‌లను అరికట్టి, దశలవారీగా మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని మహిళా సంఘాలతో ఐక్య కూటమి ఏర్పాటు చేసి పోరాడుతామన్నారు. ఇక నుంచి కరీంనగర్ ముకుందలాల్ మిశ్రా భవన్‌లో మహిళా సమస్యలపై న్యాయ నిపుణులతో కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, మహిళలకు అండగా ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీ పని చేస్తుందని తెలిపారు. ఈ సమా వేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు అన్నపూర్ణ, రోజారాణి, దేవేంద్ర, లావణ్య, సంధ్య యమున, లక్ష్మి రజిత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పింఛన్ ఇవ్వలేదు

మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆసరా పింఛన్‌కు సంబంధించి 2020 జులై నెలలో లబ్దిదారులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పింఛన్ ఇవ్వలేదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. శాసనసభలో మంగళవారం ఆమె మాట్లాడుతూ దీనికి సంబంధించిన రికార్డులను సభలో ప్రవేశపెడతామని తెలిపారు. ఆగస్టు 5 నుంచి పల్లెల ప్రగతి కోసం గ్రామాల్లో మొదలు పెట్టనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

కరువు భత్యం బకాయిలు
విడుదల చేయాలి



- ఈహెచ్‌ఎస్ స్కీమ్ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించాలి : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి
- పక్షం రోజుల్లో పరిష్కారం : ప్రొ.కోదండరామ్
- ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో పెన్షన్‌దారుల మౌనదీక్ష

నవతెలంగాణ - ముషీరాబాద్

పెన్షనర్లకు కరువు భత్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఈహెచ్‌ఎస్ స్కీమ్ ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింపజేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. పెన్షనర్లకు బకాయి ఉన్న నాలుగు కారుణ్య భత్యాలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈహెచ్‌ఎస్ స్కీంను యూనివర్సిటీ రిటైర్డ్ కాలేజీ టీచర్స్, జీహెచ్‌ఎంసీ, ఎయిడెడ్ పాఠశాలల సిబ్బందికి, మార్కెటింగ్ శాఖల పెన్షనర్లకు కూడా వర్తింపజేయాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మూడు నెలల్లో చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఐఆర్ ఐదు శాతాన్ని కనీసం 20 శాతానికి పెంచాలని, పీఆర్సీ రిపోర్టును వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని కోరారు. ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రభుత్వ పెన్షనర్లకు ప్రభుత్వం ఇన్సెంటివ్ ఇచ్చి గుర్తింపు ఇస్తుందని తెలిపారు. తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్‌ల ఫ్రెండ్లీ ప్రభుత్వమని అన్నారు. కొన్ని అత్యవసర సమస్యల వల్ల పెన్షనర్ల ఇబ్బందులు పరిష్కరించడం ఆలస్యమైందని చెప్పారు. పక్షం రోజుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, సమైక్య కార్పొరేషన్ జాతీయ చైర్మెన్ కృష్ణమోహన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జంగయ్య, డా.సదయ్య, సోమయ్య, అశోక్ కుమార్, నాగిరెడ్డి, డా.జి.నిర్మల, జేఏసీ నాయకులు శుభాకర్‌రావు, కృష్ణమూర్తి, రాజేంద్రబాబు, భరత్ రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులపై నిర్బంధం



- చలో హైదరాబాద్‌కు అనుమతివ్వని పోలీసులు
- అయినా ధర్నా విజయవంతం
- ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 8న రాష్ట్రవ్యాప్త సమ్మె
- ఏడు నెలలుగా వేతనాలివ్వకుంటే ఎలా?
- పర్మినెంట్ చేయాల్సిందే : పాలడుగు భాస్కర్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించింది. సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించతలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినా హైదరాబాద్‌కు వేలాది మంది పంచాయతీ కార్మికులు చేరుకుని ధర్నాను విజయవంతం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కనీస వేతనాలు అమలు చేయాలనీ, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలనీ, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరింది. పంచాయతీ కార్మికుల వేతనాలకు ప్రభుత్వమే ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలనీ, పీఆర్సీ పరిధిలోకి వారిని తేవాలని సూచించింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని విమర్శించారు. ఆరు నుంచి ఏడు నెలలుగా వారికి వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేసిందన్నారు. రూ.150 కోట్లు విడుదల చేసినా కింది స్థాయిలో వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాల్లేక, సకాలంలో రాక వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. కార్మికులందరికీ వేతనాలు సకాలంలో అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 20 నుంచి 30 ఏండ్లుగా పనిచేస్తున్నా పర్మినెంట్‌కు నోచుకోక పర్మినెంట్ కాక ఉద్యోగ భద్రత లేక అభద్రతాభావంతో బతుకుతున్నారని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలనీ, ప్రమాదాల్లో మరణించిన వారికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అనేక జిల్లాల్లో కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే వచ్చేనెల 8న రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవో కార్యాలయాల ముందు ఒక్కరోజు సమ్మెను నిర్వహిస్తామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాడుగా మల్టీపర్పస్ వర్కర్ విధానం ఉందనీ, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 51 జీవోను సవరించాలనీ, పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు. బకాయి ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని చెప్పారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి, ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, కోశాధికారి గడ్డం ఈశ్వర్, రాష్ట్ర ఆఫీసు బేరర్లు తునికి మహేష్, పి వినోద్‌కుమార్, మండల రాజు, పి శ్రీకాంత్, పులి మల్లేషం, నారోజు, రామచందర్, నాయకులు రాపర్తి రాజు, ఆశన్న పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ అడ్డగింతలు..

అర్ధరాత్రి ఆశాలు, జీపీల ముందస్తు అరెస్టులు

నవతెలంగాణ- మొఫిసిల్ యంత్రాంగం



తమ సమస్యల పరిష్కారం కోసం, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ చేపట్టిన చలో హైదరాబాద్‌కు రాకుండా గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. కార్యక్రమాలను భగ్నం చేసేందుకు జిల్లాల్లో వారిని ఎక్కడికక్కడ అడ్డగించి అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. నిజామాబాద్‌లో సోమవారం అర్ధరాత్రి నాయకుల ఇండ్లకు వెళ్లి పోలీసులు నోటీసులు ఇచ్చి.. భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా హౌస్ అరెస్టు చేశారు.

ఖమ్మం జిల్లా వైరాలో ఆశా కార్యకర్తలను అరెస్టు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో అరెస్టు చేసి.. కేసులు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, కొత్తూరు, మంచాల, వికారాబాద్ జిల్లా తాండూర్, యాలాల మండలాల్లో సీఐటీయూ నాయకులు, జీపీ కార్మికులు, ఆశాలను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో వందలాది మంది ఆశాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులను ముందస్తు అరెస్టు చేశారు. వనపర్తి, వీపనగండ్ల మండల కేంద్రాల్లోనూ జీపీలను ముందస్తు అరెస్టు చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఆశాలను ముందస్తు అరెస్టు చేశారు. సీఐటీయూ జిల్లా ముఖ్య నేతలను నిర్బంధించారు. హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామపంచాయతీ కార్యాలయం ముందు జీపీ ఉద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు.

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో పంచాయతీ సిబ్బందిని ముందస్తు అరెస్టు చేశారు.నల్లగొండ జిల్లాలోని వేములపల్లి, చిట్యాల, దేవరకొండలో ఆశాలు, నార్కట్‌పల్లి, నాంపల్లిలో సీఐటీయూ నాయకులను, జీపీ కార్మికులను తెల్లవారుజామునే అరెస్టు చేశారు. సూర్యాపేట జిల్లా.. ఆత్మకూర్, మఠంపల్లి మండలంలో సీఐటీయూ నాయకులు అరెస్టయ్యారు. యాదాద్రిభువనగిరి జిల్లా వ్యాప్తంగా ఆశాలు, గ్రామపంచాయతీ కార్మికులను ముందస్తు అరెస్టు చేశారు. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోనూ అరెస్టులు జరిగాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆశాలు, గ్రామపంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అరెస్టులపై సీఐటీయూ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.నిజామాబాద్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌తోపాటు పలువురు నాయకులకు నోటీసులు అందజేసి సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్న వరకు హౌస్ అరెస్టు చేశారు. కాగా, మున్సిపల్ కార్మికులను, ఆటో డ్రైవర్లను కూడా అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని నిరసిస్తూ ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులను, కార్మికులను ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

నిండుకుండలా శ్రీశైలం

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

శ్రీశైలం జలాశయం 10 గేట్లు ఎత్తి 2.75 లక్షల క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం ఇన్‌ఫ్లో 3.79 లక్షల క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 3.59 లక్షల క్యూసెక్కులుగా ఉంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 883.9 అడుగులకు చేరింది. గరిష్ట నీటినిల్వ 215.8 టీఎంసీలు.. ప్రస్తుత నీటినిల్వ 209.59 టీఎంసీలుగా ఉంది. కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 21,432 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్, ఆల్మట్టి నుంచి భారీగా వరద వస్తుండటంతో జూరాలను దాటి శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా మారింది. దీంతో అధికారులు ముందుగా శ్రీశైలం ఏడు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి సాగర్‌కు నీటిని వదిలారు. సోమవారం మూడు గేట్లను ఎత్తగా, మంగళవారం మరో నాలుగు గేట్లు తెరుచుకున్నాయి.మరో మూడు గేట్లు ఎత్తారు. దీంతో వడివడిగా కృష్ణమ్మ సాగర్‌కు పరవళ్లు తొక్కుతోంది. గేట్లు ఎత్తడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. పోలీసులు, నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నారు. వాహనదారులను ప్రాజెక్టు సమీపానికి వెళ్లకుండా నివారిస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా కూడా నీరు దిగువకు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు 215 టీఎంసీలకు సమానంగా చెప్పొచ్చు. 2023లో శ్రీశైలం పూర్తిస్థాయిలో నిండలేదు. ఈ సారి భారీగా వరద వస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం 882.50అడుగులకు చేరుకున్నది. 201.58 టీఎంసీలు నిల్వ ఉన్నది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ ఆగస్టు 1కి వాయిదా

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున గండ్ర వాదనలు

నవతెలంగాణ -హైదరాబాద్

బీఆర్ఎస్ తరపున గెలిచాక కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులను అనర్హులుగా ప్రకటించాలనే పిటిషన్లపై హైకోర్టు విచారణ ఆగస్టు ఒకటో తేదీకి వాయిదా పడింది. వాళ్లను ఎమ్మెల్యేలుగా కొనసాగించడానికి వీల్లేదనీ, అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేసిన పిటిషన్లపై మంగళవారం వాదనలు జరిగాయి. స్పీకర్ కార్యాలయానికి నోటీసు ఇవ్వొచ్చునని పిటిషనర్ల న్యాయవాది, స్పీకర్ రాజ్యాంగపరంగా అత్యున్నత పదవిలో ఉన్నందున కోర్టులు నోటీసులు జారీ చేయడానికి వీల్లేదని ప్రతివాదులైన కడియం, దానం న్యాయవాదులు వాదించారు. విచారణను వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ విజయసేన్‌రెడ్డి వెల్లడించారు.

కదం తొక్కిన ఆశాలు

(మొదటిపేజీ తరువాయి)



స్తంభించిపోయాయి. ఉదయం 11 గంటలకు మొదట 300 మందికిపైగా ఆశాలు దిల్‌సుఖ్‌నగర్ బస్టాప్ పక్కనున్న కమిషనర్ కార్యాలయం ప్రధాన గేటు నుంచి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు గేటును మూసేయడంతో అక్కడే కూర్చుని ధర్నా చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొద్ది సేపటికి తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి ఆధ్వర్యంలో రెండు వేల మందికి పైగా కార్యకర్తలు మెడికల్ కాలేజి నుంచి ర్యాలీగా తరలి వచ్చారు. దాంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఖంగుతిన్న పోలీసులు అదనపు బలగాలను రప్పించి వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం చుట్టు పక్కల మోహరించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా ధర్నా స్థలికి తరలి వచ్చారు. ప్రధాన రహదారిపై కూర్చుండి తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.18 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలనీ, ఆశా కార్యకర్తల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ మధ్య జీతాలు చెల్లించాలని కోరారు. మధ్యాహ్నం 1.30గంటలకు పోలీసులు ధర్నా చేస్తున్న వారి వద్దకొచ్చి జయలక్ష్మితో పాటు 10 మంది డెలిగేషన్‌ను లోనికి అనుమతించారు. కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులెవరూ అందుబాటులో లేకపోవడం, ఉన్న వారు సరిగా స్పందించకపోవడంతో లోనికెళ్లిన ప్రతినిధి బృందం తిరిగి ప్రధాన గేటు వద్దకొచ్చి లోపలివైపే కూర్చొని ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 1.50 గంటలకు కొంతమంది గేటు పైకిఎక్కి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఒక్కసారిగా కార్యకర్తలు దూసుకొచ్చారు. కొద్ది సేపు పోలీసులకు ఆశాలకు మధ్య తోపులాట జరిగింది. గేటు తోసుకొని 1000 మందికి పైగా కమిషనర్ కార్యాలయంలోనికి వెళ్లారు. ఈ క్రమంలో ఆక్టోపస్ కార్యాలయం ముందున్న గేటును మూసేసిన పోలీసులు వారిని అక్కడే అడ్డుకున్నారు. ఈ లోపు ప్రధాన గేటు వద్దకు అదనపు బలగాలు చేరుకుని గేటు మూసేశాయి. కమిషనర్ కార్యాలయం లోపల గేటు వద్ద కొంత మంది, బయట గేటు వద్ద మరి కొంత మంది ఆందోళన కొనసాగించారు. దాంతో దిగొచ్చిన సర్కార్ కమిషనర్ కర్ణన్‌ను ధర్నా స్థలికి పంపించింది. ఆశాలతో చర్చించిన ఆయన పలు డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆశాలు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నీలాదేవి, కోశాధికారి పి.గంగమణి, ఆఫీస్ బేరర్స్ ఎం.శ్రీలత, ఎం.కొండాలక్ష్మి, పద్మ, వరలక్ష్మి, సునీత, లత, కళావతి, రాష్ట్ర నాయకులు ఎం.మీనా, వెంకటమ్మ, సుశీల, సమ్మక్క, శ్రీవాణి, ఉపేంద్ర, సావిత్రి, ప్రవీణ, బుచ్చమ్మ, బాలమణి, సునీత, రేవతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తీహార్ జైలులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు ఉందని ప్రతిపక్ష ఇండియా బ్లాక్ నేతలు డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో ఇండియా బ్లాక్ పార్టీలు భారీ ఆందోళన నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఎన్సీపీ నేత శరద్ పవార్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ నేతలు ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగోయ్, సీపీఐఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, కేజ్రీవాల్ భార్య సునీత, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, డీఎంకే ఎంపీ తిరుచ్చిశివ, శివసేన నేత సంజయ్ రావత్, టీఎంసీ ఎంపీ సాగరిఘోష్, ఆర్‌జెడి ఎంపీ మనోజ్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించే విస్తృత పోరాటంలో భాగమే కేజ్రీవాల్ విడుదల పోరాటమని అన్నారు. 80 ఏండ్ల వృద్ధుడు స్టాన్ స్వామిని ఎలాంటి ఆధారాలు లేకుండా జైల్లోపెట్టి క్రూరత్వానికి పాల్పడ్డారని విమర్శించారు. నేరం రుజువయ్యే వరకు ఒక వ్యక్తి నిర్దోషి అని చట్టం చెబుతోందని, అయితే, ఈ ప్రభుత్వ హయాంలో నిర్దోషి అని రుజువయ్యేంత వరకు ఒకరు దోషిగా ఉండటమే ఆచారమైందని విమర్శించారు. ఈ పరిస్థితిలో రాజకీయ శతృత్వంతో జైలులో ఉన్న అమాయకులందరినీ విడుదల చేయాలన్న ప్రచారాన్ని మరింత బలోపేతం చేయాలని ఏచూరి పిలుపునిచ్చారు.

గత 22 ఏండ్లుగా మధుమేహంతో బాధపడుతున్న అరవింద్ కేజ్రీవాల్‌కు జైల్లో ఇన్సులిన్ కూడా అందకుండా చేస్తున్నారని కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ అన్నారు. ఆయన తన మధుమేహం స్థితిని తెలుసుకోవడానికి తన చేతికి సెన్సార్‌ను ధరించారని, ఫలితంగా, ఆయన మధుమేహ పరిస్థితిలో అనేక ప్రమాదకరమైన మార్పులు వచ్చాయని అన్నారు. ప్రాణాపాయం లేదని అధికారులు చెప్పడం వింతగా ఉందని సునీత అన్నారు.

కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ కేజ్రీవాల్ భార్య సునీతను "ప్రతిఘటనకు చిహ్నం"గా పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో కాంగ్రెస్ పూర్తి నైతిక మద్దతు ఇచ్చేందుకు తాము వచ్చామని అన్నారు. బీజేపీ దురుద్దేశం తప్ప మరొకటి లేదని ఆయన ఆరోపించారు.

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ ముగ్గురు సీనియర్ ఆప్ నేతలు కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లను "కుట్రలో భాగంగా" జైలులో పెట్టారని అన్నారు. ఢిల్లీ ప్రభుత్వ పనిని కేంద్రం అడ్డుకుంటోందని, రాజేందర్ నగర్ కోచింగ్ సెంటర్‌లో మరణాలతో సహా దేశ రాజధానిలో పరిస్థితికి బీజేపీదే బాధ్యతని ఆయన విమర్శించారు. కుట్రలో భాగంగా ఆప్‌ను అంతం చేయాలని, ఢిల్లీ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని బీజేపీ యత్నిస్తుందని అన్నారు.
సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత, ప్రజాస్వామ్యం ప్రజల కోసం కాకుండా పోయిందని విమర్శించారు. "మోడీ ప్రభుత్వం ఉపయోగించే కేంద్ర సంస్థల బాధితుల్లో కేజ్రీవాల్ ఒకరు. దీనిని మనం అనుమతించగలమా? దేశంలో ఈ పరిస్థితిని ఇంకా ఎంతకాలం తట్టుకోగలం.

కేజ్రీవాల్ ఆరోగ్యం బాగాలేదు. ఆయన ఆరోగ్యం క్షీణించింది" అని ఆయన అన్నారు. ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ మాట్లాడుతూ కేజ్రీవాల్ షుగర్ లెవల్స్ అదుపులో పడిపోతున్నాయని అన్నారు. "ఆయనకి ట్రయల్ కోర్టు, సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే ఆయన్ని జైలులో ఉంచడానికి కుట్ర జరిగింది. ప్రతిపక్ష నాయకులను ఎందుకు జైల్లో పెట్టాలని బీజేపీ కోరుకుంటుంది?" రాయ్ ప్రశ్నించారు.

కేజ్రీవాల్‌ను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ, ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను లాక్కుందని అన్నారు. వారికి హక్కులు కావాలని, బాధ్యత వహించాల్సి వచ్చినప్పుడు పారిపోతుందని ఎద్దేవా చేశారు.

ప్రజావాణికి 455 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 455 దరఖాస్తులు అందాయి. రెవెన్యూపరమైన సమస్యలకు సంబంధించి 94 , పౌరసరఫరాల శాఖకు సంబంధించి 77, విద్యుత్ శాఖకు సంబంధించి 45, హౌజింగ్‌కు సంబంధించి 44 దరఖాస్తులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 40, ఇతర శాఖలకు సంబంధించి 155 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోస్టర్ ఆవిష్కరణ


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ డే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఆ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, ప్రజ్వల ఫౌండేషన్ నిర్వహకురాలు సునీతా కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి కేజీబీవీ కాంట్రాక్టు టీచర్ల యత్నం

- ముఖ్యమంత్రి మాటిచ్చి మరిచారని ఆవేదన
- ఎక్కడికక్కడ అరెస్టులు చేసిన పోలీసులు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల టీచర్లు మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఖమ్మం, సూర్యాపేట, నారాయణపేట, మహబూబ్‌నగర్ రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి వచ్చిన వారు అసెంబ్లీ ముట్టడికి బయల్దేరగా.. నగరంలో ఎక్కడికక్కడ పోలీసలు అరెస్టు చేశారు. అనంతరం వారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. దాదాపు 150 మంది ఉద్యోగులను ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన కాంట్రాక్ట్ టీచర్ మహేశ్వరి మాట్లాడుతూ.. "మీ సమస్య చాలా చిన్న సమస్య. మేము అధికారంలోకి వచ్చాక ఒక చాయ్ తాగినంత సమయంలో మీ పని చేస్తాం" అని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఇచ్చారన్నారు. కానీ ఆ తర్వాత తమను మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 సంవత్సరాలుగా కేజీబీవీలో తాము పని చేస్తున్నామని, పని గంటలు ఎక్కువ.. చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నామని చెప్పారు. తమను సీనియారిటీ ప్రకారం రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు.

గద్వాల ఎమ్మెల్యే బ్యాక్ టు బీఆర్ఎస్..

- అసెంబ్లీ లాబీల్లో మాజీ మంత్రి కేటీఆర్‌తో భేటీ
- ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో చర్చలు
- సలహాల కోసమే కలిశానంటూ వివరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొద్ది రోజుల క్రితం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి గులాబీ గూటికి చేరారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ అయ్యారు. అభివృద్ధి కోసమే తాను అధికార పార్టీలో చేరుతున్నట్టు గతంలో ప్రకటించిన ఆయన... కొద్ది రోజుల్లోనే సొంతగూటికి చేరుకోవటం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

కృష్ణమోహన్‌రెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల నుంచి పోటీ చేసి, సిట్టింగ్ ఎమ్మెల్యే డీకే అరుణను ఓడించారు. అయితే ఆయన ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్‌ను సమర్పించారంటూ డీకే అరుణ హైకోర్టుకెళ్లారు. దీంతో ఆయన ఎన్నిక చెల్లదంటూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ క్రమంలో కృష్ణమోహన్‌రెడ్డి సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చు కున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గద్వాల నుంచే పోటీ చేసి గెలుపొందారు. కానీ ఈసారి బీఆర్ఎస్ కాకుండా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో అభివృద్ధి కోసమంటూ బండ్ల హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

ఈ క్రమంలో మొన్నటి ఎన్నికల్లో ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి సరిత... బండ్ల రాకను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమె తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద ధర్నా చేసిన సంగతి విదితమే. దీంతో ఆమెతో సీఎం రేవంత్ చర్చలు జరిపారు. రాజకీయ భవితవ్యంపై ఆయన హామీ ఇవ్వటంతో ఆమె సైలెంటయ్యారు. కానీ అంతకుముందే ఆమె కృష్ణమోహన్‌రెడ్డిపై కోర్టులో కేసు వేశారు. తప్పుడు అఫిడవిట్ సమర్పించిన ఆయనపై అనర్హత వేటేయాలంటూ కోరారు.

ఈ విషయంలో కాంగ్రెస్ పెద్దలు నచ్చజెప్పినా ఆమె వెనక్కి తగ్గలేదు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలంటూ డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును సైతం ఆశ్రయి స్తామంటూ చెబుతోంది. ఈ క్రమంలో తనపై కోర్టు అనర్హత వేటేస్తే ఎలా..? అదే జరిగి ఉప ఎన్నికొస్తే అప్పుడు ఖర్చు భరించటం మరింత కష్టమనే పద్ధతుల్లో బండ్ల ఆలోచించినట్టు సమాచారం. ఆయన బాటలోనే గూడెం మహిపాల్‌రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలె యాదయ్య తదితరులు ఉన్నట్టు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.

కాగా తనపై డీకే అరుణ కోర్టులో కేసు వేసినప్పుడు బీఆర్ఎస్ లీగల్ అడ్వైజర్ రాంచందర్... సుప్రీంకోర్టులో కేసు వాదించి, స్టే తెచ్చారని కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. అయితే ఇటీవల తాను కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో తన కేసు నుంచి రాంచందర్‌ను తప్పించారని చెప్పారు. అందువల్ల ఈ విషయంలో సహాయం చేయాలనీ, తన లీగల్ అడ్వైజర్‌గా ఆయన్నే కొనసాగించాలని కోరేందుకే కేసీఆర్, కేటీఆర్‌తో భేటీ అయినట్టు బండ్ల వివరించారు. అంతేతప్ప తాను పార్టీ మారబోవటం లేదంటూ ఆయన వివరణివ్వటం గమనార్హం.

పార్టీ మారటం లేదు : తెల్లం

తాను కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు వచ్చిన వార్తలను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఖండించారు. తాను పార్టీని వీడటం లేదనీ, కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. కాలె యాదయ్య సైతం అధికార పార్టీలోనే కొనసాగుతానని వెల్లడించారు.

నూతన కళ్యాణ మండపం ప్రారంభం



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధి సచివాలయం నగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో నూతన కళ్యాణ మండపాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ మండప కార్యక్రమానికి మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదెంద్ర తీర్థ పాదుల స్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆలయం గురువు లక్ష్మీ నారాయణ, గోరక్షక్ యాదగిరి రావు, వైదేహి నగర్ కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, నాయకులు లీలా నాథ్, జైపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సంగమేశ్వర్, పవన్ రెడ్డి, దుర్గాప్రసాద్, వినయ్ కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మహిళా గ్రూపు సంఘాల (టి.ఎల్.ఎఫ్) వారితో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఇందిర మహిళ శక్తి క్యాంటీన్ ఏర్పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి బ్యాంక్ రుణాలు వాటి టార్గెట్ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 27వ డివిజన్‌లో గల ఎంవీఎస్ఆర్ కాలేజీ నుండి కమ్మగూడ వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ తోట శ్రీధర్ రెడ్డితో కలసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కోట్లాది రూపాయల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించి.. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన, డీఈఈఈ జ్యోతి రెడ్డి, నాయకులు పేతుళ్ళ ఆనంద్ రెడ్డి, బంగారి అశోక్, శివ రెడ్డి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్స్‌ను సందర్శించిన ముషారఫ్ ఫరూఖీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్షేత్ర స్థాయి తనిఖీల్లో భాగంగా మంగళవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వివిధ సబ్ స్టేషన్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా తీరు తెన్నులను, ఫీడర్ సర్వే వంటి విషయాలను పరిశీలించి, శంషాబాద్ పట్టణంలో ధర్మ సాయి సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్స్‌ను ప్రారంభించారు. ఈ పర్యటనలో రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజినీర్ పి.ఆనంద్, సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎల్.గోపయ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో చెత్త కనపడకుండా చర్యలు తీసుకోవాలి

- కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో ఎక్కడ కూడా చెత్త కనపడకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె అడిషనల్, జోనల్ కమిషనర్‌లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్, స్వచ్ఛ ఆటో హాజరు శాతం మెరుగు పడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సహాయ వైద్యాధికారులతో పాటుగా సంబంధిత డిప్యూటీ కమిషనర్లు కూడా ఉదయం 6 గంటలకు తప్పని సరిగా విధులకు హాజరు కావాలని కమిషనర్ ఆదేశించారు. చెత్త, గ్రీన్ వెస్ట్, (సీ అండ్ డీ) భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాల్సిన బాధ్యత డీసీలు, సహాయ వైద్యాధికారులేనని కమిషనర్ అన్నారు. జోనల్ కమిషనర్లు కూడా ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ కోరారు. సీఆర్ఎంపీ రోడ్లపైన పాట్ హోల్స్, రోడ్డు మరమ్మత్తులు, రోడ్డుపై మార్కింగ్ లైనింగ్, ఫుట్‌పాత్ మీడియంలో నాటిన మొక్కలు నాటేందుకు సంబంధించిన ఇంకా ఏజెన్సీ నిర్వాహకులు ద్వారా గ్యాప్‌లు ఉన్న పక్షంలో పూర్తి చేయించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించాలి



- ప్రధానోపాధ్యాయులు మల్యాల యాదగిరి

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

లక్ష్యసాధన, అంకిత భావంతో సాధన చేస్తే విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తారని బాటసింగారం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు మల్యాల యాదగిరి అన్నారు. ఇటీవల సరూర్ నగర్‌లోని అథ్లెటిక్ జావలింగ్ త్రోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మల్యాల యాదగిరి మాట్లాడుతూ ఈనెల 29న రంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సరూర్ నగర్ ప్రధాన అథ్లెటిక్ స్టేడియంలో జిల్లా స్థాయి జావలింగ్ త్రో 16 సంవత్సరాల బాలుర క్రీడా పోటీల్లో బాటసింగారానికి చెందిన 10వ తరగతి విద్యార్థి రాజేష్ ఉత్తమ ప్రతిభ కనబర్చి, బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. అలాగే వచ్చే నెల 7వ తేదీన జరిగే మూడవ రాష్ట్ర స్థాయి జావలింగ్ డే సెలబ్రేషన్స్‌కు ఎంపికయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థికి పాఠశాల అమ్మ ఆదర్శ చైర్మెన్, ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలియజేశారు.

ఆశాల అక్రమ అరెస్ట్‌ను ఖండించిన సీఐటీయూ



నవతెలంగాణ-హయత్ నగర్

ఆశాలను అక్రమ అరెస్టు చేసి, హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో పెట్టడాన్ని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఆశా వర్కర్లు హైదరాబాదులోని కోటి ఆఫీస్ దగ్గరికి వందలాదిగా చేరుకొని మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో ఆశాలు చేపట్టిన ధర్నాను విఫలం చేయడం కోసం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడికక్కడ పోలీసుల ద్వారా వారిని అరెస్టు చేయించి ఉద్యమాన్ని అణచాలని చూశారన్నారు. అబ్దుల్లాపూర్మెట్ మండలంలో ఆశాలను ధర్నాకు పోకుండా తెల్లవారుజామునుండే వారి ఇండ్ల దగ్గరకు వెళ్లి.. ఆశాలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న ఈ ప్రభుత్వాల నిరంకుశత్వం నశించాలని అన్నారు. అరచేతిని అడ్డుపెట్టి ఉద్యమాలను ఆపలేరని, ఎన్ని అరెస్టులు చేసినా, ఎన్ని నిర్బంధాలు పెట్టిన ధర్నాలు విజయవంతంగా నిర్వహించామ న్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ఉద్యమాల్ని మరింత ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో రమ్య, లావణ్య, సుందరి, రాజేశ్వరి, సంతోష, వనజ, జ్యోతి, అనిత తదితరులు ఉన్నారు.

ఘనంగా చైర్మెన్ కరుణాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - చంపాపేట్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ దుర్గా నగర్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రంగారెడ్డి జిల్లా కబడ్డీ చైర్మెన్ మద్ది కరుణాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం మహేశ్వరం మండలం తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది సురేఖ కరుణాకర్ రెడ్డి, చంపాపేట్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి. గోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. తర్వాత కేక్ కట్ చేయించి..ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాషా, సీతా రామరెడ్డి, వెంకట చారి, చైతన్య రెడ్డి, భాస్కర్, ఊరుకొండ రమాదేవి, దీపక్, బి. బాలకృష్ణ, శంకర్ యాదవ్, దయాకర్, ధనరాజ్ గౌడ్, మధురా నగర్ అధ్యక్షులు హనుమంత రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, చంద్రు నాయక్, మహిళ నాయకురాండ్లు సరిత, యాదమ్మ అనిత తదితరులు పాల్గొన్నారు.

'జీఐఎస్ సర్వేకు సహకరించాలి'



నవతెలంగాణ - హయత్‌నగర్

జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న జీఐఎస్ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని డిప్యూటీ కమిషనర్ యాదయ్య అన్నారు. స్మార్ట్ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ మహానగర పాలకసంస్థ నిర్వహించబోయే జీఐఎస్ సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ యాదయ్య ఆధ్వర్యంలో మంగళవారం హయత్ నగర్ వార్డు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ జీఐఎస్ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని, ఈ సర్వే ఆధారంగానే ప్రజలందరీ వివరాలను, జీహెచ్ఎంసీ రూపొందించిన యాప్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. కావున సర్వే సమయంలో జీహెచ్ఎంసీ సిబ్బందికి తగిన సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మహేందర్, బలరాం, బిల్ కలెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తా

- కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

నవతెలంగాణ-హయత్ నగర్

కాలనీలలోని సమస్యలను దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తానని కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని శివం హిల్స్ చౌరస్తా నుండి అనుసంధానంగా ఉన్న శ్రీ దుర్గా నగర్ కాలనీ, ప్రగతి నగర్ కాలనీ, ప్రియదర్శిని కాలనీ నుండి కుంట్లూరు రోడ్డు వరకు రద్దీగా ఉండే ప్రధానమైన రోడ్డు నిర్మాణ పనులను



రూ.21.30 లక్షల వ్యయంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ సంవత్సరం క్రితం కనీసం పిల్లల స్కూల్ వ్యాన్ వెళ్లేందుకు ఇబ్బందికరంగా రోడ్డు మధ్యలో ఉన్న ట్రాన్స్ఫార్మర్‌ని తొలగించామన్నారు. గతంలో ఉన్న నాయకులు ఈ రోడ్డు వలన ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురైన పట్టించుకోలేదన్నారు. డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణగుప్తా, నరసింహారెడ్డి, శ్రావణ్ కుమార్, ఆనంద్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాధాకృష్ణ, నరేష్ రెడ్డి, ఆనంద్ యాదవ్, వివిధ కాలనీ సంక్షేమ సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం : అర్జున్



నవతెలంగాణ- బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యార్థులకు క్రీడలతోనే మానసిక ఉల్లాసంతో పాటు వినోదం, ధైర్యం కలుగుతుందని బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోరని అర్జున్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో కఠోర సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ నెల 29న రంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సరూర్నగర్ ప్రధాన అథ్లెటిక్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి మూడవ రంగారెడ్డి జిల్లా జావలిండే సెలబ్రేషన్, 100 మీటర్లు 400 మీటర్ల జిల్లా స్థాయి ఎంపికలో జెడ్ పి హెచ్ ఎస్ బడంగ్‌పేటకు చెందిన ఓ విద్యార్థిని మంచి ప్రతిభ కనపర్చారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.భాగ్యశ్రీ 100 మీటర్ల పరుగులో, జావలిన్త్రోలో 16 సంవత్సరాల బాలికల విభాగం తృతీయ స్థానం సాధించారని తెలిపారు. వచ్చేనెల 7వ తేదీన జరిగే మూడవ రాష్ట్రస్థాయి జావలిండే సెలబ్రేషన్ ఎంపికయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లీదండ్రులు తదితరులు అభినందించారు.

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ నార్త్ ఎక్స్ టెన్షన్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా అని కార్పొరేటర్ సుజాతా నాయక్ అన్నారు. కాలనీ నూతన సంక్షేమ సంఘ సభ్యులు మంగళవారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ పర్వత్ కుమార్ యాదవ్, కోశాధికారి కొండల్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, భరత్ రెడ్డి, తులసి రామ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లు బహుకరుణ



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

కొలిన్స్ ఎరోస్పేస్ వారి సహకారంతో యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మూడు (3) అధునాతన కంప్యూటర్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ చార్టర్ మేనేజర్ అరవింద్ మాట్లాడుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్ పూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 5 లక్షల విలువైన మూడు అధునాతన కంప్యూటర్లను బహుకరించినట్లు తెలిపారు. విద్యార్థుల యొక్క భవిష్యత్‌కు సంబంధించిన వివరాలు, పాఠశాల పాలన వ్యవహారాలను కంప్యూటర్లలో పొందుపరచుకోవచ్చని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కొలిన్స్ ఎరోస్పేస్ సంస్థ, యూత్ ఫర్ సేనా సంఘం నాయకులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలకు ఇలాంటి ప్రోత్సహకాలను అందిస్తే..విద్యార్థులు విద్యా రంగంలో మరింత రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. యూత్ ఫర్ సేవా, కొలిన్స్ ఏరోస్పేస్ సంస్థకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్ణ, శ్వేత, నవీన్, లక్ష్మీకాంత్ రెడ్డి, రమేష్, కృష్ణ, శ్రీహరి, మహేష్ , శ్రీనివాస్, వెంకటేష్, సబితా, శ్రీనివాస్ నాయక్, విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఫలారం బండ్ల ఊరేగింపు



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ పరిధిలోని జిల్లెలగూడ జై భవాని యూత్ అసోసియేషన్, స్థానిక కార్పొరేటర్ గజ్జల రాంచందర్ ఆధ్వర్యంలో బోనాల పండుగ సందర్భంగా ఘనంగా ఫలారం బండి ఊరేగింపును మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మీర్‌పేట్ మాజీ సర్పంచ్ పల్లె పాండ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ పోరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సిద్దాల బాలప్ప తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 39వ డివిజన్ పరిధిలోని జిల్లెలగూడ నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల పండుగ ఉత్సవాల్లో భాగంగా ఫలారం బండి ఊరేగింపును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కార్పొరేటర్ మదారి సురేఖ రమేష్, బీఆర్ఎస్ నాయకులు గడ్డమీది లక్ష్మణ్, గిల్లా విజయ్, కమిటీ సభ్యులు, వివిధ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చంపాపేట్



మలక్‌పేట్, యాకుత్‌పురా నియోజకవర్గం సైదాబాద్ కుర్మాగూడ సంతోష్ నగర్ ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో జరిగిన బోనాల ఉత్సవాల్లో భాగంగా శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహంకాళి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొత్త కాపు అరుణా రవీందర్ రెడ్డి నల్లపోచమ్మ, దుర్గమ్మ, భూలక్ష్మమ్మ ఆలయా ల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఫల హారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా సంరెడ్డి సురేందర్ రెడ్డి, వీరేందర్ యాదవ్, చిక్కోటి ప్రవీణ్, ఏవిఎస్ రెడ్డి, శ్వేత మధుకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ హైదరాబాద్ చైర్మెన్ జి.సుభాష్ చంద్ర, మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి రామ్ కుమార్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ చందర్ పాల్గొన్నారు.

ఆగస్టు 2 నుంచి గీతన్నల చైతన్య యాత్ర

- కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి సందర్భంగా ఆగస్టు 2 నుండి 18వ తేదీ వరకు గీతన్నల చైతన్య యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు అందుకు సంబంధించిన గోడ పత్రికను మంగవారం అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు నిర్వహించి అమరుల త్యాగాలను, కల్లు గీత కార్మికులు వృత్తిలో ఉపాధి, ప్రత్యామ్నాయ మార్గాలు తదితర అంశాలను ప్రచారం చేస్తూ చైతన్యం చేస్తామని అన్నారు. అలాగే సర్దార్ సర్వాయి పాపన్న చేసిన సేవలను అందరికీ వివరిస్తామని తెలిపారు. 21 ఏండ్లుగా ఈ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ యాత్ర ఆగస్టు 2న కిలాషాపూర్ లో ప్రారంభమై 18న గోల్కొండ కోటలో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీశైలం, వర్గాల బాలరాజు, ముత్యాలు, గడ్డం సత్యనారాయణ, పాండాల కృష్ణయ్య, మందుల కృష్ణయ్య, ఎరుకల కృష్ణ, లింగయ్య, శ్రీను, రాములు పాల్గొన్నారు.

వాడ వాడకు సీసీ రోడ్ల నిర్మాణం : మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల్లో వాడ వాడలో సీసీ రోడ్లను నిర్మిస్తున్నామని మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని యమ్నంపేటలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మురుగు కాల్వలు, రోడ్ల నిర్మాణం, తాగునీటి ఏర్పాట్లకు పెద్ద పీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, నాయకులు కాశయ్య, రామకృష్ణాచారి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగ నాయకుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.20 వేల చెక్కు అందజేత



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్‌రావు డివిజన్‌కు చెందిన నవీన్, పూజిత అనే విద్యార్థులు నేత్ర విద్యాలయ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. వారిద్దరికీ కంటి చూపు లేకపోవడంతో కుషాయిగూడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.20 వేల చెక్కును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఏఎస్‌రావునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఇలాంటి మంచి పనులు చేస్తున్న లయన్స్ క్లబ్ కుషాయిగూడ వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రవి శంకర్ రాజు, తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి
- ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా పూర్వ అధ్యక్షుడు ఎస్. శంకర్ రావు



నవతెలంగాణ-కాప్రా

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా పూర్వ అధ్యక్షుడు ఎస్. శంకర్ రావులు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రజాస్వామ్యయుతంగా హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మంగళవారం తలపెట్టిన ధర్నాకు వెళ్తున్న ఏఐటీయూసీ నాయకులను కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికం అన్నారు. అక్రమ అరెస్టులతో మున్సిపల్ కార్మికుల పోరాటాన్ని అణిచివేయటం అసాధ్యమని హెచ్చరించారు. మంగళవారం ఈసీఐఎల్ పరిధిలో పోలీసులు ఏఐటీయూసీ అనుబంధ కార్మికులను, ఏఐటీయూసీ కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలును అక్రమంగా అరెస్టు చేయడంతో వారిని దామోదర్ రెడ్డి, శంకర్రావు, ధర్మేంద్ర పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులు సిగ్గు చేటన్నారు. రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని గతంలో పలుసార్లు సమ్మెలు నిర్వహించినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కార్మికుల న్యాయమైన డిమాండ్లు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానం తీసుకొచ్చి ఒకే కార్మికుడికి అనేక రకాల పనులు అప్పగించి పని భారం పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు చెప్పిన రూ.26,400 వేతనం ఎందుకు అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. వేతనాలు పెంచక, ఉద్యోగం రెగ్యులర్ లేకపోవడంతో కార్మికులు నానా రకాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే మున్సిపల్ కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో కుషాయిగూడ పీఎస్‌లో మిరియాల సాయిలు, నాచారం పీఎస్‌లో యాకస్వామి, జంగయ్య, సోమయ్య, కృష్ణ, ఎల్లయ్య ఉన్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. ధర్మేంద్ర, నేతలు శంకర్, నదీమ్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



- సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కమిటీ నాయకులు బంగారు నర్సింగరావు

నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కమిటీ నాయకులు బంగారు నర్సింగరావు అన్నారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఆశా వర్కర్ల యూనియన్, సీఐటీయూ యూనియన్ల ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పోలీసుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆశ వర్కర్ల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఉదయం 4 గంటల నుంచి ముందస్తు అరెస్టులకు పూనుకుందన్నారు. ప్రభుత్వ నిర్బంధం, అక్రమ అరెస్టులతో ఆందోళనలు ఆపలేరని తెలిపారు. ఆశా వర్కర్స్ పై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రకటిస్తే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వాగ్దానాలను విస్మరించడం సరైంది కాదన్నారు. 'ఏరు దాటే వరకు ఓడ మల్లయ్య అని, ఏరు దాటాక బోడ మల్లయ్య' అను చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు రూ.18వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే మున్సిపల్, పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించేందుకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత, మరో 120 మంది ఆశా వర్కర్స్ ఉన్నారు.

సఫాయి కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే నగరం బాగుంటుంది : మేయర్ జక్క



నవతెలంగాణ-బోడుప్పల్

సఫాయి కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే నగరం బాగుంటుందని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ్ సర్వేక్షన్ 2024 'సఫాయి అప్నావో, బిమారీ భగావో' కార్యక్రమంలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్మికులకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ కొల్తూరి మహేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ, మధుమేహం, మూత్రం, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి ఆరోగ్య సమస్యలు ఏర్పడకుండా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిశేశ్వర్ రావు, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మురళి, డాక్టర్ ప్రతిభ, కుమార్, అనురాధ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి : సీపీఐ



నవతెలంగాణ-కాప్రా

ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పాలకులు కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఉప్పల్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో కె. ధర్మేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు గడుస్తున్నా నేటికీ ఆర్థిక అసమానతలు ఉన్నాయని, పేదవాడు మరింత పేదవాడిగా, సంపన్నుడు మరింత సంపన్నుడిగా మారుతున్నారన్నారు. దేశ పౌరులందరికీ ఆహారం, దుస్తులు, ఇల్లు ముఖ్యమైనవని తెలిపారు. కానీ దేశంలో ఎంతమందికి ఇవన్నీ ఉన్నాయో దేశ, రాష్ట్ర పాలకులు స్పష్టం చేయగలరా అని ప్రశ్నించారు.? దేశం అభివృద్ధి చెందడమంటే ప్రజల జీవన ప్రమాణాలు పెరగడమేనని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో కొంత జాప్యం జరుగుతోందని, దీనిని అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కేవలం ఆ పార్టీ కార్యకర్తలకే ఇవ్వడంతో ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, ఉప్పల్ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, బషీర్, రాజేందర్, టి.సత్యప్రసాద్, సతీష్ కుమార్, కృపాకర్, జాన్, స్వామిదాస్, నర్సింగరావు, భిక్షపతి, మిరియాల సాయిలు, రజిని, గిరి బాబు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై ప్రయాణికులకు అవగాహన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరేడ్‌మెట్ చౌరస్తాలోని బస్టాప్ వద్ద మంగళవారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడున్న ప్రయాణికులకు, సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, నివారణ పై అవగాహన కల్పించారు.



లైయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబు రావు జన్మదినం సందర్భంగా లైయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, మీర్‌పేట్ ఆధ్వర్యంలో ఎమ్మెస్ రెడ్డి 'ఐ' హాస్పిటల్‌లో 1000 మందికి భోజనం పంపిణీ చేశారు.
-నవతెలంగాణ, కాప్రా

పిల్లలకు మెరుగైన విద్యను అందించాలి



- డిప్యూటీ కలెక్టర్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ - జవహర్‌నగర్

పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని మేడ్చల్ జిల్లా డిప్యూటీ కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి, కాప్రా మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని అంగన్ వాడీ స్కూల్స్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో, ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందించడంతో పాటు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఆరోగ్య సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, టీచర్లు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాసుల పంపిణీ



నవతెలంగాణ-కీసర

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌లను అందించడం అభినందనీయమని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బీజేపీ నాయకులు తడిసిన సూర్య శేఖర్ రెడ్డి, మామిడి జంగారెడ్డి, జూపల్లి నరేష్, పోతంషెట్టి వెంకటేశ్వర్లు, కర్ర వెంకటేశ్వర్ పటేల్, మలిరెడ్డి సతీష్ రెడ్డి, గంధ్ర కమలాకర్, వల్లాల శ్రీనివాస్ సురేందర్ రెడ్డి, వాసిరెడ్డి నాగమల్లేశ్వర్ ఆధ్వర్యంలో 300మంది విద్యార్థులకు ఉచిత బస్ పాసుల పంపిణీ కార్యక్రమానికి చెర్మెన్ చంద్రారెడ్డి హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని గొప్ప వ్యక్తులుగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు వేణుగోపాల్ , కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, సురేష్ , వినయ్ రెడ్డి, రమేశ్, శ్రీకాంత్ , వెంకటచారి, రమణాచారి, సురేందర్ గౌడ్, డిపో మేనేజర్ కవిత, వెంకటేష్ , రామరాజు, చక్రపాణి, స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం వనజరామి రెడ్డి, పాండురంగారెడ్డి ఉన్నారు.

ముందస్తు అరెస్టులు హేయం



- సీఐటీయూ మండల కార్యదర్శి కిష్టప్ప

నవ తెలంగాణ-శామీర్ పేట

ఆశావర్కర్లు చలో కమిషనరేట్‌కు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం ఖండిస్తున్నామని సీఐటీయూ మండల కార్యదర్శి కిష్టప్ప అన్నారు. సీఐటీయూ పిలుపు మేరకు మంగళవారం చలో కమిషనరేట్‌కు వెళ్తున్న సీఐటీయూ కార్యదర్శి కిష్టప్పను, ఆశా వర్కర్లను శామీర్ పేట పోలీసులు ముందస్తు అరెస్టు చేసి శామీర్ పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కిష్టప్ప మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు కమిషనరేట్‌కు వెళ్లకుండా శామీర్‌పేట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో లలిత, కవిత, మంజుల, జ్యోతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

మంచి నీటి సరఫరాను పెంచండి : మేయర్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీటి సరఫరా ను ఇంకా పెంచాలని జలమండలి సీజీఎం అమరేందర్ రెడ్డిని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కోరారు. బోడుప్పల్‌లో నీటి సమస్యకు పరిష్కారం చూపాలని జలమండలి కార్యాలయంలో సీజీఎంను కలిశారు. మంచి నీటి పైప్ లైన్ పనులకు కావాల్సిన మరమ్మతులు చేపట్టాలన్నారు. సానుకూలంగా స్పందించిన సీజీఎం త్వరలోనే జలమండలి అధికారులతో నివేదిక తీసుకుని అవసరమైన మేరకు నీటి సరఫరాను అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఎగైనెస్ట్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ రోజును పురస్కరించుకుని (ఐజేఎం) ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఆధ్వర్యంలో ఆశ్రయ ఆర్గనైజేషన్ ద్వారా పాఠశాల విద్యార్థులకు, రోజు వారి కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్ఐ సాంబయ్య మాట్లాడుతూ.. హ్యూమన్ ట్రాఫికింగ్‌పై పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆశ్రయ ఆర్గనైజేషన్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ జీవన్ మాట్లాడుతూ.. వరల్డ్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ప్రత్యేకతను వలస కూలీలకు ఆశ్రయ్ ఆర్గనైజేషన్ అవలంభిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆజా మోహినుద్దీన్, ఉపాధ్యాయులు రాజేందర్, ఉషారాణి, సౌజన్య, మల్లికార్జునరావు, ఆశ్రయ్ ఆర్గనైజేషన్ ఫీల్డ్ ఆఫీసర్ కాంతయ్య, స్వప్న, అరుణ, జ్యోతి, పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ స్కూల్‌లో 'శిక్ష సప్తహ్' కార్యక్రమం



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడు రోజులుగా 'శిక్ష సప్తహ్' కార్యక్రమం జరుగుతోంది. అందులో భాగంగా మంగళవారం స్థానిక నాయకులను, సామాజిక వ్యక్తులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి పాఠశాలలోని విద్యార్థులకు సామాజిక అంశాలపైన అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పౌష్టికమైన ఆహారం, తిథి భోజనాలలు ఏర్పాటు చేశారు. ఈ శిక్ష సప్తహ్ కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి రెడ్డి, ఉపాధ్యాయులు రమాదేవి, మెహర్ వలీ, లక్ష్మణ్, సంగీత, వెంకట్ రాజ్, సంగీత, కృష్ణపాల్, మురళీమోహన్, మాధవి, రామకృష్ణ, సామాజిక వ్యక్తులు చింతల మాణిక్య రెడ్డి, సురేందర్‌రెడ్డి, తూప్రాన్ లక్ష్మణ్, ఆంటోనీ రవి కిరణ్, అజిత్ సాయి, శంకర్, రామ్ సింగ్, ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో రైతులందరికీ రుణమాఫీని అమలు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి కండిషన్లు పెట్టకుండా రుణమాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొంతమంది రైతులకు మాత్రమే రుణమాఫీ ఇస్తుందని, సన్న, చిన్నకారు రైతులకు రుణమాఫీ చేయకుండా అధికారులు షరతులు విధించడం సమంజసం కాదన్నారు. రైతులందరికీ న్యాయం జరిగే వరకు బీజేపీ పక్షన పోరాటం చేస్తామన్నారు.

చెరువులు కబ్జా చేస్తే కఠిన చర్యలు

- బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను పూర్తి స్థాయిలో పరిరక్షించాలని నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. మంగళవారం బోడుప్పల్ నగర పరిధిలోని అలాస్‌కుంట, చింతల చెరువు ప్రాంతాలను బోడుప్పల్ కమిషనర్ రామలింగం, ఇరిగేషన్ ఏఈ పరమేష్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోజు రోజుకు చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని, నగర పరిధిలో ఉన్న చెరువులకు హద్దులు నిర్ధారించి వాటిని పూర్తి స్థాయిలో కాపాడేందుకు అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. చెరువులను ఎవరైనా కబ్జా చేస్తే కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,నాయకులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ హర్షణీయం

- రైతును రాజుగా చూడడమే కాంగ్రెస్ లక్ష్యం
- నేరేడ్‌మెట్ డివిజన్ నాయకులు కే.చెన్నారెడ్డి



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తుండడం హర్షనీయమని నేరేడ్ మెట్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు కే.చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రైతును రాజుగా చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశమన్నారు. రైతుల రుణమాఫీ చేస్తుండడంతో సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. మొదటి విడత లక్ష, రెండో విడతను లక్షన్నర, ఆగస్టులో లక్షలన్నర నుంచి రెండు లక్షల రుణాలు మాఫీ చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. రుణాలు తీసుకున్న ప్రతి రైతుకు రుణవిముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని దీమా వ్యక్తం చేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్‌కు వినతి



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చర్లపల్లి, కరీంగూడ నుంచి వచ్చే విద్యార్థులకు పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని చెంగి చెర్ల డిపో మేనేజర్ కవితను రాంపల్లి యూత్ నాయకులు బందెల పరమేష్, కోట్ల సుభాష్ గౌడ్ కలిసి వినతి పత్రం అందజేశారు. రాంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉన్నందున పాఠశాల సమయాల్లో బస్సులు లేక విద్యార్థులు నడుచుకుంటూ వస్తున్నారని డిపో మేనేజర్‌కు వివరించారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ సరైన సమయానికి బస్సు నడిపిస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధిలో కార్పొరేషన్‌ను ముందుకు తీసుకెళ్తాం



- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ గుప్తా
- రూ.5 లక్షల జనరల్ నిధులతో డ్రయినేజీ పనులు ప్రారంభం

నవ తెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకేళ్తామని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా, అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని ఏడవ డివిజన్ లో అయిదు లక్షల రూపాయల జనరల్ నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్ మెట్టు ఆశ కుమారి తో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాసరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మెట్టు వెంకన్న, కాలనీవాసులు వాసర్ల సోమరాజు, పార్థసారథి, వాసర్ల పరుశరాములు, ఆంజనేయులు, కృష్ణ, యాదగిరి, లక్ష్మి, స్రవంతి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి : దుబ్బకోటి ఆంజనేయులు





నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని శ్రీరంగవరం, బండమాధారం గ్రామాల్లోని ప్రభుత్వ భూములను కాపాడాలని హిందూ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబ్బకోటి ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బండమాధారం, శ్రీరంగవరం గ్రామాలకు చెందిన సర్వే నంబర్లు 248, 249లలో 400 నుంచి 500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ఈ భూమిని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో దళితులు, బీసీలకు కేటాయించినట్టుగా పేర్కొన్నారు. కాగా ఆ భూమిలో 50 నుంచి 100 ఎకరాల వరకు అమ్మకాలు జరిగాయని ఆరోపించారు. కొనుగోలుదారులు అట్టి భూమిలో కమర్షియల్ నిర్మాణాలు చేపడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. అట్టి భూములకు తాము జీవో 59 ప్రకారం రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నామని సదరు వ్యాపారులు తెలుపుతున్నారని తెలిపారు.ఈ భూములను కాపాడాలని మేడ్చల్ తహశీల్దార్, ఆర్ఐలను కోరినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
బుధవారం | జులై 31, 2024 | www.navatelangana.com

'మహిళా శక్తి క్యాంటీన్' పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయబోయే మహిళా శక్తి క్యాంటీన్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధిక గుప్తా మంగళవారం పరిశీలించారు. మహిళా స్వయం సహాయక బందాలతో ఏర్పాటు చేయనున్న క్యాంటీన్లలో భాగంగా కలెక్టరేట్‌కు కేటాయించిన క్యాంటీన్‌ను పరిశీలించి, కేటాయించిన మహిళా గ్రూప్ వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో ఎంత మంది వర్కర్లు, ఎక్కడెక్కడ ఏదేది ఉంచాలనే అంశాలను అడిగి తెలుసుకుని, అవసరమైన సూచనలు ఇచ్చారు. పరిశుభ్రతను పాటించాలనీ, రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురు అరెస్ట్



నవతెలంగాణ - కూకట్ పల్లి

గంజాయి సేవిస్తూ అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సుమారు 100 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కూకట్ పల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి మూసాపేట్ ప్రాంతంలో గంజాయి సేవిస్తూ అమ్ముతున్నట్టుగా వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు, కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాస రావు, సీఐ ముత్తు ఆదేశాల మేరకు డీఐ వెంకటేశం ఆధ్వర్యంలో ఎస్సై ఇంద్రసేనా రెడ్డి, సిబ్బందితో కలిసి మూసాపేట్ మెట్రో స్టేషన్ పక్కన ఉన్న పాడుబడ్డ బిల్డింగ్ వద్ద ఉన్న ఖాళీ స్థలంపై దాడి చేశారు. ఈ మేరకు గంజాయి సేవిస్తున్న కూకట్ పల్లి మైత్రి నగర్ కు చెందిన లింగా రెడ్డి, జగద్గిరిగుట్ట కు చెందిన మహేందర్, జగద్గిరిగుట్ట కు చెందిన కొమ్ము రాకేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 12 చిన్న పాకెట్‌లలో ఉన్న సుమారు 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టుగా పోలీసులు తెలిపారు.

రుణమాఫీతో రైతుల ముఖాల్లో ఆనందం

- రైతు కుటుంబాలను పటిష్టపర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

రుణమాఫీతో రైతుల ముఖాల్లో ఆనందాన్ని నింపడమే కాకుండా, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక పంటలు పండించి రాష్ట్రాన్ని, రైతు కుటుంబాలను ఆర్థికంగా పటిష్టపరచడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతమ్ అన్నారు. రైతు రుణమాఫీ రెండో విడతలో భాగంగా జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రైతురుణ మాఫీ-2024 నిధుల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ రైతులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు పథకాల్లో రుణమాఫీ ఒక భాగం అన్నారు. ఈ రైతు రుణమాఫీ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపిస్తుందని చెప్పారు.

మొదటి విడత రుణమాఫీ గత నెల 18వ తేదీన జరిగిన కార్యక్రమంలో రూ.లక్ష వరకు ఉన్న రుణాలకు గాను చెక్కులను రైతులకు అందజేసినట్టు తెలిపారు. ఇప్పుడు రెండో విడతలో భాగంగా రూ.లక్ష నుంచి రూ.లక్ష 50వేల వరకు చెక్కులను అందజేసినట్టు తెలిపారు. ఏదేని సాంకేతిక కారణాల వల్ల రుణ మాఫీ జరగకుంటే ఆందోళన చెందకుండా గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ఏర్పాటు చేసిన గ్రివెన్స్ సెల్‌లో వివరాలు తెలుసుకోని తెలుసుకోవాలనీ, రుణమాఫీ కాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. వేర్వేరు ప్రాంతాలు, వివిధ బ్యాంకుల్లో ఉన్నా రుణమాఫీ అవుతుందని తెలిపారు.



ఎలాంటి వదంతులు నమ్మకుండా రుణమాఫీ జరుగుతుందనే నమ్మకంతో రైతులు ఉండాలన్నారు. రుణమాఫీ అయిన రైతులకు వెంటనే రాబోయే రబీ, కరీఫ్ పంటలకు అవసరమైన రుణాలను అందించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్, బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే ఆర్థిక చేయూత ఎంతో ఉపయోగకరమన్నారు. రైతులు ఆందోళన చెందకూడదనీ, అర్హులందరికీ రుణమాఫీ అవుతుందని తెలిపారు.

రుణమాఫీ మొత్తం లోన్ ఖాతాల్లో పడకపోతే కంగారుపడకుండా ఏర్పాటు చేసిన వ్యవసాయ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తా మాట్లాడుతూ మిగతా రైతులకు రానున్న రోజుల్లో మాఫీ జరుగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి రేఖామేరీ, మున్సిపల్ చైర్మెన్లు, రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలో బండి రమేష్



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీ పురంలో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు వాసు ఆధ్వర్యంలో తలపులమ్మ తల్లి, పాతపట్నం వేలవేణి దుర్గమ్మ అమ్మవార్ల బోనాలు ఘనంగా జరిగాయి.కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా గొట్టిముక్కల వెంకటేశ్వరరావుతో కలిసి హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో విరసిల్లాలని రమేష్ ఆకాంక్షించారు. బస్తీలోని మహిళలు మేళ తాళాలతో, బోనాలతో తరలివచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు. మేకల రమేష్, చందర్ రావు, ప్రవీణ్ కుమార్, రంగస్వామి, కొడుకు అప్పారావు, కిరణ్ ,పాపారావు, జీవరత్నం, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కూకట్ పల్లి జనరల్ సెక్రటరీగా ఉదయ్ రావు



నవతెలంగాణ - కూకట్ పల్లి

కాంగ్రెస్ శేర్లింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ఆశీర్వాదంతో కూకట్ పల్లి డివిజన్, జనరల్ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించినట్టు మునగాల ఉదయ్ రావు తెలిపారు మంగళవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా . కాంగ్రెస్ చేపట్టినటువంటి ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. దీనికి సహకరించినటువంటి డివిజన్ సీనియర్ నాయకులకు, డివిజన్ కార్యవర్గ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు



నవతెలంగాణ - కూకట్ పల్లి

మూసాపేట్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ హాజరైయ్యారు. మూసాపేట్ చౌరస్తా నుంచి జనతా నగర్ చిత్తారమ్మ దేవాలయం వరకు సాగిన ఫలహారం బండి ఊరేగింపులో పోతురాజుల నత్యం, వివిధ వేషధారణలో ఉన్న కళాకారుల నత్యం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్ రావు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తూము నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి జిల్లా జీత్ రావు, నర్సింగ్, శ్రీనివాస్, జగదీష్, బాబు రావు, వేణు,యువక మండలి అధ్యక్షుడు తూము మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మగ్దుం నగర్‌లో ఒడి బియ్యం అన్నదానం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అమ్మవారి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలనిబీఆర్‌ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు.మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్‌లో శ్రీ ఎల్లమ్మ,పోచమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన "ఒడి బియ్యం"తో మంగళవారం మగ్దుమ్ నగర్ లో బొడ్రాయి. కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల వేడుకలు సోదర భావానికి,ఐక్యతకు నిదర్శనం అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో బస్తీ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండి సత్యనారాయణ నారా నరేందర్, విట్టల్ గౌడ్,లక్ష్మణ్,మాదాసు శంకర్,రాయి రాజేష్,వినోద్,రాయి విగ్నేష్,శ్రీను, మహమూద్,బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ముత్యాపాగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వల్లూరి అనిల్ కుమార్, కోశాధికారిగా లింగాల రవీందర్, ఉపాధ్యక్షులుగా పి.ధనుంజయ్ గౌడ్, టి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పి.కష్ణ, ప్రసాద్, పి.సత్యనారాయణ, బి.సురేష్, ఆర్. సత్తయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రామ్ చందర్, పట్నం రమేష్, ఈ.బాలకష్ణ, శభు, మహిళా సెక్రటరీగా జి.లక్ష్మీ, సరోజిని, లలిత, సి.హెచ్.శోభ, కమిటీ సభ్యులుగా చారి, రాజ్కుమార్, ఎన్.మల్లేష్, యాదమ్మ, సతీష్, సత్యనారాయణ, ఆర్.రమేష్, పి.రవీందర్ గౌడ్, బి.మల్లేష్, శేఖర్, సలహాదారులుగా శోభిత రాజ్, వెంకట్రావు, వెంకన్న బాబులను ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి సర్కిల్ వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సప్త గిరి కాలనీ లోని భాష్యం స్కూల్ సర్కిల్‌లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం సర్కిల్‌లో తీసుకోవాల్సిన చర్యల కోసం, ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రచించాలని, వాహనాల రద్దీ వల్ల ఉదయం పూట, సాయంత్రం పూట రహదారులు నిత్యం రద్దీగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తెలిపారు.పాఠశాలకు వెళ్లే విద్యార్థులు,ఉద్యోగులు,ప్రజలు ట్రాఫిక్ వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ట్రాఫిక్ సమస్యకు వెంటనే పరిష్కారం చూపి,ప్రత్యామ్నాయ మార్గాలపై దష్టి పెట్టి, ప్రజలకు సాంత్వన చేకూరేల అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు ట్రాఫిక్ పైన అవగాహన కలిపించాలని , ట్రాఫిక్ రహిత సమాజం కోసం కషి చేయాలని, ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని, అవసరం ఉన్న చోట విభాగిణిలు ఏర్పాటు చేసి, రోడ్డు మళ్లింపు చర్యలను తీసుకోవాలని, రోడ్డు దాటే వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలకు సుఖవంతమైన, ట్రాఫిక్ రహిత సమాజం కోసం కషి చేయాలని తెలిచేయశారు.అందుకు కాలనీ వాసులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్, ఎస్సై రమేష్, గోపాల్ కాంగ్రెస్ నాయకులు నాయినేనీ చంద్రకాంత్ రావు,శర్మ , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరలోనే పూర్తి చేస్తా



- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రతి కాలనీ, బస్తీలలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తానని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్, ప్రగతి నగర్ రోడ్డుపై ఏర్పడిన మంజీర పైప్ లైన్ లీకేజీ మరమ్మతు పనులను , ట్రాఫిక్ మళ్లింపు విధివిధానాలపై మంగళవారం కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐ వెంకట్‌తో, జలమండలి అధికారులతో, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి నీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ఇంకా ఎక్కడైనా లీకేజ్ అయ్యే పరిస్థితి ఉన్న పైప్ లైన్‌లను గుర్తించి లీకేజీ మళ్లీ సంభవించకుండా వాటిని కూడా సరిచేయాలని సూచించారు. డివిజన్ లో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. మరమ్మతు పనులకు ప్రజలు సహకరించి పోలీసుల సూచనలు పాటించాలన్నారు. జేఎన్‌టీయూ ప్రధాన రహదారి నుండి అడ్డగుట్ట, హెచ్‌ఎంటి హిల్స్, ఆదిత్య నగర్ మీదుగా ప్రగతి నగర్ కు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతాయని మంజీర పైప్ లైన్ లీకేజీ మరమ్మతు పనులు చేపట్టే సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కార్పొరేటర్ ట్రాఫిక్ పోలీసు అధికారులకు సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న అడ్డంకులను, రోడ్డుకి అడ్డంకిగా ఉన్న వాటిని తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, చుట్టూ పక్కల ఉన్న వాళ్ల వాహనాలు రోడ్ల పై పార్కింగ్ చేసి ప్రజలకు ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనన్ను కానీ, కార్పొరేటర్ కార్యాలయంలో సంప్రదించాలని తెలియజేసారు. జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, ఇంజినీరింగ్ అధికారులు డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, నాయకులు పోతుల రాజేందర్, కాలనీ వాసులు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు, సుబ్బా రావు, కిషోర్ బాబు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి సర్కిల్, ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్ లో హాని డ్రైవ్ ఇన్ ముందున్న విద్యుత్ ట్రాన్స్పార్మర్ ప్రమాదకరంగా ఉంది. భాగ్యనగర్ సబ్ స్టేషన్ పరిధిలోకి వచ్చే ఈ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. ఎల్లమ్మ బండ నుండి భాగ్యనగర్ కు వెళ్ళే ప్రధాన రహదారిలో ఈ ట్రాన్స్పార్మర్ ఉండగా.. విద్యుత్ తీగలు నేల మీదకు వేలాడుతూ ,ప్రమాదకరంగా ఉంది. అసలే వర్షాకాలం పొరపాటున ఎవరైనా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలితే వారి పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాబట్టి ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె వేసి ప్రజల ప్రాణాలు రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్ల మరమ్మతుకు నిధులు కేటాయించండి



- జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్‌లోని చంద్రగిరినగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాలతో పాటు పలు ప్రాంతాలలోని వీధులలో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే మరమ్మతులు ప్రారంభించాలని స్థానిక కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రభావంతో గుంతల మయంగా మారిన రోడ్లు ప్రమాదభరితంగా తయారయ్యాయని, తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

దాశరథి సినారెలు తెలంగాణ జాతి రత్నాలు

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



నవతెలంగాణ-కల్చరల్

దాశరథి కష్ణమాచార్య, సి నారాయణ రెడ్డిలు తెలంగాణ జాతి రత్నాలని, జాతీయ స్థాయిలో తెలుగు వారి కీర్తిని నిలిపారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కొనియడారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై శ్రుతి లయ ఆర్ట్స్ ఆర్‌ఆర్ ఫౌండేషన్ సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దాశరథి కష్ణమాచార్య శత జయంతి, సినారె జయంతి వేడుకలను నిర్వహించారు. ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ప్రముఖ గాయకులు ఆమని సుభాష్ రాజన్ సీత సవిత, గాయత్రి, వెంకటేస్వర రావు, చంద్ర శేఖర్ తదితరులు పన్నెండు గంటలు నిర్విరామంగా సినారె, దాశరథి సినీ గీతాలు ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యతిథి చిన్నారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డ కవులు, కళాకారులకు నిలయం అన్నారు. దాశరథి, సినారె పరస్పరం గౌరవించుకొనే వారని, సినారె తన కవితా సంపుటిని దాశరథికి అంకితం ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డికి సినారె ఆత్మీయ పురస్కారం, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వర శంకరంకు దాశరథి సాహితీ పురస్కారం, గీతాగాన ప్రవచకుడు గంగాధర్ శాస్త్రికి సినారె జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. వేదిక పై దైవజ్ఞ శర్మ కోలేటీ దామోదర్, చింతల శ్రీనివాస్, కుసుమ, భోగరాజు శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు. ఇదే వేదిక పై చేవూరి విష్ణు వర్ధన్‌కు వ్యాఖ్యాన రత్న బిరుదును కవి చింతల శ్రీనివాస్ ప్రకటించి సత్కరించారు.

బస్సు కండక్టర్‌పై ఆకతాయిల దాడి



నవతెలంగాణ - బంజారాహిల్స్

ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై ఆకతాయిలు దాడి చేశారు. వివరాల్లోకెళ్తే.. మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ నెంబరు ఏపీ 28 జెడ్ 4890,కే/జీ బస్సు జగదిరిగుట్ట నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్నది. ఎస్సార్ నగర్ వద్ద కొందరు విద్యార్థులు బస్సు ఎక్కారు. బస్సు అమీర్‌పేట దాటి పంజాగుట్ట వస్తున్నప్పటికీ పైకి రాకుండగా ఫుట్ బోర్డ్ పై ప్రయాణిస్తుండగా పైకి రావాలని కండక్టర్ శ్రీనివాస్ పలుమార్లు కోరాడు. దయచేసి పైకి రావాలని దగ్గరకు వెళ్లి చెప్తే అతనిపై విద్యార్థులు దాడి చేశారు. ముక్కుపై దాడి చేయడంతో రక్తపు మరకలతో కండక్టర్ విలవిలలాడుతూ పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దాడి చేసిన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

బోనాల జాతరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ



నవతెలంగాణ-ఓయూ

బోనాల పండుగ సందర్భంగా జాతరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 28, 29 తేదీలలో చిలకలగూడ శ్రీ కట్ట మైసమ్మ పోచమ్మ బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి సహకరించిన పోలీస్ శాఖ,వైద్య శాఖ,వాటర్ వర్క్స్ అధికారులకు, విద్యుత్ శాఖ, జీహెచ్ఎంసీ అధికారులకు, ఎప్పటికప్పుడు చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉంచిన శానిటేషన్ సిబ్బంది, ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు.

కృష్ణ కాంత్ పార్కులో కనీస సౌకర్యాలు కల్పించాలి

- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సీహెచ్ చంద్రశేఖర రావు
- పార్కులో పర్యటించిన నాయకులు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

వెంగళరావు నగర్ డివిజన్ కృష్ణ కాంత్ పార్కులో వాకర్స్‌కు నీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సీహెచ్ చంద్రశేఖర రావు కోరారు. పార్టీ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు మంగళవారం ఉదయం పార్కులో పర్యటించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర రావు మాట్లాడుతూ పార్కులో కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. బాత్రూంలో వాటర్ లేదని, దాంతో అవి కంపు కొడుతూ అశుభ్రంగా ఉన్నాయన్నారు. దాదాపు 600 మంది ఈ పార్క్‌కు ఉదయం వాకింగ్‌కు వస్తారని.. దాంతో వారు టాయిలెట్స్ వెళ్లాలంటే చాలా ఇబ్బందికర పరిస్థితి ఉందని చెప్పారు. కావున వెంటనే బాత్రూమ్‌లలో కనీస సౌకర్యాలు కల్పించాలని, విరిగిపోయిన బెంచీలు, కుర్చీలను రిపేర్ చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. నగరం నడిబొడ్డున ఉన్న పార్కు కావడంతో సమీపంలో ఉన్న సుమారు పది కాలనీల వారు ప్రతిరోజూ ఇక్కడకు వస్తుంటారన్నారు. ఫారెస్ట్ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని వాకర్స్‌కు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పించి, పార్కులు అభివద్ధి చేస్తే స్థానిక ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ ,నాయకులు ఎం రవీంద్రబాబు, వై. యాదగిరి పాల్గొన్నారు

ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయండి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఎల్బీనగర్ బాకారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాన్ని వారం రోజుల్లోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ముషీరాబాద్ మండలంలోని కవాడిగూడలోని ఎల్బీనగర్ బాకారం డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులు పూర్తయినందున వారం రోజుల్లోగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలనీ, లబ్దిదారులకు గృహాలను అందించేందుకు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ సాయి చరణ్ కాలనీ నాగమయ్యకుంట డబుల్ బెడ్ రూమ్ సముదాయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్, హౌసింగ్ డీఈ గంగాధర్, తహసిల్దార్ రాణాప్రతాప్ సింగ్, ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర్‌రెడ్డికి చికాగో యూనివర్సిటీ డాక్టరేట్



నవతెలంగాణ-బంజారాహిల్స్

మురుగు నీటి శుద్ధి సమస్యలో శాస్త్రీయ ప్రకృతి ఆధార పరిష్కార పద్ధతులను విస్తృతంగా ప్రచారం చేస్తూ, వాటిని వివిధ సంస్థలలో అమలు చేస్తూ పర్యావరణ పరిరక్షణ మీద కృషి చేస్తున్న దొంతిరెడ్డి గంగాధర్‌రెడ్డిని చికాగో ఓపెన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఢిల్లీలో జరిగిన యూనివర్సిటీ కాన్వకేషన్‌లో ఈ డాక్టరేట్‌ను అందుకున్న సందర్భంగా మంగళవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను అమెరికాలో గ్రీన్ కార్డు కలిగి ఉన్నప్పటికీ కూడా మన దేశానికి ఏదైనా చేయాలనే తలంపుతో ఇండియాకు వచ్చానని, మన అవసరాలు, విలాసాల కోసం ప్రకృతిని పాడుచేసే విధానాన్ని గమనించానని అన్నారు. చెరువులు,కుంటలు,వాగులు కలుషిత నీటితో ఉండటాన్ని గమనించిన వాటిని ప్రకతి ఆధారిత పద్ధతుల్లో శుద్ధి చేసే విధానాలను తాను అవలంబించానని.. చాలా ప్రాంతాల్లో విజయవంతం అయ్యాయన్నారు.తన కృషిని గుర్తించి చికాగో యూనివర్సిటీ అమెరికా వారు గౌరవ డాక్టరేట్ అందించడం గర్వంగా ఉందని ఈ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ప్రత్యేకించి విద్యా సంస్థలు చొరవ తీసుకుని సరియైన పద్ధతులను అమలు చేస్తే విద్యార్థులలో పర్యావరణ చైతన్యం,పరిజ్ఞానం పెరిగి సరైన దక్షతతో భవిష్య పర్యావరణ పరిరక్షణ చేయగలుగుతారనీ అభిప్రాయపడ్డారు.

‘12 నెలల వేతనాలివ్వని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి’



నవతెలంగాణ-ఓయూ

12 నెలల వేతనాలు ఇవ్వని ప్రయివేటు డిగ్రీ కళాశాలల పైన చర్యలు తీసుకోవాలని యూనివ ర్సిటీ అధికారులను తెలంగాణ ప్రయివేటు డిగ్రీ కాలేజ్ లెక్చరర్ సమితి రాష్ట్ర అధ్యక్షులు కట్ట శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థుల దగ్గర సంవత్సరం సరిపడా ఫీజును తీసుకొని వాళ్లకు పాఠాలు చెప్పే డిగ్రీ లెక్చరర్లకు 10 నెలల వేతనాలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఇంకా కొన్ని కాలేజీలు రెండు మూడు నెలల్లో సిలబస్ కంప్లీట్ చేయిస్తున్నాయన్నారు. అలాంటి కాలేజీల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనివలన వేతనాలు లేక లెక్చరర్స్ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కావున 12 నెలలు వేతనాలు ఇవ్వని ప్రయివేటు డిగ్రీ కాలేజీల పైన చర్యలు తీసుకోవాలని కోరారు.

49 శాతం వృద్ధిని నమోదు చేసిన అడ్విక్ క్యాపిటల్

నవతెలంగాణ-బేగంపేట్

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) తీసుకునే అభివృద్ధి చెందుతున్న నాన్ డిపాజిట్‌లలో ఒకటైన అడ్విక్ క్యాపిటల్ లిమిటెడ్, జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో స్టెల్లార్ ఆర్జనలను నివేదించిందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు బేగంపేట్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ముగిసిన త్రైమాసికంలో, కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ. 22779 లక్షలు, సంవత్సరానికి 49 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఈ స్థితిని సాధించడానికి, అడ్విక్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ ఇప్పటికే దాని పోర్ట్‌ఫోలియోను విస్తృతంగా ఆధారం చేయడం, భవిష్యత్ కొత్త అంచు వ్యాపారాలలోకి విస్తరించడం, కంపెనీ ప్రస్తుత వ్యాపార మార్గాలను సమగ్ర మూల్యాంకన పారామితులతో అభినందించడం, అనుబంధించడం వంటి లక్ష్యంతో దాని వ్యాపార విస్తరణ వ్యూహాన్ని అమలు చేయడం ప్రారంభించిందన్నారు. దాని వ్యాపార కార్యకలాపాలను పెంచడానికి అవసరమైన మరిన్ని వనరులను సమీకరించడం, రిస్క్, కార్యకలాపాలు, పాలన, సాంకేతికతపై డొమైన్ నిపుణులుగా పరిశ్రమ అనుభవజ్ఞులను నియమించుకోవడం జరిగిందన్నారు.

పవన్ ఖేరకు జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ-బేగంపేట

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ సలహాలు సూచనలతో జాతీయస్థాయిలో ప్రత్యర్థి పార్టీల ప్రచారాలకు దీటుగా కాంగ్రెస్ పార్టీని కూడా అగ్రహంలో నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న సిడబ్ల్యుసి సభ్యులు, ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగం చైర్మెన్ పవన్ ఖేర కు హైదరాబాద్ క్లబ్ క్రికెటర్ బెంజమిన్ దబ్బెట జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు. భవిష్యత్తులో పవన్ ఖేర పర్యవేక్షణలో కాంగ్రెస్ పార్టీ మరిన్ని విజయాలు సాధించాలని బెంజమిన్ ఆకాంక్షించారు.

ప్రపంచ మార్కెట్‌లోకి విస్తరించిన రుషీల్ డెకర్ లిమిటెడ్

నవతెలంగాణ-బేగంపేట్

ఎకో ఫ్రెండ్లీ ఎండీఎఫ్ , లామినేట్స్, పీవీసీ, డబ్ల్యూపీసీ తయారీలో అగ్రగామిగా ఉన్న రుషీల్ డెకర్ లిమిటెడ్ ప్రపంచవ్యాప్తంగా మార్కెట్‌లోకి తన ఉనికిని విస్తరిస్తోందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. బేగంపేట్ లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దాని ప్రపంచ వృద్ధి వ్యూహంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. రుషీల్ డెకర్ ఇప్పటికే 50 దేశాలకు చేరుకుందన్నారు. లామినేట్‌లు, ఎండీఎఫ్ కోసం ప్రపంచంలోని అతిపెద్ద మార్కెట్‌లలో ఒకదానిని పెట్టుబడిగా పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. స్థిరమైన ఉత్పాదక పద్ధతులు, అధిక నాణ్యత ఉత్పత్తులను అందించడంలో తమ నైపుణ్యాన్ని పెంచుతుందన్నారు. తాము బహుళ బిలియన్ డాలర్ల వుడ్ ప్యానెల్ మార్కెట్ అందించే అవకాశాలను, స్థానిక, గ్లోబల్ కస్టమర్ల డిమాండ్‌లను తీర్చడానికి అనుకూలీకరించిన స్థిరమైన, ఉన్నతమైన ఉత్పత్తులను అందించడంలో తమ అంకితభావాన్ని నొక్కి చెబుతూ, ఉత్తర అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించడం వ్యూహాత్మక ప్రాముఖ్యతను చాటామని అన్నారు.

ఇరుకు రోడ్డులో ఇరుక్కపోయిన అంబులెన్స్

- రోడ్డు వెడల్పు చేయాలని కోరుతున్న స్థానికులు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

బోరబండ బస్ స్టాప్ నుండి పోలీస్ స్టేషన్ వరకు రోడ్డు వెడల్పు చేయనందున, వాహనదారులు స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం సాయంత్రం అదే రోడ్డులో వచ్చిన ఓ అంబులెన్స్ సుమారు 20 నిమిషాల పాటు ఆ ఇరుకు రోడ్డులో ట్రాఫిక్ లో ఎటు కదల లేక ఆగిపోయింది. గత పది సంవత్సరాల నుంచి రోడ్డు వైండింగ్ మార్కింగ్ చేసి 80 అడుగుల రోడ్డు వేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నోసార్లు మార్కింగ్ చేసి కొన్ని నివాసాలను తొలగించిందని స్థానికులు చెబుతున్నారు. కొంతమందికి నష్టపరిహారం కింద చెక్కులు కూడా ఇచ్చారని.. అయితే ఇండ్లు కోల్పోయిన అందరికీ చెక్కులు ఇవ్వనందన రోడ్డు వెడల్పు చేసే పని ఆగిపోయిందని తెలిపారు. దీనివలన స్థానికులు వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఇండ్లు కోల్పోయిన వారికి అందరికీ నష్టపరిహారం ఇచ్చి ,బోర బండ బస్‌స్టాప్ నుండి పోలీస్ స్టేషన్ వరకు 80 అడుగుల రోడ్డు వేసి బోరబండ సైట్ 3 వరకు బస్సులు నడపాలని స్థానికులు కోరుతున్నారు.

మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నం





- అడ్డుకున్న పోలీసులు

నవతెలంగాణ-ఓయూ

అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేశారంటూ నిరసనగా టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నల్గొండ అంజి ఆధ్వర్యంలో మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నించారు. అయితే దాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగతంగా విమర్శలు చేయటం సిగ్గు చేటు అని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్ యాదాద్రి విద్యుత్ కేంద్రం తీసుకువచ్చి 30 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత జగదీష్ రెడ్డిది అన్నారు. కోమటిరెడ్డి మంత్రి అయ్యాక నల్లగొండ జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నేతలు వడ్డేపల్లి సందీప్.మేకల సందీప్ ,వెంకట్, గణేష్, శివ , నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి ఐఐఐటీ బాసరలో సీటు



- అభినందించిన డాక్టర్ కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపేట్

ఐఐఐటీ బాసరలో సీటు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సీహెచ్ వినయ్ కుమార్‌ను కాంగ్రెస్ సనత్ నగర్ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అభినందించారు. సికింద్రాబాద్‌లోని బండిమెట్, పాటిగడ్డలో వినయ్ కుమార్‌ను అభినందిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయివేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందిస్తున్నాయనడానికి వినయ్ సాధించిన ఘనత నిదర్శనమని కొనియాడారు. ఈ విజయానికి కారణమైన పాఠశాల సిబ్బంది అంకితభావం, బోధనా నాణ్యతను ఆమె ప్రశంసించారు. ఈ సాఫల్యం మన ప్రభుత్వ పాఠశాలల శ్రేష్ఠతను, ఉపాధ్యాయ సిబ్బంది అసాధారణ ప్రయత్నాలను హైలైట్ చేస్తుందని తెలిపారు. ఇది ఒక ప్రేరణగా పనిచేస్తుందని, ప్రభుత్వ విద్యలో పెట్టుబడి విలువను బలపరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎల్ కృష్ణ, నజీర్ అడ్డు, తస్లీమ్ బేగం, బబ్లు, నవాజ్, మునీర్, సభ, అక్బర్, అల్తామస్, స్వరూప, జగదీష్, సాయిబాబా, అజ్మత్ హైమద్‌ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మ దీక్ష పోస్టర్ ఆవిష్కరించిన కోలన్ హన్మంత్ రెడ్డి



నవతెలంగాణ-దుండిగల్

ఢిల్లీలో ఆగస్టు 5న ఏబిసిడి వర్గీకరణ కోసం చలో ఢిల్లీ మాదిగ మహా కూటమి ఆధ్వర్యంలో తలపెట్టే ధర్మదీక్ష పోస్టర్‌ను మంగళవారం కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బాచుపల్లి లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు . ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఎన్ఎస్ఆర్ రాజు, తలారి చైతన్య, లక్ష్మణరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు

‘యువతరం రాయడం చాలా అవసరం’



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా కలలు చిగురిస్తాయి పాలస్తీనా సంఘీభావ కవిత్వం, మాటలే దేశద్రోహమైతే అరుంధతీ రాయ్‌కు సంఘీభావ కవిత్వం పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. దొంతం చరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రొఫెసర్. కొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఘటన పై మాట్లాడుతున్న యంగ్ జనరేషన్ రాయడం చాలా అవసరం అన్నారు. యువకులు కవితలు రాయడం స్ఫూర్తి దాయకం ఇది ముందు జనరేషన్స్‌కి మంచి వాయిస్ అవుతుందన్నారు. ఎస్. వేణుగోపాల్ మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలు ఇప్పుడు నేల కోసం, హక్కుల కోసం పోరాడుతున్నారు. సానుభూతి కాదు సంఘీభావం ముఖ్యమని, పాలస్తీనా ప్రజల కన్నీళ్లను రోదనను కవిత్వంగా మలిచి ఈ యువత సంఘీభావంగా నిలిచింది అన్నారు. అరుంధతి రాయ్ స్వేచ్ఛని హరించడం అన్యాయమన్నారు. కవి యాకూబ్ వాస్తవాన్ని చెప్పడానికి కవిత్వాన్ని మనం ఆయుధంగా వాడుకుందాం.. మనుషుల్ని ప్రేమిద్దాం అన్నారు. ఎస్.ఎ.డేవిడ్ పాలస్తీనా పోరాట స్ఫూర్తిని యూనివర్సిటీల బాధ్యతను గుర్తు చేశారు. 22 మంది యువకవులు పాలస్తీనా మీద స్పందించడం, అరుంధతీ రాయ్ కి సంఘీభావంగా కవిత్వం రావడం ఈ పుస్తకాల ప్రత్యేకత అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి సలీమ, లావణ్య, శ్రీనిధి, అనూష, రోజారాణి, సాత్విక, శ్రావణి, మహేష్, శివ, హాథిరామ్, బాలు, సాయి, వినోద్, లింగన్న వంటి కవులు, రచయితలు, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లి చేసుకుంటానని నమ్మించి మోసం..

- నిందితుడు అరెస్ట్

నవతెలంగాణ-బేగంపేట్

పెండ్లి చేసుకుంటానని నమ్మించి యువతితో శారీరక సంబంధం పెట్టుకుని విదేశానికి పారిపోతున్న నిందితున్ని మహంకాళి పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశు రాం తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా గంగాపూర్ గ్రామానికి చెందిన బండారం స్వామి ఆస్ట్రేలియాలో పౌల్ట్రీలో జాబ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్ చెందిన ఓ యువతితో అతని ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. వారిద్దరు ప్రతి రోజూ చాటింగ్ చేస్తూ మాట్లాడుకునేవారు. అనంతరం ఇరువురు వివాహం చేసుకోవాలని నిశ్చయిం చుకున్నారు. ఇటీవల స్వామి హైదరాబాద్‌కు వస్తున్నానని సదరు యువతిని హైదరాబాద్‌లో కలుద్దామని చెప్పాడు. దీంతో వారిద్దరు చూసుకొని వివాహం చేసుకుందామని అనుకున్నారు. ఈ క్రమంలో వారిద్దరు ఈ నెల 3వ తేదీన సికింద్రాబాద్‌కు వచ్చారు. మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాహుల్ ఇంటర్నేషనల్ హెూటల్‌లో రెండు రోజుల పాటు బస చేశారు. హెూటల్‌లో ఉన్న సదరు యువతిని పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో శారీరకంగా కలిశాడు. అటుపై యువతిని ఇంటికి పంపించాడు. స్వామి జనగాంలోని తన సొంతూరికి వెళ్లిపోయాడు. అనంతరం యువతి పలు మార్లు పెండ్లి విషయాన్ని ప్రస్తావించినా స్వామి దగ్గర నుంచి ఏ రెస్పాన్స్ రాలేదు. పెండ్లి చేసుకోకుండా స్వామి విదేశానికి పారిపోతు న్నట్టు తెలుసుకున్న ఆ యువతి చత్తీస్‌ఘడ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఈ కేసును సికింద్రాబాద్ మహంకాళి పోలీసు లకు బదిలీ చేశారు. మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు నిందుతుడు చేరుకున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న మహంకాళి పోలీసులు స్వామిని అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్ కు తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నిజాం కళాశాలలో టీఎస్‌పీ సమావేశం



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ సమావేశం మంగళవారం నిజాం కాలేజీలో నిర్వహించారు. టీఎస్‌పీ విస్తరణలో భాగంగా నిజాం కాలేజ్ కమిటీని ఏర్పాటు చేసి అధ్యక్షుడుగా ధార సతీష్‌ని నియమించినట్టు రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ యాదవ్ తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వెంటనే స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని, యూనివర్సిటీ వీసీలను నియమించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సమస్యల పరిష్కారానికి టీఎస్పీ నిరంతరం ఉద్యమిస్తూనే ఉంటుందన్నారు. నిజాం కాలేజీ కమిటీతో పాటు అన్ని కాలేజీలలో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. నిజాం కాలేజ్ అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ కాలేజీలో ఉన్న సమస్యల పరిష్కారానికి విద్యార్థులతో కలిసి పోరాడుతామని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ యాదవ్, ఓయూ అధ్యక్షుడు మధు యాదవ్, విద్యార్థి నాయకులు సూర్య, మహేష్, కిరణ్‌లకు ధన్యవాదాలు తెలియచేశారు.

కొత్త స్టోర్‌లను ప్రారంభించనున్న సెల్లెకార్ గాడ్జెట్స్ లిమిటెడ్

నవతెలంగాణ-బేగంపేట్

సెల్లెకార్ గాడ్జెట్స్ లిమిటెడ్ భారతదేశంలోని కన్స్యూమర్ డ్యూరబుల్స్ తమ సరికొత్త రెండు కొత్త ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ స్టోర్‌లను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు సనత్ నగర్ లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ ఈ స్టోర్‌లు విభిన్న మార్కెట్‌లను స్వీకరించడం, కీలకమైన ప్రాంతాలకు తన పరిధిని విస్తరించడం, వివిధ మార్కెట్‌లలో ప్రాప్యత, నాణ్యత, ఆవిష్కరణల పట్ల దాని నిబద్ధతను ప్రతిబింబించేలా సెల్లెకార్ నిబద్ధతలో గణనీయమైన పురోగతిని సూచిస్తాయన్నారు. ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ స్టోర్ సెల్లెకోర్‌ను భారతదేశం ఈశాన్య సరిహద్దు వరకు విస్తరించిందన్నారు. అత్యాధునిక వినియోగదారు ఎలక్ట్రానిక్‌లను అందించడానికి భౌగోళిక అంతరాలను తగ్గించిందన్నారు. ఈ విస్తరణ దాని ఫ్రాంచైజ్ ఆధారిత మోడల్ ద్వారా స్థానిక వ్యవస్థా పకతను పెంపొందిస్తూ, దేశవ్యాప్తంగా వినియోగదారుల విభిన్న అవసరాలను తీర్చడంలో కంపెనీ అంకితభావాన్ని ప్రతిపాదిస్తుందన్నారు. ప్రత్యేకమైన బ్రాండ్ స్టోర్‌ను ప్రారంభించడం పట్టణ మార్కెట్ల వైపు సెల్లెకార్ వ్యూహాత్మక మార్పును సూచిస్తుందన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలు ఆత్మహత్య

నవతెలంగాణ-కంటోన్మెట్

ఉరేసుకున్న గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. తిరుమలగిరి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఎస్పీ కాలనీ పార్క్ వద్ద ఓ చెట్టుకు వృద్ధురాలు ఉరేసుకుని చనిపోయి కనిపించింది. అందుకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే తిరుమలగిరి పోలీసులను సంప్రదించాలని సీఐ నాగరాజు తెలిపారు.

బోయిన్‌పల్లి సీఐకు జంపన ప్రతాప్ సన్మానం



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయినపల్లిలో బోనాల జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేసిన బోయిన్‌పల్లి సిఐ లక్ష్మీనారాయణ, కంటోన్మెంట్ సిబ్బందిని, శ్రీ దేవి నల్ల పోచమ్మ ఆలయ ఫౌండర్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతప్ సన్మానించారు మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రతినిధులతో కలిసి ఆయన సన్మానం చేశారు. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగినందుకు పోలీసులను అభినందించారు. అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్యం నెలకొల్పినందుకు కంటోన్మెంట్ పారిశుధ్య సిబ్బందిని ఆయన అభినందించారు. అలాగే కమిటీ సభ్యులను కూడా ప్రతాప్ అభినందించారు. . ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అజిత్, ప్రేమ్ ముదిరాజ్, జహంగీర్ గౌడ్, రామారావు, పుట్టినర్సింహ, శ్రీకాంత్, దుర్గయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధూల్ పేట్‌లో గంజాయి స్థావరాలపై దాడులు..

నవతెలంగాణ - ధూల్ పేట్

ధూల్ పేట్ లో ఎక్సైజ్ శాఖ అధికారులు ధూల్ పేట్ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ, రాష్ట్ర టాస్క్ ఫోర్స్ బృందం, దూల్పేట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా అధ్వర్యంలో నిర్వహించిన వేరు వేరు దాడుల్లో సుమారు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఐదుగుర నిందితులను అరెస్టు చేశారు. ధూల్ పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి, ధూల్ పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబుల వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్, ధూల్ పేట్ బలరాం గల్లీలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అదే ప్రాంతానికి చెందిన చిన్న అలియాస్ రవీందర్ సింగ్, రాహుల్ సింగ్, మనీష్ సింగ్ ల వద్ద కిలో 3వందల గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. కాగా అభిషేక్, అజయ్, దినేష్ సింగ్ లు పరార్ లో ఉన్నట్లు వారు తెలిపారు. మరో దాడుల్లో సీతారాంబాగ్ లోని కావడి నాగరాజ్, జి. సాయి కిరణ్ వద్ద 657 గ్రాముల గంజాయితో పాటు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొన్నారు. ఆ ఐదుగురు నిందితులను రిమాండ్ కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గోపాల్, ఎస్సై భాస్కర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, శ్రీధర్, ఆజం, ప్రకాష్, మహేష్, రాకేష్ తోపాటు సిబ్బందిని, ఎక్సైజ్ ఇన్ఫోర్స్మెంట్ ఆఫ్ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి, జాయింట్ కమిషనర్ ఎస్ వై.ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి సిబ్బందిని అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
13
హైదరాబాద్
HMDA
బుధవారం | జూలై 31, 2024 | www.navatelangana.com

గుర్తుతెలియని రైలు ఢీకొని మహిళ మృతి..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని రైలు ఢీకొని మహిళ మృతి చెందినట్లు రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ భాగ్యరాజ్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం చందానగర్ - హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌ల మధ్య ఓ గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందినట్లు తెలిపారు. ఆమె వయస్సు 35 సంవత్సరాలు ఉన్నట్టు తెలిపారు. మిగతా వివరాల కోసం నాంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశంకు సినారె పురస్కారం

నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ యువ కళా వాహిని నిర్వహణలో నేడువిఖ్యాత కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి రవీంద్ర భారతి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ విలేకరులకు తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయ మూర్తి జస్టిస్ రాధా రాణి పాల్గొని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం కు సినారె సాహితీ పురస్కారం సంస్థ పక్షాన బహుకరిస్తారనీ వారు తెలిపారు. డాక్టర్ కెవి రమణ అధ్యక్షత వహించే కార్యక్రమంలో మామిడి హరికృష్ణ, సిఎల్ఎన్ గాంధీ శైలజా మిత్ర ఏస్.వీ రమణ రావు అతిథులుగా హాజరు అవుతారు. ఈ సందర్భంలో సురేఖ మురళీ సంధ్యా వర్షిణి లచే సినారె సినీ గీత విభావరి వుంటుంది.

కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వం

- మోడీ హానికరమైన పోకడలతో ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం
- అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్ చట్టవిరుద్ధం
- ఆమ్ ఆద్మీ పార్టీ ధర్నాలో 'ఇండియా' కూటమి నేతలు



నవతెలంగాణ-ముషీరాబాద్

దేశంలోని ప్రతిపక్ష పార్టీలను అణిచి వేసేందుకు బీజేపీ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నదని, ఈడీ, సీబీఐలను ప్రధాన సాధనాలుగా వాడుతూ నిరాధారమైన కారణాలతో విపక్ష నేతలను టార్గెట్ చేసి జైళ్లలో బంధిస్తున్నదని ఇండియా కూటమి నేతలు మండిపడ్డారు. ఆప్ జాతీయ కమిటీ పిలుపుమేరకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీ వాల్ అక్రమ అరెస్టును నిరసిస్తూ దేశవ్యాప్త ధర్నాలలో భాగంగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద గల ధర్నా చౌక్‌లో మంగళవా రం భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఇండియా కూటమి నేతలు కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఆర్.జి. వినోద్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కలవ సుజాత, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర నాయకులు ఎన్ బాల మల్లేష్, ఆర్ఎస్పీ నాయకులు జానకిరామ్, ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా. సాల్మన్ రాజు, డా. ఎస్.కె. అన్సారీ, ఏం.ఏ. మజీద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్ రెడ్డి మాట్లాడుతూ నియంతలు నిర్వహించే ఆపరేషన్ల తరహాలో ఈడీ, సీబీఐలను అక్రమంగా వినియోగించి ప్రతిపక్ష నేతలను అంతం చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని తెలిపారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడూ ఈడీ, సీబీఐలును దుర్వినియోగపరచలేదని, ప్రతిపక్ష నేతలను వేధించలేదని, జైళ్లలో బంధించలేదని తెలిపారు. అవసరమైనప్పుడు వారి సలహాలు, సూచనలు తీసుకునేదని గుర్తు చేశారు. ఏ ఆధారాలు లేని ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులు పెట్టి అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఆప్ నేతలను అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధం అన్నారు. ఆప్ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డి.జి. నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ పాలనలో ప్రజాస్వా మ్య హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదని, ప్రధాని మోడీ హానికరమైన పోకడలతో ప్రజాస్వామ్యం పెను ప్రమాదంలో పడిందని తెలిపారు. జానకి రామ్ మాట్లాడుతూ కరడుగట్టిన నియంతలందరూ నిర్వహించే చర్యల్లో భాగంగానే మోడీ ప్రతిపక్ష నేతలను అణిచివేస్తున్నాడని, ఇందుకు ఉదాహరణ అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కాల్వ సుజాత మాట్లాడుతూ. మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య సిద్ధాంతా లపై కఠోరమైన దాడులు చేస్తూ ప్రతిపక్ష నేతలను ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా అరెస్టులు చేస్తున్నదని అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల లక్ష్యం ప్రతిపక్షం అని, అధికార బీజేపీని ముట్టుకునే సాహసం చేయరని ఆమె ఆరోపించారు. ఎస్. బాలమల్లేష్ మాట్లాడుతూ ఇండియా కూటమి పార్టీలను అధికార బీజేపీ అణిచివేసే ప్రయత్నాలు కొనసాగిస్తే దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ బీజేపీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన అతిపెద్ద రాజకీయ ప్రత్యర్థి 'ఆప్' ను అణిచివేసేందుకు ఈడీ, సీబీఐ, ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్‌ను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు గత పదేండ్లలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులపై 230 కేసులు నమోదు చేశాయని, అయితే కోర్టుల్లో ఒక్క కేసును నిరూపించడానికి తగిన సాక్ష్యాలు ప్రవేశపెట్టలేదని అన్నారు. తగిన సాక్ష్యాలు లేనందున కేజ్రీవాల్‌తో సహా ఆప్ నేతలు నిరపరాధులుగా బయటకు వస్తారని తెలిపారు. ఈ ధర్నాలో ఆప్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ ముల్లంగి, నాయకులు కొడంగల్ శ్రీనివాస్, డాక్టర్స్ విభాగం అధ్యక్షులు డా. లక్ష్య నాయుడు, దివ్యంగా విభాగం అధ్యక్షులు దర్శనం రమేష్, అధికారప్రతినిది జావీద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలతో మహిళా సంఘాలు బలోపేతం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను స్వయం సహాయక సంఘ సభ్యులకు ఎస్‌హెచ్‌జీ ద్వారా రుణాలు (స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ, సీబీఓ నిధులు) అందించి ఆర్థికంగా బలోపేతం చేస్తుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధిక గుప్తా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకంపై డీఆర్‌డీఏ వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సాంబశివరావు, మెప్మా పీడీ అనిల్‌కుమార్, ఎల్డీఎం శివప్రసాద్, డీడబ్ల్యూఓ కష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రహ్మణుల గత పలు జీవోలను ప్రభుత్వం పునరుద్ధరించాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



గత ఏపీ ప్రభుత్వం వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ నాయి బ్రాహ్మణుల సంక్షేమమునకై పలు ఉత్తర్వులు, (జీవోలు) జారీ చేసింది. అట్టి జీవోలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరిగి పునరుద్ధరించ లేదు అని అట్టి జీవోలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించి ఇవ్వాలని కోరుతూ నాయి బ్రాహ్మణ రాష్ట్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ నాగరాజు మంగళవారం మాసబ్ ట్యాంక్ లోని నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ ఎండి ఇందిర కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఇచ్చిన జీవోలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్టాల యాదగిరి, ఉపాధ్యక్షులు ఏముల సుధాకర్ సహాయ కార్యదర్శులు యం. రామచందర్ , యం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతో ప్రమాదాలు నివారించవచ్చు



నవతెలంగాణ-ధూల్ పేట్

మానసిక ప్రశాంతతతో ప్రమాదాలు నివారించవచ్చని సుల్తాన్ బజార్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ కే. సుధాకర్ అన్నారు. గౌలిగూడ ఆర్టీసీ హైదరాబాద్-1 డిపోలో ప్రమాదరహిత వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. డ్రైవర్లకు మానసిక ప్రశాంతత, దృఢంగా ఉండటం చాలా అవసరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. డిపో మేనేజర్ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు సంకేతా లు సంపూర్ణ పాటించినప్పుడే ప్రమాదరహిత డ్రైవింగ్ సాధ్యమన్నారు. విధి నిర్వహణలో సుదీర్ఘంగా కాలంగా ఎలాంటి ప్రమాదాలు లేకుండా విధులు నిర్వహించిన డ్రైవర్లు పీలక్ నాయక్, ఎంఎంరెడ్డి, జలీల్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో సూపర్వైజర్ లు ధనంజయ రావు, ట్రాఫిక్ సిఐ స్వాతి, వెంకన్న, ఎన్ ఎ రెడ్డి, బుచ్చి రెడ్డి, డిపో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్‌లు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఫలారం బండ్ల ఊరేగింపు



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజక వర్గంలో అమ్మవారి ఫలారం బండ్ల ఊరేగింపు ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నగేష్ ముదిరాజ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగను అత్యంత ఘనంగా నిర్వహించామని అమ్మ వారు రాష్ట్ర ప్రజలను చల్లగా చూడాలని కోరారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత వరం

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు కొండంత వరమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజక వర్గంలోని గాంధీనగర్ డివిజన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని ద్వారా చెక్కులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ముఖ్యమంత్రి సహాయని పేదలకు కొండంత భరోసానిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌ల అధ్యక్షులు రాకేష్ కుమార్, శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ముఠా నరేష్, ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా మీడియా ఇంచార్జ్ ముచ్చుకుర్తి ప్రభాకర్, పాశం రవి, కిరణ్, ఎస్టి ప్రేమ్, రాజ్ కుమార్, సంతోష్, చందు, పుష్ప , స్వరూప, సరస్వతి, గోవర్ధన్, గౌస్ భాయ్, శివ ముదిరాజ్, బలవంత రాజ్, సంధ్యారాణి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్‌ను ప్రక్షాళన చేయాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్‌ను తక్షణమే ప్రక్షాళన చేసి విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చూడాలని నిరుద్యోగ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న బండ విద్యావతి గత 11 సంవత్సరాలుగా ఒకే చోట తిష్టవేసి అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. కేవలం పేపర్లకే పరిమితమైన నర్సింగ్ కాలేజీలను ఒక్కో వ్యక్తి 5 నుంచి 20 వరకు కాలేజీలను నడుపుతూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తూ, విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురి చేస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారని ఆరోపించారు. కాలేజీల్లో సరిగ్గా ఇన్‌స్పెక్షన్ చేయకుండా ఆయా కళాశాలల కరస్పాండెట్లతో కుమ్మక్కై కోట్లాది రూపాయలను అక్రమంగా సంపాదించా రని, ఈవిషయంలో గతంలో కూడా రెండు సార్లు బండా విద్యావతి సస్పెండ్ అయ్యా రని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర సచివాలయ ఉన్నతాధికారులను, పార్టీ పెద్దలను, మంత్రులను ప్రసన్నం చేసుకుని మళ్లీ తిరిగి అదే పోస్టులోకి వచ్చారని తెలిపారు. నర్సింగ్ కాలేజీలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలతో పలువురు విద్యార్థులు కూడా ఆత్మహత్యలు చేసుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్‌లో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలపై విచారణ జరిపి, ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటికి కారకురాలైన బండ విద్యావతిపై విచారణ జరిపి చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు శివకృష్ణ, అడ్వకేట్ వంశి, మధు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ,ఎస్సీ,ఎస్టీలకు అన్ని రంగాలలో తీవ్ర అన్యాయం

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లా పెళ్లి అంజి



నవతెలంగాణ-ముషీరాబాద్

పార్లమెంట్‌లో 73శాతం ఉన్న బీసీలు ఎస్సీ, ఎస్టీలు వ్యాపార రంగంలో ఆర్థిక రంగంలో రాజకీయ రంగంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లా పెళ్లి అంజి అన్నారు. మంగళవారం బీసీ విద్యార్థి సంఘం నాయ కుల సమావేశంలో జిల్లా పెళ్లి అంజి హాజరై మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ 20 మంది కలిసి తయారు చేస్తే అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ లేకపోవడం ఎంత అన్యాయం జరుగుతుందో ఇది నిదర్శనమన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడడం జరిగిందని బీసీ లకు కులగణన చేయాలని మాట్లాడడం చాలా గర్వకారణం రాష్ట్ర ప్రభుత్వం, రాహుల్ గాంధీని ఆదర్శంగా తీసుకుని తక్షణమే రాష్ట్రంలో ఆందోళనలు చేయాలని గత 50 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యలపై ఎంపీ ఆర్.కృష్ణయ్య అలుపెరుగక పోరాటం చేస్తున్నారని కృష్ణయ్య నేతృత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్ని రంగాలలో సమన్యాయం అయ్యేవిధంగా పోరాటాలు చేస్తామని తెలిపారు.

ఓబీసీల హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

● మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు



నవతెలంగాణ-అంబర్‌పేట

ఓబీసీల హక్కులను గత ఎన్నికలు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ఆ వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని మాజీమంత్రి సి కృష్ణ యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు అన్నారు. మంగళవారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమాల ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో లక్డికాపూల్ కలెక్టర్ ఆఫీస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులగనన బీసీ రిజర్వేషన్లు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అదేవిధంగా ఎన్నికల హామీ ఇచ్చిన విధంగా బీసీలకు కార్పొరేషన్ లోన్లు వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం హైదరాబాద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బందిని రెగ్యూలర్ చేయాలి

కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయం ముందు జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల మహాధర్నా



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న వివిధ రకాల సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నరసింహ అన్నారు. మంగళవారం కోఠిలోని కమిషనర్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 17514 ఎన్‌హెచ్‌ఎంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, శ్రమ దోపిడికి గురవుతూ పేద ప్రజల ఆరోగ్యమే పరమావధిగా భావించి పని చేస్తుంటే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించకుండా కాలయాపన చేయటాన్ని విమర్శించారు. గత ఏడు నెలల పీఆర్సీ బకాయిలు, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, హెల్త్ కార్డ్స్, ఇన్సూరెన్స్, ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు గడుస్తున్న ప్రభుత్వ ప్రభుత్వ సంస్థల్లో దిగులకు పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్స్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు 4వ తరగతి సిబ్బందికి రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 4వేల మందికి 510 జీవోలో అన్యాయం జరిగింది. వారికి న్యాయం చేయాలని జీవో సవరించి పెంచకుండా గత ప్రభుత్వం లాగానే దాట వేస్తుందని, వెంటనే కనీస వేతనాలు పెంచాలని ధర్నా ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నూకల అంజి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే హెచ్ఆర్డీపీ పాలసీ ఇంప్లిమెంటేషన్ చేయాలని ప్రభుత్వాన్ని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, జ్యోతి, శ్రావణ్, అనిత, తిరుమలేష్, సంతోష్, కరుణ, దేవనబోయిన బాపు యాదవ్, రాజ్ కుమార్, మల్లేష్, మునీర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



గోల్నాక డివిజన్ పరిధిలోని మంగళవారం గోవింద్ నగర్‌లో ఏర్పాటు చేసిన బోనాల వేడుకల్లో పాల్గొన్న సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

బోనాల ఉత్సవాల సందర్భంగా అంబర్‌పేటలోని మహంకాళి ఆలయంలో తూముకుంట నరసింహ చే బలిగంప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ఈఎన్టి ఆస్పత్రి అధ్యక్షులు తూముకుంట రాజు, తూముకుంట లక్ష్మణ్, వెంకటేష్, కృష్ణ, శ్రీనివాస్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



పక్కాగా లెక్కలు..



జీఐఎస్ మ్యాపింగ్‌లో భాగంగా ప్రారంభమైన క్షేత్రస్థాయి సర్వే



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ఆస్తుల ద్వారా ఆదాయ వనరులు పెరిగే విధంగా చర్యలు మొదలు పెట్టారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఓపెన్ స్థలాలు ఎన్ని ఉన్నాయి, ఏవైనా అన్యాక్రాంతం అయ్యాయా, పార్కులు, చెరువులు ఎన్నివున్నాయి వాటి పరిస్థితి ఏంటీ, వీటికి తోడు జీహెచ్ఎంసీకి నెలసరి కిరాయి సక్రమంగా వసూలు అవుతున్నాయా, లీజ్ పీరియడ్ ముగిసిందా, ఇంకెత్తకాలం ఉందోనని పలు అంశాలపై జీహెచ్ఎంసీ అధికారులు ఆరా తీస్తున్నారు. కమ్యూనిటీ భవన్‌లు, మోడల్ మార్కెట్‌లు ఎన్ని ఉన్నాయి, వాటిని దేనికోసం ఉపయోగిస్తున్నారో ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలను సేకరించిన అనంతరం జీహెచ్ఎంసీకి సంబంధించిన వివిధ రకాల ఆస్తుల వివరాలన్నింటినీ డిజిటలైజేషన్ చేస్తారు. ఇందులో భాగంగానే గ్రేటర్ హైదరాబాద్‌లో జీఐఎస్ (జీయో ఇన్ఫర్మేషన్ సిస్టమ్) మ్యాపింగ్ సర్వేను మొదలుపెట్టారు.

మొదలైన ఇంటిగ్రేటెడ్ జీఐఎస్ సర్వే

జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తులు, యుటిలిటీల జీఐఎస్ మ్యాపింగ్ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే మంగళవారం ప్రారంభమైంది. అర్బన్ ప్లానింగ్‌లో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ జీఐఎస్ సర్వేను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని అన్ని ఆస్తులు, యుటిలిటీల వివరాలు కచ్చితంగా మ్యాపింగ్ చేయడం వల్ల భౌగోళికంగా గుర్తించడం, పన్నుల వసూలు కూడా సులభమవుతుంది. ఆస్తిపన్నుకు సంబంధించి సమస్యలను పరిష్కారంలోనూ ఇది ఉపకరిస్తుందని, ఆన్‌లైన్ చెల్లింపులు మరింత సులభతరం అవుతాయని చెప్పవచ్చు.

లెక్కల్లోకి రోడ్లు, పార్కులు...

హై రిజల్యూషన్ మ్యాపింగ్ వల్ల రోడ్లు, పార్కులతో పాటు ఇతరత్రా సదుపాయాల వివరాలు స్పష్టంగా తెలియనున్నాయి. క్షేత్రస్థాయి సర్వేను మంగళవారంన పలు సర్కిల్ ప్రారంభమైంది. ఉప్పల్, హయత్ నగర్, హైదర్ నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్బీ కాలనీ, మియాపూర్, చందానగర్ ఏరియాల్లో ఫీల్డ్ సర్వే నిర్వహిస్తున్నారు. నగరంలోని మిగతా అన్ని ప్రాంతాల్లో సర్వేను కొనసాగిస్తారు. ఆ తర్వాత ప్రత్యేకంగా ఇంటింటికి వెళ్లి డ్రోన్ సర్వే ప్రకారంగా సరి చూసి నిర్ధారణ చేస్తారు.

సర్వేకు నగరవాసులు సహకరించాలి

జీహెచ్ఎంసీ చేపట్టిన సర్వేకు నగరవాసులు సహకరించాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరారు. సర్వే సిబ్బంది కోరిన సమాచారాన్ని తెలియజేయాలని కోరారి. సర్వే వివరాలు అత్యంత గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే కోసం వచ్చే సిబ్బందికి భవన నిర్మాణ అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, లేటెస్ట్‌గా చెల్లించిన ఆస్తి పన్ను రసీదు, నల్లా బిల్లు, విద్యుత్ బిల్లు, యజమాని ఐడీ వివరాలు, ట్రేడ్ లైసెన్స్ నంబర్ (కమర్షియల్ భవనాల) వివరాలు అందించి సహకరించాలని కోరారు.

కనీస వేతనం అమలు చేయాలంటే అరెస్టులా..?

అక్రమ అరెస్టులను ఖండించిన సీఐటీయూ





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆశా, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అర్ధరాత్రి కార్మికుల ఇండ్ల మీద పడి అక్రమ అరెస్టులకు పాల్పటం దారుణమని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్ అన్నారు. మంగళవారం జిల్లా పరిధిలోని మేడ్చల్, శామీర్‌పేట, మల్కాజిగిరి, బాలానగర్, కీసర, చీర్యాల, దుండిగల్, ఉప్పల్ ఏరియాల్లో ఆశాలు, గ్రామపంచాయతీ కార్మికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచి ధర్నాకు వెళ్లకుండా అడ్డుకోవడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. పారితోషికం వద్దు, ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు అమలు చేయాలని 15 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌కు బయల్దేరుతున్న ఆశాలు, గ్రామపంచాయితీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషనలో నిర్బంధించడం అన్యాయం అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి జీవో 51ని ఉపసంహరించుకోవాలనీ, మున్సిపల్ కార్మికుల వలె కనీస వేతనం జీవో 60 ప్రకారం రూ.16,600 అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నకు బయల్దేరుతున్న కార్మికులను అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టులు నిర్బంధాలతో ఉద్యోగ కార్మికుల ఉద్యమాన్ని ఆపలేరనీ, ఈ విషయం ప్రభుత్వం తెలుసుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ పదేండ్ల పాలన నిర్బంధాలతోనే సాగడంతోనే ఆయనకు ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ కార్మికుల పక్షపాతిక వ్యవహరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, కిష్టప్ప, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.హేమలత, దాదాపు 150 మంది ఆశాలు, గ్రామపంచాయతీ వర్కర్స్‌ను అరెస్టు చేసిన వారిని భేషరతుగా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ కథనానికి స్పందన.. ఫ్లెక్సీల తొలగింపు



నవతెలంగాణ-ముషీరాబాద్

నవతెలంగాణ స్పందన



ప్రమాదకరంగా ప్రచార ఫ్లెక్సీలు అని నవ తెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురించిన ప్రత్యేక కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. వెంటనే ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా ఉన్న ప్రచార ఫ్లెక్సీలను పూర్తిస్థాయిలో తొలగించారు. ఇకపై ప్రచార ఫ్లెక్సీలు హోర్డింగులు ఖాళీ ప్రదేశాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేని ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న వాటిని తొలగిస్తామన్నారు.

మహిళా పాత్రికేయురాలు ఆరిఫా ఖానమ్‌కు సన్మానం



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆరిఫా ఖానమ్ పేదలు, పీడిత, తాడిత వర్గాల గొంతుకగా నిలిచిన పాత్రికేయురాలని 'మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే)' తెలంగాణ సంస్థ కొనియాడింది. ఇటీవల నగరానికి వచ్చిన ఆమెను ఎంపీజే ఫైనాన్స్ సెక్రెటరీ హమీదుద్దీన్ షకీల్ ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ప్రతికూల పరిస్థితుల్లో సైతం 'ది వైర్' ద్వారా, ఆమె ప్రజల పక్షాన నిలబడడం అభినందనీయమన్నారు.

పైనీరు ఆలయ ఘటాల ఊరేగింపు



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీలో ఘటాల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏనుగు అంబారీపై దూద్ బౌలీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయం ఘటం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో దూద్ బౌలీ, హుస్సేనీ అలం కమాన్, ముర్గీచౌక్ బజార్ మీదుగా సామూహిక ఊరేగింపు కొనసాగించాలని దేవాలయ కమిటీ ప్రతినిధులు గౌరీటి ఆనంద్ గుప్తా, వెంకటాచల ముదిరాజ్, నరసింహ రావులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది..



● గవర్నర్ రాధాకృష్ణన్

నవతెలంగాణ-ధూల్‌పేట్

తెలంగాణ సంస్కృతి చాలా గొప్పదని గవర్నర్ రాధాకృష్ణన్ అన్నారు. జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పగుడాకులు బాలస్వామి ఆధ్వర్యంలో ఆయనను రాత్రి కలిసి వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు చాలా మంచివారన్నారు. ఇక్కడి సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పవని కొనియాడారు. ఇక్కడ జరుగుతున్న బోనాల మాదిరిగానే తమ సొంత రాష్ట్రం తమిళనాడులో కూడా ఉత్సవాలు జరుగుతాయని గుర్తు చేశారు. జారఖండ్, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల ఆచార వ్యవహారాలు ఆకట్టుకున్నాయని చెప్పారు. దేశానికే ఆర్థిక రాజధాని అయిన ముంబాయి కేంద్రంగా మహారాష్ట్రకు సేవ చేసే అవకాశం కూడా లభించడం అదృష్టంగా భావిస్తానన్నారు. గతంలో జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నేతలు అందించిన డైరీ ఇంకా తన వద్ద భద్రంగా ఉందన్నారు. మాజీ గవర్నర్ సౌందర రాజన్ రాజీనామా చేయడంతో ఇన్‌చార్జి గవర్నర్‌గా ఉన్న ఆయన దాదాపు ఐదు నెలలుగా తెలంగాణ రాష్ట్రానికి అందించిన సేవలను జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బాలస్వామి గుర్తు చేశారు. గతంలో ఇచ్చిన డైరీ ఉందని గవర్నర్ చెప్పడం గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి బుర్ర వెంకటేశం, ఏడీసీతో కలిసి గవర్నర్‌కు సత్కరించి, పుస్తకం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రయాణికులకు బస్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలను కల్పిస్తాం

● రంగారెడ్డి రీజినల్ మేనేజర్ జి.శ్రీలత



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రయాణికుల సౌకర్యం పెంచడానికి మౌలిక సదుపాయాలను కల్పిస్తామని రంగారెడ్డి రీజియన్‌లో మహాలక్ష్మి మహాలక్ష్మి పథకంలో ఇప్పటివరకు రెండు కోట్ల మంది మహిళ ప్రయాణికులు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారని రంగారెడ్డి రీజినల్ మేనేజర్ జి.శ్రీలత అన్నారు. మంగళవారం ఎంజీబీఎస్ బస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సిబిఎస్ లోని రెస్ట్ రూమ్ లలో 34 ఏసీలు, జూబ్లీహిల్స్ బస్ స్టేషన్‌లో రెస్ట్ రూములలో 16 ఏసీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉద్యోగులకు మరింత మెరుగైన సౌకర్యాల కోసం అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత సంవత్సరం రంగారెడ్డి రీజియన్‌లో 280 కొత్త బస్సులను ప్రవేశపెట్టామని అందులో 34 ఏసీ బస్సులు, 29 నానేసి హైబ్రిడ్ బస్సులు, పది రాజధాని ఏసీ బస్సులు, 131 సూపర్ లగ్జరీ బస్సులు, 17 డీలక్స్ బస్సులు, 51 ఎక్స్‌ప్రెస్ బస్సులు, 5 పల్లె వెలుగు బస్సులు ఉన్నాయ ని తెలిపారు. మహాలక్ష్మి స్కీం వల్ల పెరిగిన డిమాండ్ అనుగుణంగా 60 కొత్త ఎక్స్ ప్రెస్ బస్సులను, 40 పల్లెవెలుగు బస్సులను కొనుగోలు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న ఎలక్ట్రిక్ బస్సుల దృశ్య ఎలక్ట్రిక్ బస్సుల ఛార్జింగ్ కోసం హైదరాబాద్ టు డిపోలో 16 చార్జింగ్ స్టేషన్ లు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్‌లో 10 చార్జింగ్ స్టేషన్ లు ఏర్పాటు చేసే ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు



నవతెలంగాణ-అంబర్‌పేట

బెంగళూరులో ఆగస్టు 4న జరిగే 10వ షోటోఖాన్ జాతీయ కరాటే పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుండి జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు 19 మంది పోటీలకు ఎంపికైనారు. వారిలో 12 బాలికలు, 7 బాలురు ఎంపిక అయినట్లు జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జిఎస్.గోపాల్ రెడ్డి తెలిపారు. వీరందరిని సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ బీ.ఆనంద్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. దేశానికి విద్యార్థులే వెన్నెముక విద్యార్థుల ఆటపాటల్లో ప్రావీణ్యం పొందుతే వారి బాల్యం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందని పిల్లలకు చదువులతో పాటు ఆటలు కూడా ఎంతో అవసరమన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని నేటి రోజులలో బాలికలకు ఆత్మ రక్షణ విద్యలో ఎంత అవసరమని మొన్న బెంగళూరులో జరిగిన సంఘటనలు దేశంలో రాకూడదని మహిళలు బాలికలు ఆత్మ రక్షణ విద్యలు నేర్చుకోవడం ఎంతో మంచిదని మన తెలంగాణ రాష్ట్రానికి పథకాలు సాధించి రాష్ట్ర గౌరవాన్ని నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ ఇన్‌స్పెక్టర్ జి.కిషన్, అకాడమీ బ్లాక్ బెల్ట్ లు జి.అమృత రెడ్డి, జి గణ సంతోషిని రెడ్డి, అనగా, షైనీ, యోగిని, నీది వర్మ, అవిఘ్న వెంకటరెడ్డి, అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

రోజూ నడిస్తే...

కోవిడ్-19 అనంతరం ప్రజలంతా ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ వహిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండడానికి మంచి ఆహారంతో పాటు తగిన వ్యాయామాలు, యోగ వంటివి అలవాటు చేసుకుంటున్నారు. వీటన్నింటితో పాటు రెగ్యులర్ వాకింగ్ కూడా చేస్తున్నారు. అయితే, వాకింగ్ విషయంలో కొన్ని చిట్కాలు పాటిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతి రోజూ వాకింగ్ చేసేవారు వేగంగా నడిస్తే ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రోజు పదివేల అడుగులు నడవడం వలన గుండె సంబంధిత సమస్యలు ఉండవు. అకాల మరణం ముప్పు కూడా తగ్గుతుందని సూచిస్తున్నారు. బీపీ, కొలెస్ట్రాల్ కూడా తగ్గుతాయి. వాకింగ్ చేయడం వలన ఒత్తిడి కూడా పూర్తిగా తగ్గిపోతుంది. నరాల పనితీరు కూడా బాగుంటుంది. వేగంగా నడిస్తే మెదడు పని తీరుపై అనుకూల ప్రభావం కనబడుతుంది. మూడ్ స్వింగ్స్,



జ్ఞాపకశక్తి, మంచి నిద్రకి కూడా మేలు చేస్తుంది. వేగంగా నడవడం వల్ల మరేన్నో ఉపయోగాలు ఉంటాయి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం..

మీరు టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించుకోవాలనుకుంటే ప్రతిరోజూ గంటకు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ కిలోమీటర్ల వేగంతో నడవాలని సర్వేలో తేలింది. వాకింగ్ వేగం ఎంత ఎక్కువగా ఉంటే.. దానితో సంబంధం ఉన్న ప్రమాదం అంత తక్కువగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. గంటకు 3-5 కిలోమీటర్ల సగటు నడక వేగం టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని 15శాతం తగ్గిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. వేగంగా నడవటం వల్ల మధుమేహం నివారణలో సహాయపడటమే కాకుండా అనేక సామాజిక, మానసిక, శారీరక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది.

మాములు నడక కంటే వేగంగా నడవటం వల్ల గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ముప్పు నుంచి రక్షించుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. వేగంగా నడవటం వల్ల ఏరోబిక్ ఆక్టివిటీ పెరుగుతుంది. బీపీ, కొలెస్ట్రాల్ సైతం నియంత్రణలో ఉంటాయి. వాకింగ్ చేయడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది. నరాల పనితీరు మెరుగుపడుతుంది. వేగంగా నడవటం వల్ల మెదడు పనితీరుపై అనుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది మూడ్ స్వింగ్స్, జ్ఞాపకశక్తి, నిద్రకు మేలు చేస్తుంది. ■

నేలపట్ల మట్టి తల్లి

కళ ప్రజల కోసం కనాలి... ప్రజా ఆశయాల కోసం కనాలి... ఇదే లక్ష్యంతో ప్రజల కోసం తన గళాన్ని వినిపిస్తోంది. ప్రజా గొంతుకై ఉద్యమ, విప్లవ వీరుల పాటలు పాడుతోంది. తన పాటలతో ప్రజల్ని చైతన్యం చేస్తుంది. చౌటుప్పల్ మండలం, నేలపట్ల గ్రామానికి చెందిన ప్రముఖ గాయని పబ్బతి స్వాతి గౌడ్. ప్రజా గాయినిగా మంచి గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

స్వాతి తండ్రి పుల్లయ్య. గ్రామంలో వ్యవసాయం చేస్తూ ప్రజా కళాకారుడిగా ప్రజా నాట్యమండలిలో పని చేస్తూ, ప్రజలతో మమేకమై పాటలు పాడుతుంటాడు. అతనికి నలుగురు కూతుళ్లు. మూడో కూతురు స్వాతిపై పుల్లయ్య ప్రభావం పడింది. ఆయన ప్రోత్సాహంతో చిన్నతనం నుండి తాను విద్యనభ్యసించిన ప్రభుత్వ పాఠశాలలో పాటల పోటీలో పాల్గొని బహుమతి అందుకుంది. అలాగే చౌటుప్పల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న రోజుల్లో కళాశాల వారు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ పాటలు పాడి పలువురి ప్రశంసలు పొందింది. ప్రస్తుతం మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి డయోగ్నస్టిక్ కంప్యూటర్ ఉద్యోగం చేస్తోంది. ఉద్యోగం చేస్తూనే ప్రజల్ని, వృత్తిదారులను ఆలోచింపజేసేలా చాలా వేదికలపై చైతన్యవంతమైన పాటలు పాడి అందరినీ ఆకట్టుకుంటుంది.

కండ్ల ముందు నిలుపుతోంది

సామాజిక, ప్రజా సంక్షేమం కోసం ఆమె పాట ఉద్యమ బాటై నిలుస్తుంది. ఉద్యమ పాటలే కాకుండా జానపద పాటలు పాడి ప్రజల జీవితాలు ఎలా ఉంటాయో సూచిస్తూ తన గళంతో ఉత్సాహం కలిగిస్తుంది. తన గళాన్ని విస్తృతం చేస్తూ, శ్రామికుల కష్టాలను, పల్లెల బతుకు చిత్రాలను కండ్ల ముందు పెడుతుంది. వీరుల గాథల గురించి పాడే పాటలు మనలో స్ఫూర్తినింపుతాయి. ప్రతి పాటను అలవోకగా పాడే ఆమె స్వరం ఇప్పుడు ఎంతో మందికి దగ్గరవుతోంది. అందుకే ఆమె కళను గుర్తించి పలు స్టూడియోల వారు ఆమె పాడిన పాటలను ఆల్బమ్స్‌గా రూపొందించి విడుదల చేస్తున్నారు.

వీక్షకులకు దగ్గరయ్యింది

రేలారే రేలా పల్లె పాట, సరంగదరియా తదితర కార్యక్రమాలలో పాల్గొని తన గానంతో వీక్షకులకు దగ్గరయ్యింది. వివిధ టీవీ ప్రసారమాధ్యమాల్లో పాల్గొంటూ మధుప్రియతో కలిసి తన స్వరాన్ని కలిపింది. ఎంతో మంది ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. పల్లెటూర్లలో వ్యవసాయమే ప్రజల ప్రధాన వృత్తి. రైతే దేశానికి వెన్నుముక అన్నారు. అలాంటి రైతులు వరి నాట్ల వేసేటపుడు వారితో కలిసి పదం పాడుతూ కదం తొక్కుతుంది. 'ముసురు ముసురు పెట్టే / మురిపెంగ కురిసే వాన / గట్లపైన కురిసే / గలగల పారెను వాన' అంటూ వారి శ్రమను మర్చిపోయే పాటలు వినిపిస్తోంది. ఈ పాట పల్లెల్లో చిగురించిన ప్రకృతిని ఒడిసి పడుతుంది.

రైతుల ఎద గోస

'మట్టిని తాకే చేతులకు / పరి పరి దండాలో' అంటూ పల్లెల్లో వ్యవసాయమే జీవన వృత్తి కాబట్టి అలాంటి రైతుల ఎదలోని బాధలను ఈ పాటలో తెలియజేస్తుంది. 'ఉద్యమాల యుద్ధభేరి సాంబశివుడురో / అమ్మానాన్నలు పెట్టిన పేరు ఐలన్న రో'.... తెలంగాణ గొప్ప ఉద్యమకారుడుని జీవితం గురించి తెలియజేసిన ఈ పాట అమరుల త్యాగాలను తెలియజేస్తోంది. నాటి దేశ్‌ముఖ్‌ల అరాచకాలను గుర్తుచేస్తూ ఉద్యమం అంటే ఏంటో చూపిస్తుంది. 'పచ్చని మా పల్లెటూరు / పాడిపంటల సెలయేరు / కరువుకోనల్లో చిక్కిందో / ఎండినావో బొడ్డు మల్లెలార' అంటూ ప్రకృతి విలయతాండవాన్ని, కరువు రక్కసి రావడం, వర్షాలు పడకుండా పంటలు పండక పోవడంతో రైతు పడే బాధలను తెలియజేసే ఈ పాట ఈమె నోటి నుండి వింటే కన్నీరు పెట్టుకోవల్సిందే.



త్యాగాలని తలపిస్తూ...

నేలపట్ల మట్టి గర్భాన/పుట్టిన చిన్న నలుసుని/ ఉట్టిపడుతుందమ్మా/నాలో నా మట్టి వాసన/ పల్లెదనం నా గొంతు వాసన/ అంటూ తాను పుట్టిన ఊరిని గుర్తు చేసుకుంటూ పాడిన ఈ పాట విన్న తర్వాత కందాల రంగన్న, కాచం కృష్ణమూర్తి వంటి వీరులు గుర్తుకు వస్తారు. నిజానికి నేలపట్ల మట్టి గర్భంలో జన్మించిన ఆ వీరుల త్యాగాన్ని వినిపిస్తూ, తలపిస్తూ నేలపట్ల మట్టి పాట అయింది స్వాతి. 'ధనాధనా డప్పుల్లో / దరువు లేస్తాము / బతుకమ్మ నీ చుట్టూ ఆటలాడెదము' అంటూ తెలంగాణకే పరిమితమైన స్త్రీల పండుగలలో బతుకమ్మ పండుగ ఎంతో ముఖ్యమైంది. పల్లెటూర్ల ఆనందాన్ని, తెలంగాణ ప్రతీక అయిన బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాలను కలిపే అంశాలు ఈ పాటలో మనకు కనబడతాయి. బతుకమ్మ పాటగా స్త్రీల నాలుకలపై తాను పాడిన ఈ పాట నిత్యం నర్తిస్తూనే ఉంటుంది.

విశేషమైన ప్రజాధరణ

'ఆడోల్లకు ఏమిచ్చే/ అంగట్లో అమ్మేత్తే / వరల్డ్ బ్యాంకుకి / పోరు బాటలో పోదాము' అంటూ గద్దర్ రాసిన పాట ఎంతో మందిని చైతన్య పరిచింది. ఇదే పాటను తన గళంతో వినిపించి మరోసారి పాటై పూసింది. స్త్రీలపై జరుగుతున్న దాడులను, చట్టాలు ఉన్నా హింసించే వారికి చుట్టాలుగా మారాయని, పోరు బాటలో పోవడమే పరిష్కారమని వినిపించిన ఈ పాటలో మహిళల ఆవేదన వినిపిస్తుంది. కాబట్టే విశేషమైన ప్రజాధరణ పొందింది. చాలా కాలం నుండి సోషల్ మీడియా, ఇనిస్టాగ్రామ్, యూట్యూబ్‌తో పాటు అనేక ప్రసార మాధ్యమాలలో తన పాటలతో చైతన్యాన్ని చాటుతున్న ఉద్యమ గాయని స్వాతి. తన విప్లవ గేయాలతో నేలపట్ల మురిసిపోయేలా, ప్రజలు గర్వించేలా చేస్తోంది.

- బూర్గు గోపికృష్ణ,
7995892410.



మహానగరంలో దారుణాలు

నవతెలంగాణ-ఓయూ/వనస్థలిపురం

మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా నేరాలు మాత్రం ఆగడం లేదు. తాజాగా రాష్ట్రంలో రెండు వేర్వేరు చోట్ల దారుణాలు చోటుచేసుకున్నాయి. కదులుతున్న బస్సులో ఓ మహిళపై అర్ధరాత్రి డ్రైవర్ లైంగికదాడికి పాల్పడగా.. మరో ఘటనలో యువతిపై స్నేహితులే దారుణానికి ఒడిగట్టారు.

ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ తొమ్మిదేండ్ల కుమార్తెతో కలిసి ఏపీలోని ప్రకాశం జిల్లా పొదిలి వెళ్లడానికి హరికృష్ణ ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో సీటు రిజర్వు చేసుకుంది. సోమవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ నుంచి ప్రకాశం జిల్లాకు బస్సు బయల్దేరింది. సీటు నెంబర్ 1లో కూర్చున్న ఆ మహిళతో డ్రైవర్ కృష్ణ మాటలు కలిపాడు. మార్గ మధ్యలో మెదక్ జిల్లా చేగుంట వద్ద డిన్నర్ కోసం బస్సును ఆపారు. అప్పుడే డ్రైవర్ పథకం వేశాడు. తల్లీబిడ్డలకు 1వ నెంబర్ సీటు సరిపోవడం లేదు.. వెనకాల ఫుల్ బెర్త్ సీటు ఖాళీగా ఉంది, వెళ్లి అక్కడ కూర్చోండని నమ్మబలికాడు. మరో డ్రైవర్ సైదయ్యకు డ్రైవింగ్ అప్పగించాడు. అర్ధరాత్రి 12 దాటాక ప్రయాణి కులందరూ నిద్రలో ఉండగా.. డ్రైవర్ కృష్ణ ఆ మహిళ వద్దకు వెళ్లి నోటిపై బెడ్ షీటుతో అదిమిపట్టి బలవంతంగా లైంగికదాడి చేశాడు. గమనించిన తోటి ప్యాసింజర్లు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. విషయం పసిగట్టిన డ్రైవర్ మార్గ మధ్యలో బస్సు నుంచి దూకి పారిపోయాడు. అప్రమత్తమైన పోలీసులు బస్సును హైదరాబాద్ తార్నాక ప్రాంతంలో ఛేజ్ చేసి పట్టుకున్నారు. డ్రైవర్ సైదయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధిత మహిళను వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సెక్షన్ 64 (1) బీఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై ఇద్దరు యువకుల లైంగికదాడి

వనస్థలిపురంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై ఇద్దరు స్నేహితులు లైంగికదాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం వచ్చింది. ఈ సందర్భంగా ఆమె సోమవారం రాత్రి తన చిన్ననాటి మిత్రుడు గౌతమ్ రెడ్డి, మరో స్నేహితుడితో కలిసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓంకార్‌నగర్‌లో గల బొమ్మరిల్లు బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చింది. అక్కడ వారు మద్యం సేవించారు. అనంతరం అక్కడే ఉన్న రూంలో మత్తులో ఉన్న యువతిపై ఇద్దరు స్నేహితులు లైంగికదాడి చేశారు. కొంత సమయం తర్వాత స్పృహలోకొచ్చిన యువతి తాను మోసపోయినట్టు గుర్తించి.. తన ఇతర స్నేహితులకు ఫోన్ చేయగా వారు ఆమెను ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. అనంతరం బాధితురాలు వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కేరళలో పెను విషాదం

(మొదటిపేజి తరువాయి)

గంటలకు, తిరిగి 4.30 గంటలకు విరిగిపడిన కొండచరియల కింద వందలాది మంది చిక్కుకుపోయారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల సంతాప దినాలను ప్రకటించింది. రక్షణ భద్రతా దళానికి చెందిన 200 మంది సైనికులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టాయి. కేరళ విపత్తు నిర్వహణ దళాలు, అగ్నిమాపక బృందాలు కూడా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. అయితే భారీ వర్షాల కారణంగా సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోంది. క్షతగాత్రులకు తక్షణ సేవలు అందించడానికి వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు. సులూర్ వైమానిక స్థావరం నుంచి రెండు హెలికాప్టర్లను కూడా పంపారు.



శిథిలాల కింద ఉన్న మృతదేహాలను గుర్తించి బయటికి తీసేందుకు ప్రత్యేక దళాన్ని వినియోగించారు. శిక్షణ పొందిన సైనిక జాగిలాలను కూడా పంపారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభ్యర్థన మేరకు ప్రత్యేక దళాన్ని పంపాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విధ్వంసం కారణంగా జిల్లాలోని చూరాల్‌మలా ప్రాంతం బాగా దెబ్బతిన్నది. అనేక ఆవాసాలు నేలమట్టమయ్యాయి. అట్టమాలా, నూల్‌పుజా గ్రామాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముండక్కై గ్రామం ఆనవాలు కూడా కన్పించడం లేదు. వాయనాడ్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలను నేలపై వరుసగా ఉంచడంతో వాటిని గుర్తించేందుకు బంధువులు ఆరాటపడుతున్న దృశ్యాలు అందరినీ కలచివేస్తున్నాయి. వాయనాడ్‌లో 45 శిబిరాలను ఏర్పాటు చేశామని, వాటిలో మూడు వేల మందికిపైగా ఆశ్రయం కల్పించామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 118 సహాయ శిబిరాలను ఏర్పాటు చేశామని, వాటిలో 5,500 మందికిపైగా ప్రజలు తలదాచుకుంటున్నారని వివరించారు. 34 మృతదేహాలను గుర్తించామని, 18 మృతదేహాలను బంధువులకు అప్పగించామని ఆయన చెప్పారు. గుర్తుతెలియని మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రెండు లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తారు. గాయపడిన వారికి యాభై వేల రూపాయల చొప్పున ఇస్తారు. ప్రతిపక్ష నేత, వాయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. బాధితులను ఆదుకునేందుకు, వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నష్టపరిహారాన్ని పెంచాలని లోక్‌సభలో ప్రభుత్వాన్ని కోరారు. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. వాయనాడ్, పశ్చిమ కనుమలలో కొండచరియలు



విరిగిపడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని అంటూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాన్ని సాధ్యమైనంత వరకూ తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సహాయక చర్యల కోసం సైన్యాన్ని పంపాలని కేరళ ప్రభుత్వం కోరడంతో కేంద్రం ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌కు చెందిన రెండు బృందాలను పంపింది. బాధితులకు సాయం చేయడానికి నౌకాదళానికి చెందిన 30 మంది గజ ఈతగాళ్లను రప్పించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేదితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పినరయితో ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు. కేంద్రం నుండి అవసరమైన సహాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా పినరయితో మాట్లాడారు. సీఎం సహాయ నిధుల నుండి ఐదు కోట్లు విడుదల చేయాలని స్టాలిన్ ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బందిని వెంటనే కేరళ పంపుతున్నట్లు చెప్పారు.

యుద్ధప్రాతిపదికన కేంద్రం సహాయాన్ని అందించాలి

(మొదటిపేజి తరువాయి)

ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టు ప్రకటనలో తెలిపింది. కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిపుణులు, స్థానికుల సహాయంతో భారీ ఎత్తున రెస్క్యూ ఆపరేషన్ల ప్రారంభించిందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం కూడా యుద్ధ ప్రాతిపదికన సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటా అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని ఆశిస్తున్నట్టు పొలిట్ బ్యూరో ఈ ప్రకటనలో తెలిపింది.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

(మొదటిపేజి తరువాయి)

మంగళవారం సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీ జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని హాజరై మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. అయినా బీజేపీ ఎంపీలు నోరు మెదపలేదని, రాష్ట్ర ప్రజలకు వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులో అన్యాయం చేసిన బీజేపీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలదీయడంతో పాటు నిధుల కోసం ఒత్తిడి పెంచాలని సూచించారు. ప్రజావ్యతిరేక విధానాల్లో బీజేపీపై చేసే పోరాటంలో కాంగ్రెస్ ముందుండాలన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేసే న్యాయబద్ధమైన పోరాటాల్లో తాము సహకరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా పెరుగుతున్న మతతత్వ బీజేపీ ప్రమాదాన్ని ఎదిరించడంలో ప్రగతిశీల శక్తులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు పోరాటాలు ఉధృతం చేయాలని చెప్పారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై నిధులు కేటాయించకుండా ఉత్తుత్తి మాటలు చెబితే ఉపయోగం లేదని, ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన రేషన్‌కార్డులపై వెంటనే జీవో విడుదల చేయాలని కోరారు.

పేద ప్రజలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూముల్లో వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ విధానాలను కాంగ్రెస్ కూడా అనుసరిస్తే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ లబ్దిదారులపై వేటు

రెండున్నరేండ్లలో 1.54 కోట్ల మంది తొలగింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) లబ్దిదారుల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం ఏడాదికేడాది తగ్గిస్తోంది. దాదాపు రెండున్నరేండ్లలో 1,54,20,502 మంది లబ్దిదారులను తొలగించింది. లోక్‌సభలో ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021-22లో 10,79,92,336 మంది రైతులు పీఎం కిసాన్‌లో లబ్దిదారులుగా ఉండగా, వారికి రూ.67,147.36 కోట్లు ఇచ్చారు. 2022-23లో వారి సంఖ్య 10,74,35,548కి తగ్గగా, ఇచ్చే మొత్తం కూడా రూ.58,303.25 కోట్లు తగ్గింది. అంటే ఏడాదిలో 5,56,788 మంది లబ్దిదారులను తొలగించారు. అలాగే పీఎం కిసాన్ మొత్తం కూడా రూ.8,844.11 కోట్లు కోత విధించింది. 2023-24లో లబ్దిదారుల సంఖ్య 9,90,30,164 కి తగ్గింది. అంటే ఏడాదిలో 84,05,384 మంది లబ్దిదారులను తొలగించారు. 2024-25 (2024 జులై 22)లో లబ్దిదారుల సంఖ్య 9,25,71,834కి తగ్గింది. ఏడాదిలో 64,58,330 లబ్దిదారులను తొలగించారు.తెలంగాణలో 2020-21లో 36,37,112 మంది లబ్దిదారులు ఉండగా, 2021-22కి 36,53,195 మందికి పెరిగారు. 2022-23లో 47,83,989 మంది ఉండగా, 2023-24లో 44,88,790 మందికి తగ్గారు. 2024-25 (2024 జులై 22) నాటికి లబ్దిదారుల సంఖ్య 41,28,288 మంది ఉన్నారు.

కేరళ విలయంపై చర్చకు నో

(మొదటిపేజి తరువాయి)

విషాదం జరిగిం దని, కేంద్రం అవసరమైన సహాయం అందించాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు.అయితే ఈ ఘటనపై కేరళకు చెందిన ఎంపీలు తీవ్ర నిరసన వ్యక్తం చేసినప్పటికీ చైర్మెన్ చర్చకు అనుమతి ఇవ్వకుండా దాట వేసేందుకు ప్రయత్నించారు. ముఖ్యమంత్రితో ప్రధాని మాట్లాడినట్టు ధన్కర్ తెలిపారు. ఈ దుర్ఘటనతో యావత్ దేశం విషాదంలో మునిగి పోయిందని, ఉదయం నుంచి సహాయక చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన చర్యలు చేపట్టాయనే అంశంపై చర్చించడానికి ఏమి మిగిలి ఉంది. తమ ఆందోళనను నమోదు చేయడం తప్ప ఇంకేం చేయగలమని కేరళ ఎంపీలతో ధన్కర్ అన్నారు. పెను విషాద ఘటనను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్చకు అనుమతించాలని ఎంపీలు డిమాండ్ చేశారు. దీంతో ఈ వ్యవహారానికి సంబంధించి ఎంపీలు మాట్లాడేందుకు చైర్మెన్ ధన్కర్ అవకాశం కల్పించారు.

కేంద్ర రక్షణ, హెూం, ఆర్థిక శాఖలు చొరవ తీసుకోవాలి : జాన్ బ్రిట్టాస్

వాయనాడ్‌లో పెను విషాదం చోటుచేసుకుందని, కేంద్రం మేల్కొని పని చేయాలని సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిటాస్ కోరారు. కేంద్ర రక్షణ, హెూం, ఆర్థిక శాఖలు ఇందుకు చొరవ తీసుకోవాలని అన్నారు. అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని, సహాయక చర్యల కోసం సైన్యాన్ని పంపాలని తెలిపారు. కొండచరియలు విరిగిపడడంతో సుమారు 500 కుటుంబాలు నష్టపోయాయని, బడ్జెట్‌లో ప్రత్యేక వరద సాయం పొందిన రాష్ట్రాల జాబితాలో కేరళను చేర్చాలని ఎంపీలు వి.శివదాసన్, ఎ.ఎ.రహీమ్, పి.సంతోష్ కుమార్, జోస్ కె.మణి తదితరులు కోరారు. దీనిపై కేంద్ర ఆరోగ్య మంత్రి, సభానాయకుడు జేపీ నడ్డా స్పందిస్తూ.. కేరళకు అవసరమైన సహాయాన్ని కేంద్రం అందజేస్తుందని చెప్పారు.

ప్రభుత్వ ఖజానాకు విరాళాల గండి

(మొదటిపేజి తరువాయి)

సంస్థ లు, అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్ (ఏఓపీలు), బాడీ ఆఫ్ ఇండివిడ్యు వల్స్ (బీఓఐలు), వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు పన్ను మినహా యింపు కోరవచ్చు. చెక్కులు, ఖాతా లకు బదిలీలు, ఎన్నికలబాండ్లు కూడా వీటిలో ఉన్నాయి. 2022-23లో పన్ను మినహాయింపుల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి రూ.3,967.54 కోట్ల గండి పడిందని అంచనా. ఇందులో కార్పొరేట్ పన్ను చెల్లింపుదారులు అందించిన విరాళాలపై సెక్షన్ 80 జీజీబీ కింద ఇచ్చిన మినహాయింపుల కారణంగా ప్రభుత్వం రూ.2,003.43 కోట్ల ఆదాయం కోల్పోయింది. ఈ సెక్షన్ కింద వ్యక్తులు రూ.1,862.38 కోట్లు, కార్పొరేట్ యేతర పన్ను చెల్లింపుదారులు రూ.101.73 కోట్లు మినహాయింపు కోరారు.

జార్ఖండ్‌లో రైలు ప్రమాదం

రాంచీ : జార్ఖండ్‌లో రైలు పట్టాలు తప్పిన ప్రమాదంలో ఇద్దరు మరణించగా, 20 మంది గాయపడ్డారు. చక్రధర్‌పూర్ వద్ద మంగళవారం తెల్లవారు జామున 3:45 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. హౌరా నుంచి ముంబయి వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు 18 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాద వార్త తెలిసిన వెంటనే అధికారులు అక్కడకు చేరుకుని సహాయక కార్యాక్రమాలు ప్రారంభించారు. జంషెడ్‌పూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. రైలుల్లోని 80 శాతం ప్రయాణీకులను బస్సుల ద్వారా చక్రధర్‌పూర్‌కు తరలించారు. మిగిలిన ప్రయాణీకుల కోసం ఒక రెస్క్యూ రైలును ప్రమాద ప్రాంతానికి అధికారులు పంపించారు. ఈ ప్రమాదం కారణంగా ఐదు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. చక్రధర్‌పూర్ వద్ద జరిగిన రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని జార్ఖండ్‌లోని అధికార పార్టీ జేఎంఎం డిమాండ్ చేసింది. రైల్వే మంత్రి సోషల్ మీడియాలో జెఎంఎంపై రీల్స్ పోస్టు చేయడం మాని, రైల్వే భద్రతపై దృష్టి పెట్టాలని కోరింది. 'ఈ ప్రమాదంలో హేమంత్ సోరెన్‌కు గానీ, ఇండియా వేదికకు గానీ ఎలాంటి హస్తం లేదు. మమ్మల్ని ఇడి, సిబిఐతో ట్రాప్ చేస్తామని బెదిరించవద్దు' అని జెఎంఎం ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యతని ఎస్‌పి అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. ఇప్పటికే పేపర్ లీకేజీల సంఖ్యపై రికార్డు సృష్టించిన కేంద్రం రైల్వే ప్రమాదాల్లో రికార్డు సృష్టించాలని కోరుకుంటుందని అన్నారు. రైల్వే రక్షణ, భద్రత కోసం భారీ బడ్జెట్‌ను ప్రకటించినా ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయని అఖిలేశ్ ప్రశ్నించారు.

నవచిత్రం

అందర్నీ అలరించే శివంభజే


మహేశ్వర్‌రెడ్డి మూలి

గంగా ఎంటర్‌టైనర్‌మైంట్స్ బ్యానర్ మీద అప్సర్ దర్శకత్వంలో అశ్విన్ బాబు హీరోగా, దిగంగనా సూర్యవంశీ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శివం భజే'. ఈ చిత్రం ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి మంగళవారం మీడియాతో సినిమా గురించి పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా అని ఈ సినిమాను ఆగస్టు 1న రిలీజ్ చేయడం లేదు. మేం ఒక డేట్ అనుకున్నాం. అది ఆయన బర్త్ డే కావడం యాదృచ్ఛికం. మంచి కంటెంట్‌తో రాబోతున్నాం.
- ఈ కథని ముందుగా నేను విన్నాను. నాకు చాలా నచ్చింది. ఆ తరువాత ఈ కథను అశ్విన్ దగ్గరకు తీసుకెళ్లాం. ఆయనకు కూడా బాగా నచ్చింది. ఐదు నిమిషాల్లోనే ఓకే చెప్పేశారు. ప్రస్తుతం కథను పూర్తిగా రివీల్ చేయలేను. చాలా లేయర్స్ ఉంటాయి. ఇది ఒక జోనర్‌కు మాత్రమే పరిమితం అవుతుందని కూడా చెప్పలేను. ఐదారు జోనర్లు కలిసి తీసిన సినిమాలా ఉంటుంది. అన్ని రకాల అంశాలుంటాయి. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ట్విస్టులను అయితే ఇప్పుడు రివీల్ చేయలేను.
- మ్యూజిక్ డైరెక్టరే ఈ చిత్రానికి హీరో. హిడింబ చూశాక ఆయన్ను తీసుకోవాలని అనుకున్నాం. అద్భుతమైన పాటలు, ఆర్‌ఆర్ ఇచ్చారు. ఈ మూవీని హైదరాబాద్ చుట్టూనే తీశాం. హీరో వెంకటేష్ ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. కంటెంట్ బాగుంటే ఆడియెన్స్ సినిమా చూస్తారు. టికెట్ రేట్లు తక్కువ పెట్టినా, ఎక్కువ పెట్టినా కూడా సినిమా బాగుందనే మౌత్ టాక్ వస్తేనే సినిమాను చూస్తారు. 'ఐబీ కృష్ణమూర్తి' టీమ్‌తో ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నా. కార్తికేయతో ఓ సినిమా ఉంది. ఈ సినిమా హిట్ అయితే తమిళంలోనూ రీమేక్ చేస్తాం. ఇప్పటికే హిందీ డబ్బింగ్ రైట్స్ సేల్ అయ్యాయి. ఈ చిత్రం హిట్ అయితే.. రెండో పార్ట్‌ని కూడా ప్లాన్ చేస్తాం.

పవర్‌ఫుల్ కంటెంట్‌తో
తిరగబడరా సామీ..


మల్కాపురం శివకుమార్

రాజ్ తరుణ్ హీరోగా, ఎఎస్- రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరసామీ'. మాల్వి మల్హోత్రా కథానాయిక. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఆగస్ట్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత మల్కాపురం శివ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ ప్రాజెక్ట్ 2023లో స్టార్ట్ అయ్యింది. డైరెక్టర్ రవికుమార్ కథ చెప్పగానే నచ్చింది. సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశాను. ఈ కథకు రాజ్ తరుణ్ యాప్ట్‌గా ఉంటాడని తీసుకున్నాం. రాజ్ తరుణ్ క్లాస్‌గా ఉంటాడు కదా.. ఇందులో వైలెన్స్ కనిపిస్తోంది అని అందరూ అడుగుతున్నారు. ఎవరైనా సిట్యువేషన్ బట్టే బిహేవ్ చేస్తారు. సైలెంట్‌గా ఉన్న పర్సన్‌ని వైలెంట్‌గా మార్చేది పరిస్థితే. ఈ కథలో కూడా అలాంటి పరిస్థితి ఉంటుంది. ఒక మామూలు కుర్రాడిని తన లైఫ్‌లో వచ్చే పర్స్థితులు ఎలా మార్చాయనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్ తరుణ్ చాలా అద్భుతంగా నటించారు. భార్యా భర్తలు మూడు ముళ్ళ బంధానికి ఏ విధంగా కట్టుబడి ఉండాలనడానికి నిదర్శనం ఈ సినిమా. కంటెంట్ చాలా బావుంటుంది. అందరికీ నచ్చుతుంది. ఇందులో మన్నారా నెగిటివ్ ఫీమేల్ లీడ్ చేస్తుంది. సినిమా అంతా ఉంటుంది. ఈ పాత్రకు తను యాప్ట్. చాలా అద్భుతంగా పోషించింది. దర్శకుడు రవికుమార్ చాలా హార్డ్ వర్క్ చేశారు. చెప్పినదాని కంటే అద్భుతంగా తీశారు. బిజినెస్ పరంగా చాలా బాగా వర్క్ అవుట్ అయ్యింది. అందుకే హ్యాపీగా రిలీజ్ చేస్తున్నాం.బాలీవుడ్‌లో చేస్తున్న కథ చాలా నచ్చింది. నా స్నేహితుడు రాజ్ డైరెక్షన్ చేస్తున్నారు. అలాగే 'రాహు కేతు' అనే వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాం. దీనితోపాటు తిరుపతి బాలాజీపై ఒక వెబ్ సిరీస్ నిర్మాణంలో ఉంది. జేడీ చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్‌తో తెలుగులో ఓ సినిమా జరుగుతోంది. ఈ సినిమా ద్వారా శ్రవణ్ అనే దర్శకుడిని పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు.

మ్యూజిక్ సిట్టింగ్స్‌లో
విక్రమ్ కే దాస్

ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కంచర్ల అచ్యుత రావు నిర్మించబోయే 8వ చిత్రం 'విక్రమ్ కే దాస్'. ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి.

అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిలో కథ, కథనంతో ఈ సినిమాని తెరకెక్కించబోతున్నారు. నిర్మాత కంచర్ల అచ్యుత రావు, దర్శకుడు బాలు పొలిచెర్ల ప్రత్యేక శ్రద్ధతో మ్యూజిక్ సిట్టింగ్స్‌లో పాల్గొంటున్నారు.


కంచర్ల ఉపేంద్ర

సంగీత దర్శకుడు పృథ్వీ వీనుల విందుగా సంగీతం అందిస్తున్నారు అని చిత్ర యూనిట్ నమ్మకంగా చెబుతోంది. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌తో రూపొందుతున్న చిత్రం అయినప్పటికీ సంగీతానికి కూడా మంచి ప్రాధాన్యత ఉంటుందని దర్శక, నిర్మాతలు చెబుతున్నారు.

ఈ బ్యానర్ మీద ఇప్పటికే 'ఉపేంద్ర గాడి అడ్డా' సినిమా విడుదలై, చక్కని విజయం అందుకుంది. కాగా, రెండవ సినిమాగా 'కంచర్ల' వచ్చే నెలలోనే విడుదల కానుంది. ఈ నేపథ్యంలో 8వ చిత్రంగా 'విక్రమ్ కే దాస్' సినిమాతో హీరో కంచర్ల ఉపేంద్ర మాస్ ఇమేజ్ సంపాదించడం ఖాయం అంటున్నారు. ఈ బ్యానర్ మీద ఒకేసారి ఎనిమిది సినిమాల నిర్మాణం జరగడం ఒక రికార్డుగా చెప్పుకుంటున్నారు.

పారిస్‌లో మను బాకర్ చరిత్ర సృష్టించింది. ఒలింపిక్ చరిత్రలోనే భారత్ ముందునెన్నడూ ఎరుగుని రికార్డును మను బాకర్ బద్దలుకొట్టింది. ఒకే ఒలింపిక్స్‌లో ఏకంగా రెండు మెడల్స్ సాధించిన ఏకైక భారత అథ్లెట్‌గా చరిత్ర పుటల్లో నిలిచింది. మహిళల 10మీ ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగత కాంస్యం సాధించిన మను బాకర్.. మంగళవారం 10మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సరబ్జోత్ సింగ్‌తో కలిసి బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకుంది. 2024 ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో పడిన రెండు కాంస్య పతకాలు మను బాకర్ సాధించినవే కావటం విశేషం.



మను చరిత్ర

పారిస్ 2024 ఒలింపిక్స్

- పారిస్‌లో రెండో కాంస్యం నెగ్గిన మను బాకర్
- మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్జోత్‌తో కలిసి పతక ప్రదర్శన

నవతెలంగాణ-పారిస్ :

యువ షూటర్ మను బాకర్ (22) పారిస్‌లో పతకాల వేట సాగిస్తోంది. మూడు రోజుల వ్యవధిలో మను బాకర్ ఏకంగా రెండు పతకాలు సాధించింది. మంగళవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం ఫైనల్లో మను బాకర్, సరబ్జోత్ సింగ్ జోడీ గురి అదిరింది. అర్హత రౌండ్‌లో మెప్పించి నేరుగా కాంస్య పతక పోరుకు చేరుకున్న మను బాకర్, సరబ్జోత్ సింగ్ 16-10తో దక్షిణ కొరియా షూటర్లపై ఘన విజయం సాధించారు. మూడో స్థానం కోసం జరిగిన పోటీలో విజయం సాధించి కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. ఈ విభాగంలో సెర్బియా స్వర్ణం సాధించగా, టర్కీ రజత పతకం ఖాతాలో వేసుకుంది.

సూపర్ జోడీ : లింగ సమానత్వం కోసం ఇటీవల ప్రవేశపెట్టిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ భారత్‌కు పతకాల పంట పండించింది. 12 ఏండ్లుగా షూటింగ్‌లో ఒలింపిక్ మెడల్ కోసం నిరీక్షిస్తున్న భారత్‌కు మను బాకర్ మూడు రోజుల్లోనే రెండు పతకాలు అందించింది. కాంస్య పతక పోరులో 13 సెట్ల పోటీలో మనోళ్లు 8 సెట్లలో పైచేయి సాధించారు. తొలి సెట్‌లో మను బాకర్ 10.2 స్కోరు చేయగా.. సరబ్జోత్ సింగ్ 8.6 స్కోరుతో గురి తప్పాడు. ఈ సెట్‌ను భారత్ కోల్పోయింది. కానీ ఆ తర్వాత వరుసగా నాలుగు సెట్లను మను బాకర్, సరబ్జోత్ సింగ్ గెల్చుకున్నారు. 21-2-19.9, 20.8-19.8, 20.7-20.5, 20.1-19.5తో లక్ష్యంపై గన్ ఎక్కుపెట్టారు. ఆ తర్వాత దక్షిణ కొరియా షూటర్లు గట్టి పోటీ ఇచ్చినా.. మరో నాలుగు సెట్లలో పైచేయి సాధించిన మనోళ్లు 16-10తో గెలుపు గీత తాకారు.

దక్షిణ కొరియా షూటర్లు లీ, జిన్‌లు భారత షూటింగ్ జోడీకి గట్టి పోటీ ఇచ్చారు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ప్రతి షూట్‌కు ఫలితం మారటంతో.. ఆరంభంలో సరబ్జోత్ సింగ్ చేసిన తప్పిదం పతక అవకాశాలను దెబ్బతీయలేదు. ఇప్పటికే పోటీపడిన రెండు ఈవెంట్లలో పతకాలు సాధించిన మను బాకర్ మరో మెడల్ రేసులో నిలిచింది. మహిళల 25 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో తెలుగు తేజం ఇషా సింగ్‌తో కలిసి పతక వేట సాగించనుంది.

క్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్

ఐర్లాండ్‌పై హాకీ ఇండియా గెలుపు



పారిస్ (ఫ్రాన్స్) : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నారు. గ్రూప్-సిలో వరుసగా రెండో విజయం సాధించిన సాత్విక్, చిరాగ్ జోడీ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచారు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నం.7 జోడీ ఫజర్, రియాన్ (ఇండోనేషియా)పై 21-13, 21-13తో వరుస గేముల్లో అలవోక విజయం సాధించారు. బ్యాడ్మింటన్ మెన్స్ డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్ మ్యాచులు గురువారం నుంచి ఆరంభం కానున్నాయి. మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీ నిరాశపరిచింది. వరుసగా మూడో ఓటమితో ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించింది. 15-21, 10-21తో ఆసీస్ జోడీ చేతిలో ఓడిన అశ్విని, క్రాస్టోలు గ్రూప్‌లో అట్టడుగు స్థానానికి పరిమితమయ్యారు.

మెరిసిన హర్మన్‌ప్రీత్ : భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డబుల్ గోల్స్‌తో కదం తొక్కాడు. ఒలింపిక్స్ హాకీ గ్రూప్-బిలో భారత్‌కు మరో విజయాన్ని అందించాడు. మంగళవారం ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-0తో విజయం సాధించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ 11, 19వ నిమిషాల్లో పెనాల్టీ స్పాట్, పెనాల్టీ కార్నర్ నుంచి గోల్స్ కొట్టాడు. పారిస్ ఒలింపిక్స్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్‌కు ఇది నాల్గో గోల్ కావటం విశేషం. వరల్డ్ నం.6 భారత్ మ్యాచ్‌లో ఎక్కువ శాతం ఆధిపత్యం చూపించింది. ఈ విజయంతో గ్రూప్-బిలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంది.

మెరిసిన బజన్ కౌర్ : భారత మహిళా ఆర్చర్ బజన్ కౌర్ వ్యక్తిగత విభాగంలో ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. పోలాండ్ ఆర్చర్‌పై 6-0తో విజయం సాధించి ముందంజ వేసింది. అంతకుముందు ఇండోనేషియా ఆర్చర్‌పై బజన్ కౌర్ 7-3తో విజయం సాధించింది. అంకిత తొలి రౌండ్లోనే పరాజయం పాలైంది.

2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి

ఆర్బిట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

- మొదటి విడత రైతులకూ నష్టపరిహారం పెంచివ్వాలి :తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి

'భారత్‌మాల' భూనిర్వాసితుల ర్యాలీ, ధర్నా



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

భారత్ మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జోగులాంబ గద్వాలలో స్థానిక వాల్మీకి కమ్యూనిటీ హాల్లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జికె.ఈదన్న అధ్యక్షతన నిర్వహించిన నిర్వాసిత రైతుల సదస్సులో నంద్యాల పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ బైటాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం.. భూమికి బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరకు అదనంగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి అభిప్రాయ సేకరణ మేరకే భూమి తీసుకోవాలని, కానీ రైతులను భయభ్రాంతులకు గురిచేసి భూమిని లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములతోపాటు బావులు, బోర్లు, పైపులైన్లు, చెట్లు కోల్పోయిన రైతులకు కూడా నష్టపరిహారం పెంచి ఇవ్వాలని చట్టం చెబుతున్నదని, కానీ ఇవేమీ పాటించకుండా రైతుల జీవనాధారమైన భూమిని లాక్కొని నిరాశ్రయులను చేస్తున్నారని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఆర్బిట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి రెండో విడత భూసేకరణ సందర్భంగా ఇచ్చిన అవార్డు ప్రకారం మొదటి విడత భూములు కోల్పోయిన రైతులకు కూడా నష్టపరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆరు మండలాల పరిధిలోని 19 గ్రామాల్లో రైతుల నుంచి రెండు విడతలుగా దాదాపు 800 ఎకరాల భూమి సేకరించి.. వారికి తగిన నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిప్పడం సరికాదన్నారు. రైతుల పొలాలకు వెళ్లేందుకు భారత్ మాల రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జిలను కూడా చాలా తక్కువ ఎత్తులో నిర్మించారని, దీనివల్ల రైతుల వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని, అందువల్ల ఎత్తు పెంచి బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కలెక్టర్ స్పందిస్తూ.. నష్టపరిహారం పెంచి ఇవ్వడం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, నెల లోపల రైతులందరికీ నష్టపరిహారం వస్తుందని తెలిపారు. సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. రైతులు కోల్పోయిన బావులు, బోర్లు, పైపులైన్లు, చెట్లకు అధికారుల నుంచి రిపోర్టులు తెప్పించుకొని పరిశీలిస్తామన్నారు. ఆ తర్వాత రైతుల ధర్నా వద్దకు సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్ వచ్చి కలెక్టర్ తరపున హామీ ఇచ్చారు. అనంతరం రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. నెలరోజుల లోపల సమస్యలు పరిష్కారం కానిచో మళ్లీ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.బాల్ రెడ్డి, కర్ణాటక ప్రాంత రైతు సంఘం రాయచూరు జిల్లా అధ్యక్షులు వీరన్న గౌడ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు నరసింహ, గట్టన్న, వివిధ మండలాల రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి సమగ్ర శిక్ష ఉద్యోగుల యత్నం



- ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్
- సీఎం మాట నిలబెట్టుకోవాలని నినాదాలు
- పోలీసులు, ఉద్యోగుల మధ్య తీవ్ర వాగ్వాదం
- పలువురు ఉద్యోగుల అరెస్ట్

నవతెలంగాణ- హిమాయత్ నగర్/ సుల్తాన్‌బజార్

సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. జిల్లాల నుంచి వందలాది మంది ఉద్యోగులు, నాయకులు తరలివచ్చి అసెంబ్లీకి ముట్టడికి బయల్దేరగా.. వారిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. దాంతో వారికి, ఉద్యోగులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆందోళన చేస్తున్న కొంత మందిని పోలీసులు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. 2023 సెప్టెంబర్‌లో సమ్మె చేసిన సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేసి బేసిక్-పే ఇస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి జి.ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ.. విద్యాశాఖ సమగ్ర శిక్ష విభాగంలో అంకిత భావంతో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు కనీస ఉద్యోగ భద్రత లేదన్నారు. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు బేసిక్-పే (మినిమమ్ టైం స్కేల్) కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలని కోరారు. పీటీఐలకు మిగతా ఎస్ఎస్ఏ ఉద్యోగుల మాదిరిగా 12 నెలల వేతనం ఇవ్వాలని, ఎస్-ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ.20 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉద్యోగులు జంగం సుమన్, సురేందర్, సహదేవ్, రమేష్, మల్లేష్, చందు, జడల రవీందర్, జానకీరామ్, మహేందర్, సూర్య కిరణ్, రాజేందర్, మంజుల, సంధ్యారాణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిని రక్షించటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. బెల్లంపల్లిలో ప్రారంభమైన సింగరేణి పరిరక్షణ యాత్ర మంగళవారం శ్రీరాంపూర్‌కు చేరుకుంది. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పైళ్ల ఆశయ్య, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావుతో కలిసి యాత్ర ను కొనసాగిస్తున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 3, 3ఏ, వర్క్‌షాప్, శ్రీరాంపూర్ ఉపరితల గనిలో గేట్ మీటింగ్, నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి కార్మికులను చైతన్య పరిచారు. కార్మికులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీసీ నుంచి శ్రీరాంపూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలోని సింగరేణి కార్మికుని విగ్రహానికి పూలమాల వేశారు.

ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. సింగరేణిలో కొత్త బొగ్గు బ్లాకులు సింగరేణికి కేటాయించకుంటే రానున్న మూడు సంవత్సరాల్లో బావులు మూతపడి మంచిర్యాల పట్టణం ఎడారిగా మారుతుందన్నారు. సింగరేణి ప్రాంత ప్రజల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. ప్రత్యక్షంగా సుమారు 40వేల మంది పర్మినెంట్, సుమారు 25వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, పరోక్షంగా లక్షలాదిమంది పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో రెండు బొగ్గు బ్లాక్‌లను వేలం వేశారని, ఆ వ్యతిరేకతతో సింగరేణి ప్రాంతాల్లో కార్మికులు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను గెలిపించుకున్నారని అన్నారు. ఇప్పుడు శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం వేస్తుంటే కాంగ్రెస్ చూస్తూ ఉంటోందని, వారికి కూడా కార్మికులు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సింగరేణి విద్యుదుత్పత్తి చేసి యూనిట్ రూ.4కు ఇస్తుంటే, ప్రయివేట్ సంస్థలు రూ.18కు అమ్ముతున్నాయని తెలిపారు.

సింగరేణి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి విడనాడాలని, సంస్థను ప్రయివేటుపరం చేయబోమని చెబుతూనే, మరోపక్క బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం అమానుషమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెద్దపల్లి జిల్లాలో పర్యటించిన సమయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి.. గనులను ప్రయివేటుపరం చేయబోమని పార్లమెంట్‌లో చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం సింగరేణిని ప్రయివేటుపరం చేయబోమంటూనే వేలంపాటలో పాల్గొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు నాలుకల ధోరణితో కార్మికులను, ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సింగరేణి సుమారు రూ.49వేల కోట్లు కేంద్రానికి డివిడెంట్ రూపంలో చెల్లించిందని, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేల కోట్లు సింగరేణికి బకాయి పడి ఉందని వివరించారు. ఇంత చేసినా కార్మికుల శ్రమతో సింగరేణి ప్రతి సంవత్సరం రూ.2నుంచి 3వేల కోట్ల లాభాల్లో ఉందని అన్నారు. ఇప్పటికైనా గతంలో ప్రయివేట్‌పరం చేసిన కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్‌లను సింగరేణికి అప్పగిస్తూ మిగతా గనుల వేలాన్ని ఆపాలని, లేనిపక్షంలో కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సింగరేణి పరిరక్షణ యాత్రలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, నాయకులు దుంపల రంజిత్ కుమార్, దూలం శ్రీనివాస్, గోమాస అశోక్, మీడివెల్లి రాజ్‌కుమార్, పాయిరాల రాములు, మహేష్, మోహన్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, కోశాధికారి చంద్రశేఖర్, చీఫ్ ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మిడివెల్లి శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఎల్‌టీసీజీపై పన్ను రద్దు చేయం

మంత్రి పంకజ్ చౌదరి వెల్లడి



న్యూఢిల్లీ : దీర్ఘకాలిక పెట్టుబడి లాభాల (ఎల్‌టీసీజీ)పై పన్నులను రద్దు చేసే ప్రతిపాదనేది లేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి స్పష్టం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేంద్రానికి ఎల్‌టీసీజీపై రూ.98,681 కోట్ల ఆదాయం సమకూరిందని మంత్రి మంగళవారం రాజ్యసభకు తెలిపారు. ఈక్విటీ ఓరియెంటెడ్ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలిక పెట్టుబడి లాభాలపై పన్ను విధానాన్ని 2018 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. రూ.లక్ష వరకూ ఆదాయంపై పన్ను రాయితీ, మిగతా పెట్టుబడులపై 10 శాతం ఎల్‌టీసీజీ పన్ను విధిస్తుంది. 2021-22లో రూ.86,075 కోట్ల ఎల్‌టీసీజీ పన్ను వసూలైందని మంత్రి తెలిపారు. 2022-23లో 15శాతం పెరిగి రూ.98,681 కోట్లుగా చోటుచేసుకుంది. 2018-19లో రూ.29,220 కోట్లు, 2019-20లో రూ.26,008 కోట్లు, 2020-21లో రూ.38,589 కోట్ల చొప్పున ఎల్‌టీసీజీ పన్నులు వసూళ్లయ్యాయని వెల్లడించారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈక్విటీలు లేదా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై ఎల్‌టీసీజీ పన్ను విధానాన్ని ఎప్పటి నుంచి రద్దు చేస్తారని సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పంకజ్ చౌదరి సమాధానం ఇచ్చారు. అటువంటి ప్రతిపాదనేదీ ప్రభుత్వం వద్ద లేదని స్పష్టం చేశారు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఎల్‌టీసీజీ పన్నును 10 నుంచి 12.5 శాతం వరకు పెంచుతూ మోడీ సర్కార్ తాజా బడ్జెట్‌లో నిర్ణయం తీసుకుంది. అదే విధంగా రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల వరకూ ఎల్‌టీసీజీ పన్ను మినహాయింపు పరిమితి పెంచింది. 12 నెలలకు పైగా గడువుతో మదుపు చేసిన పెట్టుబడులను దీర్ఘకాలిక పెట్టుబడులుగా పరిగణిస్తారు. షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను 15 శాతం నుంచి 20 శాతానికి పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇన్వెస్టర్ కంపెనీ షేర్లను ఏడాది లోపు విక్రయిస్తే వాటిని షార్ట్ టర్మ్‌గా, ఏడాది పైబడి షేర్లను విక్రయించకుండా ఉంటే లాంగ్‌టర్మ్ పెట్టుబడులుగా పరిగణిస్తారు.

చైనా పెట్టుబడులపై ఆంక్షల కొనసాగింపు

మంత్రి పియూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ : చైనా నుంచే వచ్చే విదేశీ పెట్టుబడులపై ఆంక్షలు కొనసాగుతాయని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. చైనా పెట్టుబడులను ప్రోత్సహించే ఆలోచన లేదని మంగళవారం ఆయన పార్లమెంట్‌లో తెలిపారు. చైనా పెట్టుబడులను స్వాగతించడం ద్వారా తయారీ, ఎగుమతులకు మద్దతు లభించనుందని బడ్జెట్‌కు ముందు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలిపారు. దీనిపై పీయూస్ గోయల్ తాజాగా మాట్లాడుతూ.. ఆర్థిక సర్వే తన కొత్త ఆలోచనలను, సొంత అభిప్రాయాలను ప్రస్తావిస్తుందని పేర్కొన్నారు. దానికి ప్రభుత్వం కట్టుబడాలనేది ఏమీ లేదన్నారు. చైనా నుంచి ఎఫ్‌డీఐలను ప్రోత్సహించడం ద్వారా దేశీయంగా తయారీని పెంచవచ్చని, తద్వారా ఇక్కడి నుంచి విదేశాలకు వస్తువులను ఎగుమతి చేయొచ్చని ఆర్థిక సర్వేలో మంత్రి సీతారామన్ పేర్కొన్నారు. అమెరికా, యూరప్ వంటి దేశాలు చైనాకు భారత్ ప్రత్యామ్నాయమని భావిస్తున్న నేపథ్యంలో ఆ ప్రయోజనాన్ని పొందొచ్చన్నారు. చైనా పెట్టుబడులను ఆహ్వానించి ఆ ఉత్పత్తులను ఎగుమతి చేయడం మెరుగైన ఆలోచనగా ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. 2020లో గల్వాన్ లోయలో చోటు చేసుకున్న ఉద్రికత్తత అనంతరం చైనా పెట్టుబడులపై భారత్ తీవ్ర ఆంక్షలు విధించింది. భారత్‌లోని సుమారు 200 చైనా యాప్‌లను నిషేధించింది. పొరుగు దేశాల ఎఫ్‌డీఐలకు కేంద్రం అనుమతిని తప్పనిసరి చేసింది. దీంతో అనేక పెట్టుబడులు వెనక్కి పోయాయి.

విస్తారా ఎయిర్‌లైన్స్‌లో ఉద్యోగులకు వీఆర్‌ఎస్

న్యూఢిల్లీ : టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంయుక్త భాగస్వామ్యంలోని విస్తారా విమానయాన సంస్థ ఉద్యోగులకు స్వచ్ఛంద విరమణ పథకం (వీఆర్‌ఎస్) ప్రకటించింది. దీంతో పాటు వాలెంటరీ సెపరేషన్ స్కీమ్‌నూ తీసుకొచ్చింది. నాన్ ఫ్లయింగ్ సిబ్బందికి దీన్ని వర్తింపజేయనుంది. వీటికి దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 23 వరకు ఉద్యోగులకు అవకాశం కల్పించింది. ఎయిరిండియాతో విలీనం వేళ వీటిని ప్రవేశపెట్టడం గమనార్హం. విస్తారాలో శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులు మొత్తంగా 6,500 మంది వరకు ఉంటారు. వీరిలో ఐదేండ్లు సర్వీసు పూర్తి చేసుకున్న నాన్ ఫ్లయింగ్ పర్మినెంట్ స్టాఫ్‌కు వీఆర్‌ఎస్‌ను ప్రకటించారు. పైలట్లు, క్యాబిన్ సిబ్బందిని మినహాయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిపై విస్తారా అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఎయిరిండియా, విస్తారాల్లో 23వేల ఉద్యోగులు ఉన్నారు. వీటి విలీనం తర్వాత 600 మంది నాన్ ఫ్లయింగ్ సిబ్బందిని తొలగించే అవకాశాలున్నాయని సమాచారం.

దేశంలో పసిడికి తగ్గిన డిమాండ్

అధిక ధరల ప్రభావం

న్యూఢిల్లీ : బంగారంపై అధిక ధరలు ఆ లోహం డిమాండ్‌ను దెబ్బతీశాయి. ప్రస్తుత ఏడాది ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో భారత బంగారం డిమాండ్‌లో 5 శాతం తగ్గి 149.7 టన్నులకు పడిపోయిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) మంగళవారం తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 158.1 టన్నులకు డిమాండ్ ఉంది. ఇదే సమయంలో విలువ పరంగా బంగారం డిమాండ్ రూ.82,530 కోట్లుగా ఉండగా.. గడిచిన త్రైమాసికంలో ఈ డిమాండ్ 17 శాతం పెరిగి రూ.93,850 కోట్లుగా నమోదయ్యింది. అధిక ధరలు, ఎన్నికల సమయం, తీవ్రమైన వడగాల్పుల కారణంగా ఆభరణాల డిమాండ్‌లో తగ్గుదల చోటు చేసుకుందని డబ్ల్యూజీసీ తెలిపింది. బంగారంపై ఇటీవల దిగుమతి సుంకాల తగ్గింపు నేపథ్యంలో భవిష్యత్‌లో డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.


గడిచిన జూన్ త్రైమాసికంలో గ్లోబల్ గోల్డ్ డిమాండ్‌లో 4.16 శాతం పెరిగి 1,258.2 టన్నులకు చేరిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో పసిడి డిమాండ్ 1,207.9 టన్నులుగా చోటుచేసుకుంది. ఇదే సమయంలో సగటున ఔన్స్ ధర 2,338 డాలర్లు ఉండగా.. గడిచిన జూన్ త్రైమాసికంలో ఔన్స్ పసిడి ధర రికార్డ్ స్థాయిలో 2,427 డాలర్లకు చేరింది. సెంట్రల్ బ్యాంకులు, ఓటీసీ మార్కెట్ నుంచి డిమాండ్ కారణంగా బంగారం ధరలు పెరిగాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ సీనియర్ మార్కెట్ అనలిస్ట్ లూయిస్ స్ట్రీట్ పేర్కొన్నారు.

బజాజ్ ఫైనాన్స్‌తో డైమ్లర్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ : సమగ్ర ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించేందుకు బజాజ్ ఫైనాన్స్‌తో ఒప్పందం కుదర్చుకున్నట్లు డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ తెలిపింది. తన వాణిజ్య వాహన వినియోగదారులు, డీలర్‌షిప్‌లకు భాగస్వామ్యం, ఆర్థిక పరిష్కారాలను అందించనున్నట్లు పేర్కొంది. ఇది తమ మొత్తం వాణిజ్య వాహన శ్రేణిలో ఫైనాన్సింగ్ ఎంపికల సౌలభ్యాన్ని, సౌకర్యాన్ని మెరుగుపరచే లక్ష్యంతో చేసుకున్న ఒప్పందమని డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ ప్రెసిడెంట్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శ్రీరామ్ వెంకటేశ్వరన్ తెలిపారు.

గ్రాన్యూల్స్ ఇండియా రికార్డ్ లాభాలు

హైదరాబాద్ : ఔషధ ఉత్పత్తుల కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా రికార్డ్ లాభాలను సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో



ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 181 శాతం వృద్ధితో రూ.134 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తోన్న ఈ కంపెనీ గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.48 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.985 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ1లో 20 శాతం పెరిగి రూ.1,180 కోట్లకు చేరింది. గడిచిన జూన్ త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు సాధించామని గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సీఎండీ కృష్ణప్రసాద్ చిగురుపాటి తెలిపారు. పేరా, ఏపీఐ, పీఎఫ్ఐ అమ్మకాల ధరల స్థిరీకరణలో క్షీణత ఉందని పేర్కొన్నారు.

కీలక రంగాలకు కేటాయింపులేవి?

సామాజిక రంగాలను పట్టించుకోని మోడీ ప్రభుత్వం



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదలు, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే అర్థమవుతుంది. వాస్తవానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంతోపాటు ఇతర సామాజిక సంక్షేమ పథకాలైన ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై), జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ), మధ్యాహ్న భోజన పథకం, ఐసీడీఎస్ (సమీకృత శిశు అభివృద్ధి సేవలు)కు 2019-20 బడ్జెట్ నుండే కేటాయింపులు తగ్గిపోయాయి. ఆరోగ్యం, విద్య వంటి సామాజిక రంగాలకు జరిపిన కేటాయింపులను చూస్తుంటే ఆ రెండు రంగాలకు ప్రభుత్వం పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదని బోధపడుతుంది.

భారత్‌ను సంపన్న దేశంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో వికసిత్ భారత్ ఎజెండా కోసం కృషి చేస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ పేదలు, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి దోహదపడే కీలక రంగాలకు ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు నిరాశాజనకంగా ఉన్నాయి. ఉదాహరణకు గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించారు. 2022-23 బడ్జెట్‌లో సవరించిన అంచనాలు కూడా ఇంతే మొత్తంలో ఉన్నాయి. గ్రామీణ సమాజం నుండి డిమాండ్ అధికంగా ఉన్నప్పటికీ ఈ పథకానికి కేటాయింపులు పెద్దగా పెంచలేదు. ప్రధానమంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ (పీఎం పోషణ్)కు మాత్రం కేటాయింపులను స్వల్పంగా... రూ.10,000 కోట్ల నుంచి రూ.12,467 కోట్లకు పెంచారు.

జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం, ఇందిరాగాంధీ జాతీయ దివ్యాంగుల పెన్షన్ పథకం, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం సహా జాతీయ సామాజిక సహాయ కార్యక్రమానికి మొత్తం బడ్జెట్‌లో కేటాయించింది కేవలం 0.2 శాతం మాత్రమే. ఐదు సంవత్సరాల లోపు వయసున్న చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, కౌమార దశలో ఉన్న బాలికల కోసం ఉద్దేశించిన సాక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 పథకానికి కూడా కేటాయింపులు స్వల్పంగానే పెరిగాయి. 2023-24లో దీనికి రూ.20,544 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో రూ.21,200 కోట్లు కేటాయించారు. రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రారంభించిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్)కి కేటాయింపులు పెంచలేదు. 2023-24లో రూ.60,000 కోట్లు కేటాయించగా ఇప్పుడు కూడా అంతే మొత్తాన్ని కేటాయించారు.

నిలకడైన వృద్ధి రేటుతో విధానాల రూపకల్పన

- రాష్ట్రం పేరు ప్రస్తావించకుంటే నిధులివ్వనట్లేనా?
- తెలంగాణ, ఏపీలోని రైల్వే ప్రాజెక్టులకే వేలకోట్లు : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న విశ్వాసాన్ని నిలుపుకుంటామని, నిలకడైన వృద్ధి రేటుతో ప్రజలే కేంద్రంగా విధానాలకు రూపకల్పన చేస్తామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బడ్జెట్ ప్రసంగంలో ఏదైనా రాష్ట్రం పేరు ప్రస్తావించనంత మాత్రాన ఆ రాష్ట్రానికి కేటాయింపులు జరపనట్లు కాదని తెలిపారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ సారి ఏ రంగానికి తక్కువ కేటాయింపులు చేయలేదన్నారు. బడ్జెట్ ప్రసంగంలోనే లేవని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ఆమె స్పందించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సభలో మాట్లాడిన వారితో పాటు బడ్జెట్ పట్ల ఆసక్తి కనబరిచిన సభ్యులందరికీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సారి రెండు రాష్ట్రాలకే అధిక కేటాయింపులు చేశామనడం సరికాదన్నారు. వరుసగా మూడోసారి ఎన్డీయేకు అధికారం ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్‌లో లోక్‌సభలో జరిగిన చర్చకు మంగళవారం ఆమె బదులిచ్చారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా మనమంతా కలిసి పని చేద్దామని నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. తాము ద్రవ్యలోటు కట్టడి లక్ష్యానికి అనుగుణంగా సాగుతున్నామని, 2025-26 నాటికి దాన్ని 4.5 శాతం దిగువకు తీసుకువస్తామని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లు బడ్జెట్ ప్రసంగంలో ఉంటాయా? అని నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అన్ని రాష్ట్రాల పేర్లను ప్రస్తావించారా? అని నిలదీశారు. 2004-05 నుంచి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల పేర్లు ప్రస్తావించలేదని గుర్తు చేశారు. అంత మాత్రానా అన్ని రాష్ట్రాలకు కేంద్రం నిధులు సమకూర్చలేదని అర్థమా? అని ప్రశ్నించారు.

తెలంగాణ, ఏపీకి వేలకోట్లిచ్చాం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సహా దేశంలోని అనేక రాష్ట్రాలకు వేలకోట్ల రూపాయలు ఇచ్చామని నిర్మలా సీతారామన్ తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లో బల్క్ డ్రగ్ పార్కుకు ప్రధాని నరేంద్ర మోడీ రూ.1900 కోట్లు ప్రకటించారని చెప్పారు. కర్నాటక, తమిళనాడు, తెలంగాణలో టెక్స్‌టైల్స్ పార్కులు ప్రకటించామని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మోటుమర్రి-విష్ణుపురం సెక్షన్లలో రైల్వే డబ్లింగ్ పనులకు నిధులు కేటాయించాం. భద్రాచలం, డోర్నకల్ సెక్షన్లలో రూ.770 కోట్లతో రైల్వే ప్రాజెక్టులకు నిధులు ఇచ్చాం. మొత్తంగా ఏపీ, తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.1,596 కోట్లు కేటాయించాం. తెలంగాణ-మహారాష్ట్రలో రూ.4686 కోట్లతో రైల్వే ప్రాజెక్టులకు నిధులు వెచ్చించాం. మహారాష్ట్రలోని వధావన్ ప్రాజెక్టుకు రూ.76 వేల కోట్లు ప్రకటించాం. కానీ బడ్జెట్‌లో ఆ పేరు ప్రకటించ లేదు. అంతమాత్రాన మహారాష్ట్రపై వివక్ష చూపినట్టేనా?. కేరళలో జాతీయ రహదారుల ప్రాజెక్టులకు రూ.9,667 కోట్లు కేటాయించాం. జాతీయ స్థాయిలో శాఖల వారీగా వేలకోట్లు నిధులు ప్రతిపాదిస్తాం. అన్ని రాష్ట్రాల్లో ఆయా శాఖలకు నిధులు ఇచ్చేనట్టే కదా? అవన్నీ రాష్ట్రాల వారీగా బడ్జెట్ ప్రసంగంలో చెప్పం కదా?" అని నిర్మలా సీతారామన్ తెలిపారు. బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలకు నిధులు కేటాయించామని, ఏ రాష్ట్రానికి వంచన జరగలేదని పేర్కొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఎగువన పడుతున్న వర్షాల నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వస్తున్నది. శ్రీశైలం జలాశయం పది గేట్లను ఎత్తి అధికారులు నీటిని కిందకు వదులుతున్నారు. క్రస్ట్ గేట్లు, పవర్ జనరేషన్, ఎత్తిపోతల కలిపి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 883.50 అడుగులుగా ఉంది. శ్రీశైలం నీటినిల్వసామర్థ్యం 235 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 207గా ఉంది.

గోదావరి బేసిన్

సింగూరు	29.917	14.56	1433	391
నిజాంసాగర్	17.800	3.81	640	0
శ్రీరాంసాగర్	80.500	35.54	17100	664
కడెం	7.600	6.44	2584	946
శ్రీపాద ఎల్లంపల్లి	20.175	17.42	5793	16081
మేడిగడ్డ	16.170	96.00(ఎం)	771580	771580
సమ్మక్కసాగర్	6.940	82.40(ఎం)	908340	908340
సీతమ్మసాగర్	36.570	53.70(ఎం)	961423	961423
భద్రాచలం	లెవెల్	45.27(ఎం)	845075	845075

టీఎక్రృష్ణా బేసిన్ రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు

ప్రాజెక్టు	నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీ)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీ)	వస్తున్న వరద (క్యూసెక్కులు)	వదులుతున్న నీరు (క్యూసెక్కులు)
ఆలమట్టి	129.72	70.12	301000	300000
నారాయణపూర్	37.64	27.48	285000	277869
జూరాల	9.66	8.32	300000	284597
తుంగభద్ర	105.79	101.66	70296	32387
శ్రీశైలం	215.81	207.41	402960	222534
నాగార్జునసాగర్	312.05	142.62	105710	6877
పులిచింతల	45.77	1.10	154	50

35 లక్షల కోట్ల డాలర్లను దాటిన

అమెరికా జాతీయ రుణం



తన జాతీయ రుణం 35 లక్షల కోట్ల డాలర్ల (35 ట్రిలియన్ డాలర్లు) మార్కును దాటిందని అమెరికా హౌస్ బడ్జెట్ కమిటీ సోమవారం ప్రకటించింది. దీనితో అమెరికా ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం మరింత తీవ్రతరం కానుంది. హౌస్ బడ్జెట్ కమిటీ అధిపతి, ప్రతినిధుల సభకు చెందిన టెక్సస్ శాసన సభ్యుడు జోడీ అరింగ్‌టన్ ఈ సంఘటనను "ఆందోళనకరమైన మైలురాయి"గా అభివర్ణించాడు.

జాతీయ రుణ వృద్ధిని పరిష్కరించడానికి మరింత ఆర్థిక, వ్యయ విషయాల పట్ల మరింత బాధ్యతగా వ్యవహరించాలని జోడీ అరింగ్‌టన్ కోరాడు. "ఈ రోజు చరిత్రలో అత్యంత శక్తివంతమైన, సంపన్న దేశం ఆర్థిక క్షీణతలో మరో సందేహాస్పద మైలురాయిని దాటటాన్ని మేము విచారిస్తున్నాం" అని అరింగ్టన్ ఒక ప్రకటనలో తెలిపాడు. నవంబర్ ఎన్నికలలో డొనాల్డ్ ట్రంప్ గెలిస్తే రిపబ్లికన్ పార్టీ పరిస్థితిని ఎలాగైనా మెరుగుపరచగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు.

ప్రెసిడెంట్ జో బైడెన్, అతనికి ముందు ప్రెసిడెంట్ ట్రంప్ నాయకత్వంలో అమెరికా జాతీయ రుణం ఇటీవలి సంవత్సరాల్లో విపరీతంగా పెరిగింది. ట్రంప్ పదవిని విడిచి పెట్టినప్పుడు కోవిడ్-సంబంధిత చర్యలకు సంబంధించిన రుణాల్లో సగానికి పైగా రుణాలు 8.4 ట్రిలియన్ డాలర్లకు పెరిగి 27.7 ట్రిలియన్ డాలర్లకు చేరాయి. ప్రస్తుత అధ్యక్షుడు ఇప్పుడు 35-ట్రిలియన్ మార్కును అధిగమించడంతో బైడెన్ హయాంలో ఈ ధోరణి కొనసాగింది. ట్రంప్ యుగంతో పోలిస్తే బైడెన్ పదవీకాలం మొదటి అర్ధ భాగంలో రుణ రేట్లు కొంత మందగించినప్పటికీ అవి ఇప్పుడు వేగవంతం అయ్యాయి. ఈ ఏడాది అమెరికా తన రుణానికి మరో ట్రిలియన్ డాలర్లను జోడించింది.

హౌస్ బడ్జెట్ కమిటీ లెక్కల ప్రకారం అమెరికా అప్పు ఇప్పుడు ఒక వ్యక్తికి 104,497 డాలర్లు, ఒక ఇంటికి 266,275 డాలర్లు, ఒక అమెరికన్ పిల్లవాడికి 483,889 డాలర్లు ఉంది. గత 12 నెలల్లో అమెరికా రుణం 2.35 ట్రిలియన్ డాలర్లు పెరిగింది. అమెరికా జాతీయ రుణం పెరుగుదల రేటు సెకనుకు 74,401 డాలర్లుగా ఉంది. అమెరికా అరాచక ఆర్థిక విధానాన్ని గత నెల చివరిలో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్) తీవ్రంగా విమర్శించింది. వాషింగ్టన్ బడ్జెట్ లోటు, రుణ రేట్లు మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు "పెరుగుతున్న ప్రమాదం" అని అంతర్జాతీయ ద్రవ్య నిధి పేర్కొంది.

లోక్‌సభ ఎన్నికల్లో 538 నియోజకవర్గాల్లో ఓట్ల వ్యత్యాసం

- పోలైన ఓట్ల కంటే, ఓట్ల లెక్కింపులోనే తేడా
- ఏడీఆర్ స్పష్టం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో 538 నియోజకవర్గాల్లో ఓట్ల వ్యత్యాసం ఉందని, పోలైన ఓట్లకు, ఓట్ల లెక్కింపు జరిగినప్పుడు నమోదైన ఓట్లకు చాలా వ్యత్యాసం ఉందని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 365 స్థానాల్లో పోలైన ఓట్ల కంటే 5,54,598 ఓట్లు తక్కువగా లెక్కించారని, 176 స్థానాల్లో పోలైన ఓట్ల కంటే 35,093 ఓట్లు అధికంగా లెక్కించారని తెలిపింది. తుది ఓటర్ల సంఖ్యకు సంబంధించిన డేటా విడుదలలో తీవ్ర జాప్యం జరిగిందని, డేటా అస్తవ్యస్తంగా ప్రకటించారని ఏడీఆర్ వ్యవస్థాపకులు జగదీప్ చొక్కర్ తెలిపారు. 538 లోక్‌సభ స్థానాల్లో ఓట్ల వ్యత్యాసం 5,89,691 ఉందని తెలిపింది. 10.49 శాతం ఓట్ల నుంచి, ఒక ఓటు వరకు తేడాలు ఉన్నాయని పేర్కొంది. 195 స్థానాల్లో ఎలాంటి తేడా లేదని తెలిపింది. అయితే ఈ ఓట్ల తేడా ఎన్ని సీట్లలో భిన్నమైన ఫలితానికి దారి తీస్తుందో ఏడీఆర్ పేర్కొనలేదు. ఈ విషయంపై ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి స్పందన వస్తుందో వేచి చూడాలి.

రైతు సంఘాలు, నిపుణుల అభిప్రాయాలమేరకే..

- రైతు భరోసాపై తుమ్మల వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు భరోసాపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతులు, రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణుల అభిప్రాయాలమేరకే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మంగళవారం బడ్జెట్ పద్దులపై బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వరరెడ్డి విమర్శలను తిప్పికొట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏమీ చేయడం లేదన్నట్టుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పంటలు పండించని పొలాలకు రైతు బంధు ఇచ్చింది నిజమా? కాదా? అని ప్రశ్నించారు. దీంతో రూ. 25వేల కోట్లు దుబారా చేసిందని ఆరోపించారు. వ్యవసాయంపై అవగాహన లేని ఆయనకు రైతు బంధు సమితి అధ్యక్షులు నియమించడం పొరపాటనీ, ఏ వైస్ చాన్స్‌లర్ పదవీ ఇస్తే సరిపోయేదని ఎద్దేవా చేశారు. ఐదేండ్లలో డ్రిప్, యాంత్రీకరణ, సబ్సిడీ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట పరిహారం తదితర సౌకర్యాలను రైతులకు అందించలేదని తెలిపారు.

ప్రభుత్వానికి వ్యవసాయ విధానమేది?

- బీఆర్ఎస్ సభ్యులు పల్లా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయ విధానంతోపాటు ఐటీ, విద్యా, రూరల్, అర్బన్ విధానాలే లేవని బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. వాటిపై పాలసీలు రూపొందించినా బయటకు చెప్పలేదా? అని ప్రశ్నించారు. మంగళవారం శాసనసభలో పద్దులపై ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్న సర్కారు అటువైపు అడుగులేయడం లేదని విమర్శించారు. ఇటీవల రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ కోసం దాదాపు రూ.40వేల కోట్లు అవసరమైతే, రాష్ట్ర ప్రభుత్వం రూ. 31 కోట్లకు పరిమితం చేయడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు విడతల్లో రూ.28వేల కోట్ల రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. రైతుబంధు, రైతుబీమా, యాంత్రీకరణ, రైతు వేదికల నిర్మాణం, ఏఈవోల నియామకం...వ్యవసాయాభివృద్ధి కోసం ఇలా అనేక కార్యక్రమాలు చేసినట్టు తెలిపారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇస్తామని ప్రభుత్వం తప్పించుకుంటున్నదని విమర్శించారు. పోడు సాగు చేసుకుంటున్న రైతులకు తమ ప్రభుత్వం రైతు బంధు ఇచ్చామన్నారు. తద్వారా యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. కౌలు రైతులకు, కూలీలకు ఆర్థిక సాయం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. కేంద్రం తెచ్చిన ఫసల్ బీమాను తెలంగాణతోపాటు కొన్ని రాష్ట్రాలు అమలు చేయడం లేదని చెప్పారు.

డిప్యూటీ తహసిల్దార్లకు కొత్త సర్వీస్ రూల్స్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిప్యూటీ తహసిల్దార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఉద్యోగ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు తెలంగాణ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) మెంబర్ కమిషనర్ నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జోన్ల వారీగా నియామకం, బదిలీలు, ప్రమోషన్లకు కొత్త సర్వీస్ రూల్స్ వర్తిస్తాయని పేర్కొంది. టీఎస్‌పీఎస్సీ ద్వారా నేరుగా నియామకం పొందిన వారికీ, వివిధ కేటగిరిల్లో పని చేసి నాయబ్ తహసిల్దార్లుగా ప్రమోషన్ పొందిన వారికి ప్రత్యేక నిబంధనలు పొందు పర్చారు.

పేరుకుపోతున్న నిరర్థక ఆస్తులు

- మార్చి నాటికి రూ. 4,80,687 కోట్లు ఎన్‌పిఎలు

న్యూఢిల్లీ : దేశంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు) పేరుకుపోతున్నాయి. కార్పొరేట్ కంపెనీలు తీసుకున్న రుణాలను ఈ పేరుతో కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన మాఫీ చేస్తోంది. ఈ ఏడాది మార్చి 3 నాటికి రూ.4,80,687 కోట్లు ఎన్‌పిఎలు ఉన్నాయని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. మరోవైపు సహకార రంగ బ్యాంకింగ్ రంగాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోంది. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలో 78 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు మూసివేత అయినట్లు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉరవకొండ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్, తెలంగాణలో వాసవి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, గోకుల్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మూసివేశారు.

మోతీలాల్ ఓస్వాల్ మొబిక్ 7వ ఎడిషన్ ఏర్పాటు

ముంబయి : మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఎంఓఎఫ్ఎస్-ఎల్) 7వ ఎడిషన్ మోతీలాల్ ఓస్వాల్ బిజినెస్ ఇంపాక్ట్ కాన్ఫరెన్స్ (మొబిక్)ని నిర్వహించినట్లు తెలిపింది. ముంబయిలో జులై 27, 28 తేదీల్లో దీన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. దేశ వ్యాప్తంగా ఫ్రాంచైజ్ నెట్‌వర్క్, అలాగే బ్రోకింగ్ సేవలలో అత్యుత్తమతను గుర్తించాలనే లక్ష్యంతో దీన్ని నిర్వహించినట్టు తెలిపింది. దేశంలో డిమ్యాట్ ఖాతాలు భారీగా పెరిగాయని.. స్టాక్ మార్కెట్లపై ఆసక్తి పెరిగిందని ఎంఓఎస్ఎఫ్ఎల్ సీఈఓ మోతిలాల్ ఓస్వాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి 1800 పైగా ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు.